

'పారిశ్రామిక రంగానికి దీటుగా సేద్యరంగం ఎదగాలి. వ్యవసాయ ఫలాలు పదింతలు పెరగాలి'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 205

బుధవారం 16-10-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL





**తనను తాను గెలిపించుకుంది** - ఫ్యామిలీలో



**శభాష్ సాయిప్రణీత్**

డెన్మార్క్ ఓపెన్ తొలి రౌండ్‌లో లిన్ డాన్‌పై సంచలన విజయం –స్పోర్ట్స్‌లో

# చర్చలు జరపండి



4 వేల బస్సులు నడపట్లేదని, మిగిలిన 6 వేల బస్సులే నడుస్తున్నాయని మీరే (ప్రభుత్వం) చెబుతున్నారు. అలాంటప్పుడు ప్రయాణికులు ఎవరూ ఇబ్బందులు పడట్లేదంటే ఎలా? మరి ప్రజలకు ఇబ్బందులేవీ లేనప్పుడు విద్యాసంస్థలకు దసరా సెలవులు ఎందుకు పొడిగించారు? – హైకోర్టు ధర్మాసనం

## ఆర్టీసీ కార్మికులు, ప్రభుత్వానికి హైకోర్టు సూచన

- దసరా సెలవులు ఎందుకు పొడిగించారు..?
- సమ్మె చట్ట విరుద్ధమంటే ఏం చేస్తారు..?
- ఇరుపక్షాలకు ప్రశ్నలు సంధించిన ధర్మాసనం
- ఆర్టీసీని విలీనం చేసేది లేదన్న ప్రభుత్వం
- చట్ట ప్రకారమే సమ్మె చేస్తున్నామన్న యూనియన్

సాక్షి, హైదరాబాద్

ఆర్టీసీ కార్మికులు సమ్మెకు స్వస్తి పలకాలని, వారితో ప్రభుత్వం చర్చలు జరిపి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని హైకోర్టు ధర్మాసనం సూచించింది. ఆర్టీసీ కార్మికుల డిమాండ్లు న్యాయ సమ్మతం అవునో కాదో పక్కనబెడితే.. దసరా పండుగకు ముందు సమ్మె ప్రారంభించి ప్రజలను ఎందుకు ఇబ్బందులకు గురి చేశారని ఆర్టీసీ జేఏసీ తరపు న్యాయవాదిని ప్రశ్నించింది. ఈ నెల 5 నుంచి సమ్మె మొదలైతే ఇప్పటివరకు చర్చలు జరిపేందుకు ఎందుకు చొరవ చూపలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. మీరేమైనా బ్రిటిష్ పాలనలో ఉన్నారా.. మీ ఇద్దరి మధ్య ఏమైనా టగ్ ఆఫ్ వార్ ఆట జరుగుతోందా అంటూ ధర్మాసనం ఇరు పక్షాలను ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఎస్మా ప్రయోగించినా, సమ్మె చట్ట విరుద్ధమని హైకోర్టు ప్రకటించినా పరిస్థితులు ఎలా ఉంటాయో ఊహించుకోవాలని హైకోర్టు పరోక్షంగా ఆర్టీసీ జేఏసీని హెచ్చరించింది. సమ్మె వల్ల ప్రయాణికులు ఇబ్బందుల పాలవుతున్నారని, వెంటనే సమ్మె విరమించేలా మధ్యంతర

మిగతా 2వ పేజీలో ▶

## 11వ రోజూ ఉధృతంగా సమ్మె

## సమ్మెకు సపోర్ట్

టీఎన్‌జీవో, టీజీవోల మద్దతు

- వివరాలు 2లో

మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలో ఆర్టీసీ కార్మికుల నిరసన ర్యాలీ





మంగళవారం ఢిల్లీలో ప్రధాని మోదీని కలసి జ్ఞాపికను బహూకరిస్తున్న రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

# ఆర్టీసీ సమ్మెపై కేంద్రానికి నివేదిక

## ప్రధాని, కేంద్ర హోంమంత్రితో గవర్నర్ తమిళిసై భేటీ

**సాక్షి, న్యూఢిల్లీ:** రాష్ట్రంలో ఆర్టీసీ సమ్మె ప్రభావంపై కేంద్రానికి గవర్నర్ నివేదించినట్లు సమాచారం. మంగళవారం ఢిల్లీ వెళ్లిన గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో వేర్వేరుగా భేటీ అయ్యారు. ఆర్టీసీ కార్మికులు తమ డిమాండ్ల సాధనకు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు దిగడం, ఆత్మహత్యలు చేసుకుంటుండటం.. బస్సుల్లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులపై కేంద్రం నివేదిక కోరినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో తమిళిసై ఢిల్లీ పర్యటనకు వెళ్లినట్లు తెలుస్తోంది. పైగా గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టాక తొలిసారిగా ఆమె ప్రధానిని కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితిని వివరించినట్లు తెలుస్తోంది. ఆర్టీసీ కార్మికుల సమ్మె ప్రభావం, సమ్మెపై ప్రభుత్వ, ప్రజా, రాజకీయ వర్గాల వైఖరి, ప్రభుత్వ ప్రత్యామ్నాయ చర్యలు సహా పలు అంశాలపై ప్రధానికి నివేదించినట్లు సమాచారం. అనంతరం కేంద్ర హోం మంత్రి అమిత్ షాను ఆయన నివాసంలో కలసిన గవర్నర్.. రాష్ట్రంలోని పరిస్థితులపై ఆయనకు వివరించారు. ప్రధాని, కేంద్ర హోం మంత్రితో భేటీ సందర్భంగా తెలంగాణ రాజ్‌భవన్‌లో చేపట్టిన వినూత్న కార్యక్రమాలు, ప్లాస్టిక్‌పై నిషేధం, యోగా తరగతులు, రెడ్ క్రాస్ సొసైటీతో కలసి రక్తదాన శిబిరాల ఏర్పాటు వివరాలు కూడా గవర్నర్ తెలిపినట్లు రాజ్‌భవన్ ఓ ప్రకటనలో తెలిపింది.

## న్యూస్‌రీల్

### ఎట్‌వుడ్, బెర్నర్‌డైన్‌లకు బుకర్ ప్రైజ్



మార్గరెట్ ఎట్‌వుడ్ (కెనడా), బెర్నర్‌డైన్ (ఆంగ్లోనైజీరియా) 2019కిగాను బుకర్ ప్రైజ్ విజేతలుగా నిలిచారు. ఎట్‌వుడ్ 'ద టెస్టమెంట్', బెర్నర్ డైన్ 'గర్ల్, ఉమన్, అదర్' పోటీపడటంతో ఈసారి ఇరువురినీ విజేతలుగా ప్రకటించారు.

- వివరాలు 4లో

### ప్రఫుల్‌కు ఈడీ సమన్లు



ఎన్సీపీ నేత ప్రఫుల్ పటేల్‌కు ఈడీ సమన్లు జారీ చేసింది.దావూద్ ఇబ్రహీంకు సన్నిహితుడైన డ్రగ్స్ సరఫరాదారు ఇక్బాల్ మిర్చి భార్యతో చేసిన వ్యాపార లావాదేవీలపై మనీలాండరింగ్ అభియోగాలు మోపింది.

- వివరాలు 4లో

### ఈడీ కస్టడీకి చిదంబరం!



ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులోని నగదు అక్రమ చలామణికి సంబంధించి చిదంబరాన్ని ఈడీ అరెస్ట్ చేసే చాన్స్ ఉంది. ప్రస్తుతం తీహార్ జైల్లో ఉన్న ఆయన్ను విచారించేందుకు, అవసరమైతే అరెస్ట్ చేసేందుకు కోర్టు అనుమతిచ్చింది.

- వివరాలు 4లో

### నేటితో 'అయోధ్య' వాదనలు పూర్తి!

- వివరాలు 4లో

# 23 తర్వాత సమ్మె!

## తెలంగాణ ఎలక్ట్రిసిటీ ట్రేడ్ యూనియన్స్ ఫ్రంట్ హెచ్చరిక



- విద్యుత్ సంస్థలతో చర్చలు విఫలమైనట్లు ప్రకటన.. యాజమాన్యాల వైఖరిని తప్పుబట్టిన ఫ్రంట్ నేతలు
- ఇటు చర్చలు సఫలమయ్యాయన్న టీఆర్‌ఎస్‌కేవీ..

సాక్షి, హైదరాబాద్

తెలంగాణ విద్యుత్ సంస్థల యాజమాన్యాలతో మంగళవారం సాయంత్రం విద్యుత్ సౌధలో జరిపిన చర్చలు విఫలమయ్యాయని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ట్రేడ్ యూనియన్స్ ఫ్రంట్ (టీటఫ్) ప్రకటించింది. గతంలో ప్రకటించిన విధంగా మంగళవారం మింట్ కాంపౌండ్‌లోని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎస్పీడీసీఎల్) ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా యథాతథంగా నిర్వహిస్తామని పేర్కొంది. ఈ నెల 23న వరంగల్‌లో మహాసభ నిర్వహించి సమ్మెపై ప్రకటన చేస్తామని టీటఫ్ చైర్మన్ ఎన్.పద్మారెడ్డి, కన్వీనర్ ఇ. శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. 23వ తేదీ తర్వాత ఏ క్షణంలోనైనా సమ్మెకు దిగుతామని యాజమాన్యాన్ని హెచ్చరించారు.

**అన్యాయమే జరిగింది: టీటఫ్**

విద్యుత్ సంస్థల్లో ఆర్టిజన్లుగా విలీనమైన ఔట్ సోర్సింగ్ కార్మికులకు ఏపీఎస్ఈబీ సర్వీసు రూల్స్ వర్తింపజేస్తే న్యాయపర ఇబ్బందులు ఎదురవుతాయని యాజమాన్యం తేల్చి చెప్పడంతోపాటు ఇతర డిమాండ్లపై దాటవేత వైఖరిని ప్రదర్శించడంతో చర్చల నుంచి వైదొలిగామని టీటఫ్ నేతలు తెలిపారు. విద్యుత్ సంస్థల యాజమాన్యాల తరపున ట్రాన్స్‌కో జేఎండీ చెరుకూరి శ్రీనివాసరావు నేతృత్వంలో డైరెక్టర్ల బృందం టీటఫ్‌తో గంట పాటు చర్చలు నిర్వహించింది. ఆర్టిజన్లకు ఏపీఎస్ఈబీ సర్వీసు రూల్స్ వర్తింపజేయడం సాధ్యం కాదని, వీటికి బదులుగా స్టాండింగ్ ఆర్డర్స్‌ను వర్తింపజేస్తామని స్పష్టం చేసింది. ఆర్టిజన్లకు మూలవేతనాన్ని త్వరలో ఖరారు చేస్తామని, డీఏ స్థానంలో వీడీఏ పాయింట్లు ఇస్తామని, చనిపోయిన ఆర్టిజన్ల స్థానంలో వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగావకాశం కల్పిస్తామని పేర్కొంది. ఆర్టిజన్లకు ఏపీఎస్ఈబీ రూల్స్ వర్తింపజేయడంతో పాటు డీఏ, టీఏ, హెచ్‌ఆర్‌ఏ, పీఆర్సీని వర్తింపజేయాలని చర్చల్లో టీటఫ్ పట్టుబట్టింది. 1999 ఫిబ్రవరి 1 నుంచి సర్వీసులో చేరిన విద్యుత్ ఉద్యోగులందరికీ ఈపీఎఫ్‌కు బదులు జీపీఎఫ్ పెన్షన్ పథకాన్ని వర్తింపజేయాలన్న డిమాండ్‌పై సీఎం కేసీఆర్, విద్యుత్ శాఖ మంత్రి జి.జగదీశ్‌రెడ్డితో చర్చించాల్సి ఉందని, ఇందుకు

మిగతా 2వ పేజీలో ▶



## కొత్త పురపాలికల్లో ఎల్‌ఆర్‌ఎస్

- లే అవుట్లలోని స్థలాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అనుమతి.. గతేడాది మార్చి 30లోపు రిజిస్టర్ అయిన స్థలాలకు వర్తింపు
- రూ. 10 వేలతో ఆన్‌లైన్‌లో 90 రోజుల్లో దరఖాస్తులకు వెసులుబాటు

5లో

# ఆడవారిదే 'ఆయువు'పట్టు!

**ప్రపంచంలో మగాళ్ల కంటే ఆడవారి జీవితకాలమే ఎక్కువ**

| మహిళల సరాసరి జీవితకాలం | 2019 ఆరోగ్య గణాంకాల నివేదికలో డబ్ల్యూహెచ్‌వో | పురుషుల సరాసరి జీవితకాలం |
|---|---|---|
| 74.2 సంవత్సరాలు | భారత్‌లో మహిళల సగటు జీవిత కాలం 70.3 ఏళ్లు.. పురుషులది 67.4 ఏళ్లు | 69.8 సంవత్సరాలు |

**ప్రపంచంలో సగం మందికి అత్యవసర వైద్యం అందడం లేదని ఆవేదన**

**సాక్షి, హైదరాబాద్:** ప్రపంచంలో మగవారి ఆయుర్దాయం కంటే ఆడవారిదే ఎక్కువని తేలింది. మగవాళ్ల కన్నా ఆడవాళ్లే ఎక్కువ కాలం జీవిస్తున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. ప్రపంచ ఆరోగ్య గణాంకాల నివేదిక–2019ను తాజాగా విడుదల చేసింది. దాని ప్రకారం ప్రపంచంలో వివిధ దేశాల్లో ప్రజల జీవిత కాలాన్ని, ఆరోగ్య రంగంలో ఆయా దేశాల స్థానాన్ని విశ్లేషించింది. ప్రపంచంలో సరాసరి మహిళలు 74.2 ఏళ్లు జీవిస్తుండగా, మగవారు 69.8 ఏళ్లు బతుకుతున్నారని పేర్కొంది. అయితే అదనంగా మహిళలు బతికే 4.4 ఏళ్లు కూడా ఒంటరితనం, పేదరికం, వ్యాధులతోనే కాలం గడుపుతున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. అదే భారత్‌లో పురుషులు సరాసరి 67.4 ఏళ్లు, మహిళలు 70.3 ఏళ్లు బతుకుతున్నారని తేల్చింది. అంటే 2.9 ఏళ్లు అధికంగా మహిళల జీవితకాలం ఉంది. జపాన్‌లో ప్రపంచంలోనే

మిగతా 5వ పేజీలో ▶



## రైతు బాగుంటేనే అభివృద్ధి

- అందుకే చెప్పినదానికంటే మిన్నగా భరోసా
- వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్ పథకం ప్రారంభోత్సవంలో ఏపీ సీఎం జగన్
- ఏటా రూ.13,500 చొప్పున ఐదేళ్లలో రూ.67,500 ఇస్తాం
- 40 లక్షల కుటుంబాలకు ఇప్పుడే లబ్ధి..

- 13లో













## ఇదంజగత్



... కానీ కాంగ్రెస్‌ను సపోర్ట్ చేయం. టీఆర్‌ఎస్ గెలిస్తే మనం కాంగ్రెస్‌కు సపోర్ట్ చేయలేదు కాబట్టి.. కాంగ్రెస్ గెలిస్తే టీఆర్‌ఎస్‌కు మనం మద్దతు ఇవ్వలేదు కాబట్టి.. అలా నడిపిద్దాం!

## క్లుప్తంగా...

### చర్చల ప్రసక్తే లేదు

**ఆర్టీసీ సమ్మెపై వెనక్కి తగ్గని ప్రభుత్వం**

**సాక్షి, హైదరాబాద్:** ఆర్టీసీ కార్మిక సంఘాలతో చర్చల పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధతతో ఉందని జరిగిన ప్రచారాన్ని సీఎం కార్యాలయ వర్గాలు తోసిపుచ్చాయి. కార్మిక జేఏసీతో చర్చలకు టీఆర్ఎస్ పార్లమెంటరీ నేత కె.కేశవరావు మధ్యవర్తిత్వం వహించనున్నారని జరిగిన ప్రచారాన్ని కేశవరావుతో పాటు సీఎంవో వర్గాలు మంగళవారం కొట్టిపడేశాయి. కేశవరావుకు సీఎం కేసీఆర్ అలాంటి సూచనలేవి చేయలేదని ఓ అధికారి పేర్కొన్నారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశిస్తే జేఏసీతో చర్చలు పునరుద్ధరించాలని ప్రభుత్వం భావిస్తోంది.

### లచ్చిరెడ్డి వర్గంలో చీలిక

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ డిప్యూటీ కలెక్టర్ల సంఘంలో చీలిక ఏర్పడింది. ఆర్టీసీ కార్మికుల సమ్మె ఇందుకు కారణమైంది. ఈ సంఘానికి అధ్యక్షుడిగా ఉన్న లచ్చిరెడ్డి వ్యవహారశైలితో విభేదించిన పలువురు కార్యవర్గ సభ్యులు.. సంఘం నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించారు. ఇటీవల ప్రభుత్వ విధానాలను ఎండగడుతున్న లచ్చిరెడ్డి.. ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపారు. దీంతో ఆయన ఏకపక్ష నిర్ణయాలతో తమకెలాంటి సంబంధం లేదని ప్రకటించిన అసోసియేట్ ప్రెసిడెంట్ కె.చంద్రకళ సహా ఉపాధ్యక్షుడు చెన్నయ్య, రవీందర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.వెంకటరెడ్డి, కార్యదర్శి ఎల్.రమేశ్, సభ్యులు రాజేశ్వర్, జయచంద్రరెడ్డి, రాజాగౌడ్, రాజేంద్ర కుమార్ సంఘానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించడమేగాకుండా.. ఈ విషయాన్ని సీఎస్‌కు తెలిపారు.

### చర్చలతో సమ్మె పరిష్కరించాలి: సీపీఎం

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆర్టీసీ కార్మిక సంఘాలను చర్చలకు పిలిచి సమ్మె పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీపీఎం నేతలు బీవీ రాఘవులు, తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. మంగళవారం ఎంబీభవన్‌లో మాట్లాడుతూ.. ఆర్టీసీ ఆస్తులను ప్రైవేటుపరం చేయాలనే ఉద్దేశం ప్రభుత్వానికి లేకపోతే చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. నోటీస్ ఇచ్చి సమ్మె చేస్తున్న కార్మికులతో చర్చలు జరపకపోవడం ప్రజాస్వామ్యదేశంలో తప్పుడు పద్ధతని చెప్పారు. సీఎం కేసీఆర్ మొండివైఖరి వీడకపోతే చంద్రబాబుకు పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. 19న రాష్ట్రబంద్ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాగా, సమ్మెపై కేంద్ర వైఖరికి వ్యతిరేకంగా బుధవారం మండల, జిల్లా కేంద్రాల్లో రాస్తారోకోలు నిర్వహిస్తామని తెలిపారు.

### బంద్‌కు మద్దతు:చెన్నయ్య

**సాక్షి, హైదరాబాద్:** ఆర్టీసీ కార్మికులు ఈనెల 19న పిలుపునిచ్చిన బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య అన్నారు. కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించి, వారి డిమాండ్లను నెరవేర్చాలని మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

### సమ్మె మరింత ఉధృతం

- బంద్‌కు మద్దతుగా నేడు సామూహిక దీక్షలు: వామపక్ష పార్టీలు

**సాక్షి, హైదరాబాద్:** టీఆర్ఎస్ ప్రభుత్వం పంతాలకు పోకుండా ఆర్టీసీ జేఏసీ నేతలను చర్చలకు పిలిచి వారి డిమాండ్లను పరిష్కరించకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామని వామపక్ష పార్టీలు ప్రకటించాయి. ఆర్టీసీ కార్మికులు ఈనెల 19న ఇచ్చిన రాష్ట్ర బంద్ పిలుపునకు మద్దతుగా బుధవారం సామూహిక దీక్షలు చేపట్టాలని నిర్ణయించాయి. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో ఇందిరాపార్కు వద్ద, జిల్లా కేంద్రాల్లో అన్ని కలెక్టరేట్ల ఎదుట, అన్ని మండల కేంద్రాల్లో దీక్షలు నిర్వహించనున్నాయి. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో తమ్మినేని వీరభద్రం, జి.నాగయ్య, డీజీ నరసింహారావు, (సీపీఎం), బాలమల్లేశ్ (సీపీఐ), వేములపల్లి వెంకటరామయ్య, పోటు రంగారావు, సూర్యం, సాధినేని వెంకటేశ్వరరావు, గోవర్ధన్ (న్యూడెమోక్రసీ రెండు గ్రూపులు), జానకిరాములు (ఆర్ఎస్‌పీ), తాండ్రకుమార్ (ఎంసీపీఐ-యూ), మురహరి (ఎస్‌యూసీఐ-సీ), ప్రసాద్ (సీపీఐ-ఎంఎల్), రాజేశ్ (లిబరేషన్) ఆర్టీసీ కార్మికులకు మద్దతు ప్రకటించారు.

# తిండి తెలుసుకోండి



**తిండి కలిగితే కండ కలదోయ్..**
**కండ కలవాడే మనిషోయ్..**

అని అప్పుడెప్పుడో ఓ మహాకవి కవితలు అల్లేశారు గానీ.. ఈ కాలంలో ఇదో సమస్య.

**ఏం తినాలి? ఏం తినకూడదన్న అవగాహన చాలా మందిలో లేదు**

అందుకే అటు పట్టణాల్లో.. ఇటు పల్లెల్లోనూ రక్తపోటు, మధుమేహం, గుండెజబ్బుల్లాంటివి పెచ్చరిల్లుతున్నాయి. నేడు 'ప్రపంచ ఆహార దినోత్సవం'సందర్భంగా తిండి సంగతులు కొన్ని చెప్పుకుందాం..

- ✔ చురుకైన, జబ్బుల ప్రమాదం తక్కువగా ఉన్న జీవితం కావాలనుకుంటున్నారా? అయితే సురక్షితమైన, పోషకాలతో కూడిన, వైవిధ్యభరితమైన ఆహారం తీసుకోండి.
- ✔ పండ్లు, కూరగాయలు, పప్పుధాన్యాలతో పాటు గింజలు, విత్తనాలు, పల్లీలు, శనగలు, ఉలవలు, బొబ్బర్లు, జీడిపప్పు, బాదం, వాల్‌నట్స్ వీలైనంత రోజూ తీసుకోండి.
- ✔ భారతీయులు రోజూ కనీసం 400 గ్రాముల కాయగూరలు, పండ్లు తీసుకోవాలని భారత పోషకాహార సంస్థ చెబుతోంది. రాగులు, జొన్నలు, వరి, గోధుమ వంటి ధాన్యాన్ని మరపట్టించకపోవడం మేలు. కొవ్వులు, మరీ ప్రత్యేకంగా సంతృప్త కొవ్వులు, చక్కెర, ఉప్పు వాడకాన్ని మితంగా ఉంచుకోవడం మేలు.
- ✔ ఆరోగ్యంలో పౌష్టికాహారం పాత్ర ఎంత ఉందో.. తగు మోతాదులో రోజూ వ్యాయామం చేయడం కూడా అంతే ముఖ్యం.
- ✔ మరిన్ని వివరాల కోసం జాతీయ పోషకాహార సంస్థ సిద్ధం చేసిన వెబ్‌పేజీ http://te.vikaspedia.in/health/nutrition చూడండి. ఏ ఆహారంతో ఎలాంటి ప్రయోజనం ఉంటుందో. కొన్ని ఆరోగ్య సమస్యలను ఆహారంతో ఎలా అధిగమించవచ్చో ఇందులో విపులంగా అందించారు.
- ✔ మీరు తినే ఆహారంతో ఎన్ని కేలరీలు అందుతున్నాయో తెలుసు కోవాలనుకుంటే.. http://count&what&you&eat.ninindia. org:8080/CountWhatYouEat/Receipes.do లింక్ వాడండి.

## మీకు తెలుసా ?

**30,000** భూమ్మీద మనిషి తినగలమొక్క జాతుల సంఖ్య

**200** సాగవుతున్న పంటల సంఖ్య

**8** 50 శాతం కేలరీలు అందిస్తున్న పంటలు (బార్లీ, బీన్స్, వేరుశనగ, మొక్కజొన్న, బంగాళదుంప, వరి, జొన్న, గోధుమ)

**140 లక్షల కోట్లు** ఊబకాయ సంబంధిత ఆరోగ్య సమస్యలపై ప్రపంచవ్యాప్తంగా ఏటా ప్రభుత్వాలు పెడుతున్న ఖర్చు

అసాంక్రమిక వ్యాధులతో జరిగే మరణాల్లో అనారోగ్యకరమైన ఆహారం , శారీరక శ్రమలేమితో జరిగేవి ముందు వరసలో ఉన్నాయి.

**82 కోట్లు** ఆకలితో బాధపడుతున్న వారి సంఖ్య

**14.9 కోట్లు** పోషకాహార లోపం కారణంగా సామర్థ్యానికి తగ్గట్టు ఎదగని ఐదేళ్లలోపు పిల్లలు

**4.9 కోట్లు** అధిక ఆహారం కారణంగా సమస్యలు ఎదుర్కొంటున్న ఐదేళ్ల లోపు పిల్లలు

**67 కోట్లు** ఊబకాయ సమస్యతో ఉన్న వాళ్లు

**12 కోట్లు** ఊబకాయులైన (5 -19 మధ్య వయస్కులు) పిల్లల సంఖ్య

ఊబకాయులుగా ఉన్న ఐదేళ్లలోపు పిల్లలు **4 కోట్లు**

## నేను కార్మికుల పక్షపాతిని: కేకే

- రాజ్యం వైపు ఎప్పుడూ ఉండను..
- సీఎం ఆదేశిస్తే మధ్యవర్తిత్వం



**సాక్షి, హైదరాబాద్:** సీఎం ఆదేశిస్తే ఆర్టీసీ కార్మికులకు, ప్రభుత్వానికి మధ్యవర్తిత్వం చేసేందుకు సిద్ధంగా ఉన్నానని టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత, సెక్రటరీ జనరల్ కె.కేశవరావు పేర్కొన్నారు. మంగళవారం తన నివాసంలో మాట్లాడుతూ.. తాను కార్మికుల పక్షపాతినని, ఆర్టీసీ కార్మికుల సమ్మెతో పరిస్థితులు చేజారుతున్నాయనే అనుమానంతోనే తాను లేఖ విడుదల చేశానని పేర్కొన్నారు. 'నేను సోషలిస్టును. రాజ్యం వైపు ఎప్పుడూ ఉండను. కార్మికుల వైపే ఉంటాను. ఉద్యోగ సంఘాలు కొట్టుకోకుండా కలసికట్టుగా ఉండాలి. ఆర్టీసీ కార్మికుల ఆత్మహత్యలు బాధించాయి. ప్రభుత్వం, ఆర్టీసీ నడుమ చర్చలు జరగాలి. సీఎంతో మాట్లాడే ప్రయత్నం చేస్తున్నా. ఇంకా సీఎం అందుబాటులోకి రాలేదు. నా ప్రకటనతో ఆర్టీసీ కార్మికుల్లో ఆశలు పెరిగిన మాట వాస్తవమే. ఆర్టీసీ కార్మికులతో చర్చలు జరుపుతానని నేను అనలేదు. అయినా సరే మంచి జరుగుతుందనుకుంటే మధ్యవర్తిత్వం వహించేందుకు నేను సిద్ధం. ముఖ్యమంత్రి ఆదేశిస్తే కచ్చితంగా చర్చలకు దిగుతా. కానీ చర్చలు జరిపేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి రాలేదు'అని పేర్కొన్నారు.

# 11వ రోజూ ఉధృతంగా సమ్మె

- నేడూ సమ్మె కొనసాగించాలని కార్మిక సంఘాల పిలుపు

**సాక్షి, హైదరాబాద్:** ఆర్టీసీ కార్మికులు సమ్మెను ఉధృతంగా కొనసాగిస్తున్నారు. 11 రోజైన మంగళవారం కూడా రాష్ట్రవ్యాప్తంగా ర్యాలీలు, నిరసన ప్రదర్శనలతో హోరెత్తించారు. ఆత్మహత్య చేసుకున్న ఇద్దరు కార్మికుల సంతాప సభలు కొన్ని ప్రాంతాల్లో మంగళవారం కూడా కొనసాగాయి. ఓ వైపు ప్రభుత్వం చర్చలకు పిలిచే అవకాశం ఉందన్న మాటలు.. కోర్టు జోక్యంతో అందుకు అనుకూల పరిస్థితి ఉంటుందన్న సంకేతాలతో సమ్మె ఆగిపోయే పరిస్థితి ఉంటుందంటూ కాస్త ఊహాగానాలు వినిపించినా మంగళవారం రాత్రి వరకు అలాంటి సూచనలు అందకపోవటంతో కార్మికులు యథావిధిగా ఉధృతంగా సమ్మె కొనసాగించారు. టీఎన్‌జీవో, టీజీవోలు కూడా సమ్మెకు మద్దతు ఇస్తున్నట్లు మంగళవారం సాయంత్రం అధికారికంగా ప్రకటించటంతో ఆర్టీసీ కార్మికుల్లో మరింత ఉత్సాహం పెరిగింది. ఉద్యోగ సంఘాలతో ఆర్టీసీ జేఏసీ నేతలు భేటీ అయి చర్చించి మద్దతు కూడగట్టుకోగలిగారు. వారి మద్దతు కూడా ఉన్నందున సకలజనుల సమ్మె తరహాలో మరింత ఉధృతం చేద్దామంటూ నేతలు వాట్సాప్ గ్రూపుల్లో సందేశాలు పంపటంతో కార్మికుల్లో ఉత్సాహం రెట్టింపైంది. బుధవారం మరింత ఉధృతంగా సమ్మె జరపాలన్న ఆదేశాలూ అందాయి.

**62 శాతం బస్సులు తిప్పాం: ఆర్టీసీ**

తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్లతో మంగళవారం పెద్ద సంఖ్యలో బస్సులు తిప్పినట్లు ఆర్టీసీ ప్రకటించింది. సాయంత్రం 6 గంటల వరకు ఏకంగా 62.13 శాతం సర్వీసులు తిప్పినట్లు వెల్లడించింది. 4,192 ఆర్టీసీ బస్సులు, 1,952 అద్దె బస్సులు కలిపి 6,144 బస్సులు తిప్పినట్లు పేర్కొంది. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా సాఫీ ప్రయాణాలు అందుబాటులోకి వచ్చాయని వెల్లడించింది. 591 బస్సుల్లో టికెట్లను జారీ చేశామని, 58 సర్వీసుల్లో టిమ్స్ వాడకాన్ని మొదలుపెట్టామని అధికారులు వెల్లడించారు.



వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండలోని కాళోజీ సెంటర్‌లో ఆర్టీసీ కార్మికుల మానవహారం

## 21న ప్రగతిభవన్ ముట్టడిస్తాం

- 19న ఆర్టీసీ బంద్‌కు సంపూర్ణ మద్దతు
- కాంగ్రెస్ నేతలు రేవంత్‌రెడ్డి, దామోదర, షబ్బీర్



**సాక్షి, హైదరాబాద్:** 11 రోజులుగా ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ ఈనెల 21న ప్రగతిభవన్‌ను ముట్టడిస్తామని ఎంపీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి అన్నారు. ఈనెల 19న ఆర్టీసీ కార్మికుల బంద్‌కు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. మంగళవారం గాంధీభవన్‌లో రేవంత్, మాజీ మంత్రులు దామోదర రాజనరసింహ, షబ్బీర్‌అలీ మాట్లాడారు. బంద్‌లో కాంగ్రెస్ అనుబంధ సంఘాలు కూడా పాల్గొంటాయని రేవంత్ తెలిపారు. కార్మికులను తొలగిస్తున్నామని, కొత్త వారిని నియమిస్తామని సీఎం అహంకారపూరితంగా మాట్లాడుతున్నారని, సెల్ఫ్ డిస్మిస్ అనేది రాజ్యాంగంలో ఎక్కడైనా ఉందా అని ప్రశ్నించారు. మంత్రుల బాధ్యతారహిత ప్రకటనలతో కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆరోపించారు. భేషజాలకు పోకుండా కార్మికులతో ప్రభుత్వం చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఇంత జరుగుతున్నా మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్ ఎందు కు స్పందించడం లేదని ప్రశ్నించారు. కార్మికుల ప్రాణాలు పోతుంటే, ప్రగతిభవన్‌కు పోయి విందులో పాల్గొన్న ఉద్యోగ సంఘాల నేతలకు ముద్దెట్లా దిగిందోనని మండిపడ్డారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలపై కేంద్రం స్పందించాలని దామోదర కోరారు. గవర్నర్ తమిళిసై కేంద్ర పెద్దలతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. షబ్బీర్‌అలీ మాట్లాడుతూ, సీఎం సెల్ఫ్ డిస్మిస్ అని, మంత్రులు ఉద్యోగాల్లో చేరాలని చేస్తున్న ద్వంద్వ వ్యాఖ్యలు చూస్తుంటే ఇది కూడా డబుల్ గేమ్ అని అనుమానంగా ఉందన్నారు.

## ఆధునిక సాంకేతికతతో నీటి శుద్ధి

**మిషన్ భగీరథపై దుష్ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు: ఈఎన్‌సీ కృపాకర్ రెడ్డి**

**సాక్షి, హైదరాబాద్:** ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మిషన్ భగీరథ నీళ్లను శుద్ధి చేస్తున్నామని ఈఎన్‌సీ కృపాకర్ రెడ్డి పేర్కొన్నారు. భగీరథపై కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దని, అలాంటి ప్రచారం చేసేవారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. భగీరథ నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని సూచించారు. మిషన్ భగీరథ నీటి నాణ్యత, వినియోగంపై కొన్ని రోజులుగా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఈ శాఖ అధికారులు, మంగళవారం నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని కొండూరు, కొట్టాల, అశ్వాపూర్ కాలనీల్లో పర్యటించారు. రివర్స్ ఆస్మాసిస్ నీటిలో శరీరానికి అవసరమైన లవణాలు ఉండవని, ఆ నీటిని తాగితే ఒళ్లు, మోకాళ్ల నొప్పులొస్తాయని ఈఎన్‌సీ చెప్పారు.

# చర్చలు జరపండి

▶ మొదటి పేజీ తరువాయి

ఆదేశాలివ్వాలని, ఆర్టీసీ కార్మికుల న్యాయబద్ధమైన సమస్యల సాధనకు ఉన్నత స్థాయి నిపుణుల కమిటీ ఏర్పాటుకు వీలుగా ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ ఉస్మానియా విశ్వవిద్యాలయం రీసెర్చ్ స్కాలర్ ఆర్.సుబేందర్‌సింగ్ దాఖలు చేసిన పిల్‌పై మంగళవారం వాదనలు జరిగాయి. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డితో కూడిన ధర్మాసనం విచారణ సందర్భంగా ఇరుపక్షాలకు పలు సూచనలు చేసింది.

**ఇబ్బంది లేదని ఎలా చెబుతారు..?**

ప్రభుత్వం తరఫున ఏజీ బీఎస్ ప్రసాద్ వాదిస్తూ.. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్న కార్మికుల డిమాండ్‌ను ప్రభుత్వం అమలు చేయబోదని తేల్చిచెప్పారు. ఒకవేళ అలా చేస్తే వేరే ప్రభుత్వ రంగ సంస్థలూ ఇలాగే డిమాండ్ చేస్తాయని చెప్పారు. సమ్మె ప్రభావం ప్రయాణికులపై లేదని, ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిందని చెప్పారు. ప్రభుత్వం దాఖలు చేసిన కౌంటర్‌లో.. ఇంకా 4 వేల బస్సులు నడపట్లేదని, మిగిలిన 6 వేల బస్సులు నడుస్తున్నాయని పేర్కొనడాన్ని హైకోర్టు ఎత్తి చూపింది. 4 వేల బస్సులు నడపకుండానే ప్రయాణికులు ఇబ్బందులు పడట్లేదంటే ఎలా అని ప్రశ్నించింది. ఇబ్బందులు లేనప్పుడు విద్యాసంస్థలకు దసరా సెలవులు ఎందుకు పొడిగించారని ప్రశ్నించింది. యూనియన్ తరఫు సీనియర్ న్యాయవాది డి.ప్రకాశ్‌రెడ్డి వాదిస్తూ ఆర్టీసీకి పూర్తిస్థాయి ఎండీ లేకపోవడంతో చాలా సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని, కార్మికుల సమస్యలను ఎవరి ద్వారా ప్రభుత్వానికి తీసుకెళ్లాలో తెలియని అయోమయంలో ఉన్నారని కోర్టు దృష్టికి తెచ్చారు. ఆర్టీసీకి ఎండీని నియమించే విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్తానని అదనపు ఏజీ చెప్పడంతో ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రభుత్వంలో ఎంతో మంది ఐఏఎస్ అధికారులు ఉంటారని, వారిలో ఒకరిని ఆర్టీసీ ఎండీగా నియమించేందుకు వ్యవధి కావాలనడం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించింది. సమస్యలను ప్రభుత్వ స్థాయిలో పరిష్కారం చేయకపోవడం వల్లే లోకాయుక్తను నియమించాలని, శిశు సంక్షేమ జిల్లా కమిటీలను నియమించాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయిస్తున్నారని ధర్మాసనం పేర్కొంది. పత్రికల్లో వస్తున్న వార్తల ప్రకారం ఆర్టీసీ సమ్మె ప్రభావం ఎక్కువగానే ఉందని భావిస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది.

**గత్యంతరం లేకే సమ్మె..**

సమ్మె చేసిన కార్మికులు సెల్ఫ్ డిస్మిస్ అయ్యారని ప్రభుత్వం ప్రకటన విడుదల చేయడాన్ని ప్రకాశ్‌రెడ్డి ధర్మాసనం దృష్టికి తెచ్చారు. కార్మికుల సమస్యలపై వినతి పత్రాలు ఇచ్చాక చర్చలు జరుపుతామని చెప్పి అర్ధంతరంగా సమావేశాన్ని వాయిదా వేశారని, గత్యంతరం లేకే సమ్మె నోటీసు ఇచ్చినట్లు పేర్కొన్నారు. అన్ని రకాల ప్రయత్నాలు చేసినా ఫలితం లేనప్పుడే సమ్మె చేస్తారని పేర్కొన్నారు. ఆర్టీసీకి చెందిన రూ.545 కోట్లను ప్రభుత్వం మళ్లించిందని, పీఎఫ్ సొమ్ము, ఇతర సమస్యల్ని పరిష్కరించాలనే సమ్మె చేస్తున్నారని ఆర్టీసీ జేఏసీ తరఫు న్యాయవాది రచనారెడ్డి చెప్పారు. ఐఏఎస్ అధికారి సోమేశ్‌కుమార్ నేతృత్వంలో ముగ్గురు సభ్యుల కమిటీ నియమించి, అర్ధంతరంగా రద్దు చేసిందని, ప్రభుత్వానికి సమస్యను పరిష్కరించాలనే చిత్తశుద్ధి లేదన్నారు. కాగా, పిటిషనర్ తరఫు న్యాయవాది పీవీ కృష్ణయ్య వాదిస్తూ.. ఆర్టీసీ కార్మికుల సమస్యలపై అధ్యయనం కోసం సమర్థుడైన అధికారి నేతృత్వంలో కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసేలా ఆదేశాలివ్వాలని కోరారు.

### జీతం ఇవ్వాలని రిట్

ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులు పనిచేసిన సెప్టెంబర్ జీతాలు చెల్లించేలా ఆర్టీసీ యాజమాన్యానికి ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ దాఖలు చేసిన మరో పిటిషన్ మంగళవారం హైకోర్టు విచారణకు వచ్చింది. దీన్ని హైకోర్టు బుధవారం న్యాయమూర్తి జస్టిస్ అభినందకుమార్ షావిలి విచారించారు. పనిచేసిన కాలానికి జీతాలు చెల్లించాలని, వాటిని నిలుపుదల చేసే అధికారం ఆర్టీసీ యాజమాన్యానికి లేదని పిటిషనర్ న్యాయవాది వాదించారు. ఆర్టీసీ సమ్మెపై ధర్మాసనం విచారణ జరుపుతోందని, కాబట్టి ఈ రిట్‌పై విచారణను బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు న్యాయమూర్తి తెలిపారు.

### సెలవుల పొడిగింపుపై రిట్..

ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో విద్యార్థులు ఇబ్బందులు పడకూడదని రాష్ట్రవ్యాప్తంగా విద్యా సంస్థలకు ప్రభుత్వం దసరా సెలవుల్ని పొడిగిస్తూ జారీ చేసిన జీవోను సవాల్ చేస్తూ హైకోర్టులో రిట్‌పిటిషన్ దాఖలైంది. విద్యార్థుల తల్లిదండ్రుల సంఘం దాఖలు చేసిన రిట్‌లో వెంటనే విద్యాసంస్థలు తెరిచేలా ఉత్తర్వులివ్వాలని హైకోర్టును కోరారు. దీనిపై మంగళవారం విచారణ జరిపిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.వినోద్‌కుమార్ తదుపరి విచారణ నేటికి వాయిదా వేశారు.

## 23 తర్వాత సమ్మె!

▶ మొదటి పేజీ తరువాయి

సమయం కావాలని అధికారులు కోరారు. యాజమాన్యాలపై గౌరవ భావంతో ఈ నెల 11న వరంగల్‌లో నిర్వహించాల్సిన ధర్నాను విరమించుకుని చర్చలకు వస్తే తమకు అన్యాయమే జరిగిందని టీటఫ్ పేర్కొంది. చర్చల సందర్భంగా యాజమాన్యం స్పందన సరిగా లేదని ఆరోపించింది. చర్చల్లో టీటఫ్ చైర్మన్ ఎన్.పద్మారెడ్డి, కన్వీనర్ ఈ.శ్రీధర్, కో చైర్మన్ ఎంఏ వజీర్, కో కన్వీనర్లు ఎస్.శ్రీధర్ గౌడ్, కె.కుమారస్వామి, జి.సాయిబాబా, మజీద్, గంబో నాగరాజు, సాయిలు పాల్గొన్నారు.

**చర్చలు సఫలం..: టీఆర్ఎస్‌కేవీ**

విద్యుత్ సంస్థలతో చర్చలు విఫలమైనట్లు 21 సంఘాలతో ఏర్పడిన టీటఫ్ ప్రకటించగా, చర్చలు సఫలమయ్యాయని అధికార టీఆర్ఎస్ పార్టీ అనుబంధ సంఘం తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం (టీఆర్‌వీకేఎస్) ప్రకటించింది. ఆర్టిజన్లకు స్టాండింగ్ రూల్స్ అమలుకు తాము సానుకూలంగా ఉన్నామని, అన్ని సమస్యలను పరిష్కరించేందుకు యాజమాన్యం హామీనిచ్చిందని టీఆర్‌వీకేఎస్ నేతలు ప్రకాశ్‌రావు, జాన్సన్, సీహెచ్ రమేశ్‌లు పేర్కొన్నారు.

# సమ్మెకు సపోర్ట్

- ఆర్టీసీ కార్మికులకు టీఎన్‌జీవో, టీజీవోల మద్దతు
- 'ఉద్యోగ'జేఏసీతో భేటీ అయిన ఆర్టీసీ జేఏసీ
- మద్దతుపై నేడు ప్రకటన: ఉద్యోగ జేఏసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి
- ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి

**సాక్షి, హైదరాబాద్:** ఆర్టీసీ కార్మికుల సమ్మెకు టీఎన్జీవో, టీజీవో సంఘాలు మద్దతు ప్రకటించాయి. ఉద్యోగ సంఘాల జేఏసీ కూడా మద్దతు ప్రకటించేందుకు సిద్ధమైంది. బుధవారం జరిగే జేఏసీ సమావేశంలో చర్చించి ప్రకటన చేయనుంది. దీంతో రాష్ట్రంలోని దాదాపు అన్ని ఉద్యోగ సంఘాలు ఆర్టీసీ కార్మికులకు మద్దతు ప్రకటించినట్లవుతుంది. మంగళవారం సాయంత్రం టీఎన్‌జీవో రాష్ట్ర కార్యవర్గ సమావేశ జరిగింది. అనంతరం ఆర్టీసీ జేఏసీ నేతలు అశ్వత్థామరెడ్డి, రాజిరెడ్డి, సుధ, ఎస్వీ రావు తదతరులు.. ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ కారెం రవీందర్‌రెడ్డి, సెక్రటరీ జనరల్ మమత ఇతర నేతలతో చర్చించారు. తర్వాత రవీందర్‌రెడ్డి, మమత ఆర్టీసీ సమ్మెకు మద్దతు ప్రకటించారు. జేఏసీ కార్యాచరణను కూడా బుధవారం ప్రకటిస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. పది రోజులుగా జరుగుతున్న ఆర్టీసీ సమ్మెలో అన్ని వర్గాలు పాల్గొంటున్నాయన్నారు. ఆర్టీసీ జేఏసీ వస్తేనే మద్దతు ఇవ్వాలని కిందిస్థాయి నుంచి వచ్చిన ఒత్తిడి మేరకు ఆగామన్నారు. అయితే ఇద్దరు ఆర్టీసీ కార్మికులు మరణించిన సంఘటన తమను కలచివేసిందన్నారు. ఆర్టీసీ కార్మికులకు వచ్చే జీతాలు చాలా తక్కువ, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతాలు ఇవ్వాలని ఉమ్మడి రాష్ట్రంలో అడిగామన్నారు. ఆర్టీసీ సమ్మెను చూసి అదే మార్గంలో వెళ్లాలని ఇతర ఉద్యోగ సంఘాలు ముందుకు వస్తున్నాయన్నారు. ఇలాగే అయితే మరో సకల జనుల సమ్మెకు సిద్ధమయ్యే పరిస్థితి వస్తుందని, ఈ విషయాన్ని ప్రభుత్వానికి చెప్పడమే లక్ష్యంగా ముందుకు వెళతామన్నారు. టీజీవో అధ్యక్షురాలు మమత మాట్లాడుతూ.. ఏ రంగంలోని ఉద్యోగులు అయినా ఒకటేనని, అంతా తమ సోదరులేనన్న భావనను తెలంగాణ ఉద్యమం నేర్పించిందన్నారు. అశ్వత్థామరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రం వచ్చాక పురోగమించాల్సిన ఆర్టీసీ తిరోగమనంలో పడిందన్నారు. రాష్ట్రం రాకముందు 1,200 గ్రామాల్లో బస్సు సౌకర్యం లేదన్నారు. రాష్ట్రం వస్తే గ్రామగ్రామన బస్సు తిప్పుతామని చెప్పామన్నారు. ఇప్పుడు 3,000 గ్రామాలకు బస్సులే లేకుండాపోయాయన్నారు. 7 వేల మంది పదవీ విరమణ పొందినా ఒక్కరిని నియమించలేదన్నారు. ఆర్టీసీకి రావాల్సిన సబ్సిడీలు రూ.710 కోట్లు ప్రభుత్వం నుంచి సకాలంలో అందట్లేదన్నారు. అర్బన్ లాసెస్‌ను చట్టం తెచ్చి ఇస్తామని సీఎం చెప్పినా రూ. 1,400 కోట్లు రాలేదన్నారు. రూ.210 కోట్లు బ్యాంకు గ్యారెంటీకి సంబంధించి రావాల్సినవి రాలేదన్నారు. సకాలంలో జీతాలు ఇవ్వట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చాలా వరకు ఆర్టీసీ ఆస్తులను అమ్మేశారని ఆరోపించారు. ఇంత జరుగుతున్నా స్ఫూర్తి గా నిలవాల్సిన టీజీవో, టీఎన్‌జీవోలు ఎందుకు స్పందించట్లేదని కొన్ని మాటలు అన్నందుకు చింతిస్తున్నట్లు పేర్కొన్నారు. వారంటే గౌరవం ఉండబట్టే మద్దతు కోరామన్నారు. యాజమాన్యం సీఎంతో మాట్లాడి కార్మికులను చర్చలకు ఆహ్వానించాలని కోర్టు చెప్పిందన్నారు. ప్రభుత్వం వేసే కమిటీకి చట్టబద్ధత, చిత్తశుద్ధి ఉంటే అటెండర్ల కమిటీతో అయినా చర్చించేందుకు సిద్ధమేనని ప్రకటించారు.



ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న టీఎన్జీవో, టీజీవో నేతలు

### టీఎన్‌జీవో.. ప్రధాన తీర్మానాలివే..

- ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి. ప్రస్తుతం సమ్మె చేస్తున్న కార్మికులకు సంఘీభావం తెలుపుతున్నాం.
- సమ్మె చేస్తున్న ఆర్టీసీ కార్మికుల స్థానంలో విధులు నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన ఉత్తర్వులను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి.
- పీఆర్‌సీ మంజూరు, సీపీఎస్ రద్దు, పదవీ విరమణ వయసు పెంపు, ఏపీలో పని చేస్తున్న తెలంగాణ ఉద్యోగులను వెనక్కి రప్పించడం, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, పెన్షనర్లకు 15 శాతం అదనపు పెన్షన్ తదితర 15 సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి.

# టీఆర్‌ఎస్ ‘గెలుపు’ లెక్కలు

**హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో విజయంపై అధికార పార్టీ ధీమా**

- నేతల చేరికలతో సంస్థాగతంగా బలోపేతమైనట్లు అంచనా
- టీడీపీ, బీజేపీ చీల్చే ఓట్లు తమకు లాభిస్తాయని అంచనా
- రేపు సీఎం బహిరంగ సభకు భారీగా జనసమీకరణపై దృష్టి

**సాక్షి, హైదరాబాద్:** హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక ప్రచారం మరో నాలుగు రోజుల్లో ముగియనుండగా అధికార టీఆర్‌ఎస్ విజయావకాశాలపై లెక్కలు వేసుకుంటోంది. సంస్థాగతంగా ఇతర పార్టీలతో పోలిస్తే బలంగా ఉన్నామని, కాంగ్రెస్ నుంచి స్థానిక సంస్థల ప్రతినిధులు చేరడం కలసి వస్తుందని భావిస్తోంది. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమిలో భాగస్వామిగా ఉన్న టీడీపీ కూడా బరిలో ఉండటం తమకే లాభిస్తుందని అంచనా వేస్తోంది. ఉప ఎన్నికను బీజేపీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నా తమ వ్యతిరేక ఓట్లను కమలం పార్టీ చీల్చుతుందని విశ్లేషిస్తోంది. అలాగే సీపీఎం బరిలో లేకపోవడం, సీపీఐ ఊగిసలాట ధోరణి తదితరాల ప్రభావం పెద్దగా ఉండదని కొట్టిపారేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో కారును పోలిన ట్రక్కు గుర్తు వల్ల నష్టపోయిన టీఆర్‌ఎస్‌ను ఈసారి ఉప ఎన్నికలో అలాంటివే మరో రెండు గుర్తులు ఉండటం కొంత ఆందోళనకు గురిచేస్తోంది. నియోజకవర్గ ఆవిర్భావం నుంచి మూడు పర్యాయాలు గట్టి పోటీ ఇచ్చినా హుజూర్‌నగర్ సీటును కైవసం చేసుకోలేకపోవడాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న టీఆర్‌ఎస్... ఈ నెల 17న జరిగే సీఎం కేసీఆర్ బహిరంగ సభకు భారీగా జన సమీకరణపై దృష్టి పెట్టింది.

**రోజువారీ ప్రచారంపై ‘వార్ రూమ్’..**

హుజూర్‌నగర్ ఉప ఎన్నిక ప్రచార వ్యూహం అమలు, సమన్వయం కోసం టీఆర్‌ఎస్ సుమారు 70 మంది ఇన్‌చార్జీలను నియమించింది. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా పరిషత్ చైర్మన్లు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లతోపాటు పలువురు పార్టీ నేతలకు ఉప ఎన్నిక బాధ్యతలను అప్పగించింది. ఉప ఎన్నిక ఇన్‌చార్జిగా పనిచేస్తున్న పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో ‘వార్ రూమ్’ను ఏర్పాటు చేసి రోజువారీ ప్రచార తీరుతెన్నులను సమన్వయం చేస్తోంది. ఇప్పటికే సామాజికవర్గాలవారీగా ప్రచార సభలు నిర్వహించింది. మంత్రులు జగదీశ్ రెడ్డి, సత్యవతి రాథోడ్ క్షేత్రస్థాయి ప్రచారంలో పాల్గొంటుండగా మరో మంత్రి పువ్వాడ అజయ్ అడపాదడపా పర్యటించి వెళ్లారు. ఇదిలా ఉండగా.. ఎన్నికల పోలింగ్ దగ్గర పడుతుండటంతో టీఆర్‌ఎస్ ఇంటింటా ప్రచారం ముమ్మరం చేసింది. తమ పార్టీ అభ్యర్థి విజయానికి ఏ అవకాశాన్ని వదులుకోవడం లేదు.



## బీఎస్‌ఎన్‌ఎల్ పరిరక్షణకు ఐక్య ఉద్యమాలే శరణ్యం

**ఎన్‌ఎఫ్‌టీఈ ఆల్‌ఇండియా జనరల్ సెక్రెటరీ చందేశ్వర్‌సింగ్**

**కరీంనగర్:** బీఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగులు కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని ఎన్‌ఎఫ్‌టీఈ ఆల్ ఇండియా జనరల్ సెక్రెటరీ చందేశ్వర్ సింగ్ పిలుపునిచ్చారు. మంగళవారం కరీంనగర్‌లో జరిగిన బీఎస్‌ఎన్‌ఎల్ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఎస్‌ఎన్‌ఎల్‌కు 150 సంవత్సరాల చరిత్ర ఉందని, సంస్థలో లక్షా 60 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని, అలాంటి సంస్థను ప్రభుత్వం పరిరక్షించాల్సిందిపోయి ఉద్యోగులకు ఉద్వాసన పలికే చర్యలకు దిగడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. 4జీ సేవలను బీఎస్‌ఎన్‌ఎల్‌కు ఇవ్వకుండా ప్రైవేట్ కంపెనీ జియో సంస్థలకు కట్టబెట్టడం ఏమిటని ప్రశ్నించారు. రోజుకో విధానాన్ని ప్రకటిస్తూ కార్మికులను గందరగోళ పరుస్తూ ప్రభుత్వం చేస్తున్న చర్యలు విచారకరమని అన్నారు. కార్మికులకు వీఆర్‌ఎస్, రిటైర్మెంట్ వయస్సు 58కి తగ్గింపు, పీఆర్‌సీ వంటి అమలు చేయకపోవడం వంటి విధానాలు కార్మికుల మనోభావాలను దెబ్బతీస్తున్నాయని విమర్శించారు. ఈ నెల 18న ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయాల ముందు నిరాహార దీక్షలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి రాజమౌళి అధ్యక్షత వహించారు.

**క్లుప్తంగా...**

## ట్రాన్స్‌కో ఔట్‌సోర్సింగ్ కార్మికుడి ఆత్మహత్య



**కామారెడ్డి టౌన్:** ట్రాన్స్‌కో ఔట్ సోర్సింగ్ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. అధికారి వేధింపుల వల్లే ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని ఆరోపిస్తూ మృతుడి బంధువులు కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. పట్టణానికి చెందిన కేవీ రమాకాంత్ ట్రాన్స్‌కోలో క్యాజువల్ లేబర్‌గా పనిచేస్తున్నాడు. డీ –2 సెక్షన్ నుంచి డీ–1 కు మార్చాలని చాలా రోజులుగా ఏఈని కోరుతున్నాడు. అయితే ఆయన పట్టించుకోవడం లేదు. పైగా రమాకాంత్ సరిగా పనిచేయడం లేదని సోమవారం ఉన్నతాధికారులకు లేఖ రాశారు. దీంతో మనోవేదనకు గురైన రమాకాంత్.. సోమవారం రాత్రి కామారెడ్డి ఆర్‌బీ నగర్ ప్రాంతంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి బంధువులు మంగళవారం మృతదేహాన్ని తీసుకుని ట్రాన్స్‌కో కార్యాలయం వద్దకు వెళ్లి ధర్నా చేశారు. విధుల్లో నుంచి తొలగించాలని ఏఈ ఉన్నతాధికారులకు లేఖ రాయడం వల్లే మన స్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు.




జనగామలో ఆర్టీసీ కార్మికుల దీక్షలో మాట్లాడుతున్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

## బిచ్చమెత్తయినా కడుపు నింపుతా!

**ఆర్టీసీ కార్మికులు పోరుబాట వీడొద్దు: కోమటిరెడ్డి • కేకే చర్చలు ఉత్తుత్తివేనని ఎద్దేవా**

**జనగామ:** ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి.. న్యాయమైన డిమాండ్లు పరిష్కారం అయ్యే వరకు పోరుబాట వీడొద్దని కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. అప్పటి వరకు భిక్షాటన చేసైనా కార్మికుల కడుపు నింపుతానని, ఎవరూ ఆత్మహత్యలకు పాల్పడొద్దని విజ్ఞప్తి చేశారు. జనగామ ఆర్టీసీ డిపో ఆవరణలో కార్మికులు చేస్తున్న నిరవధిక దీక్షలకు మంగళవారం ఆయన సంఘీభావం తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. టీఆర్‌ఎస్ నేత కేశవరావు చర్చలు అంతా ఉత్తుత్తివేనని విమర్శించారు. ఉద్యమ సమయంలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని ప్రగల్భాలు పలికిన సీఎం కేసీఆర్.. సంస్థల ఆస్తులను తన అనుయాయులకు అప్పనంగా అప్పగించేందుకే ఇప్పుడు ఆ మాటెత్తడం లేదని ఆరోపించారు. వేలాది కార్మికుల పొట్టగొట్టే ప్రయత్నం చేస్తున్న కేసీఆర్‌కు గద్దె దిగిపోయే కాలం దగ్గర పడిందని తెలిపారు. కార్మికుల ఆత్మహత్యలకు కారణమైన కేసీఆర్‌పై హత్య కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బంగారు తెలంగాణ అని చెప్పుకుంటున్న కేసీఆర్ పాలనలలో బస్సులు, బడులు బంద్ చేస్తుండగా.. మద్యం ఏరులై పారుతుందని ఎద్దేవా చేశారు. ఈ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని విమర్శించారు.

## పార్టీకి కార్యకర్తలే ఆయువుపట్టు: హరీశ్

**సాక్షి, సిద్దిపేట:** నాడు ఉద్యమంలో, నేడు బంగారు తెలంగాణకు బాటలు వేయడంలో కార్యకర్తలు పార్టీ వెన్నంటే ఉన్నారని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. రెండోసారి కూడా పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేసిన కార్యకర్తలే పార్టీకి ఆయువుపట్టు అని పేర్కొన్నారు. మంగళవారం సిద్దిపేటలో నిర్మించిన టీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతీ జిల్లాలో పార్టీ కార్యాలయం ఉండాలనే ఆలోచనతో పార్టీ అధినేత కేసీఆర్ నిధులు మంజూరు చేసి భూమి పూజలు చేశారని చెప్పారు. అలాగే భవన నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధపెట్టి ఎప్పటికప్పుడు సమాచారం తెప్పించుకుంటున్నారని తెలిపారు. కేసీఆర్ ఆదేశాల మేరకు సిద్దిపేట జిల్లా పార్టీ కార్యాలయం పూర్తి చేశామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీని బలోపేతం చేసేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని, పార్టీ కోసం పనిచేసిన వారికి తగిన ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఇందులో భాగంగా ముందుగా గ్రామస్థాయి నుంచి మండల స్థాయి, తర్వాత జిల్లా స్థాయిలో పార్టీ కమిటీలు వేస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో సంపద పెంచేలా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, వ్యవసాయంతోపాటు కూరగాయలు, పాడి పరిశ్రమ, పశుగణాభివృద్ధి, మత్స్య సంపదను పెంచేందుకు నిధులు కేటాయించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని చెప్పారు.






## జగ్గారెడ్డి అరెస్టు, విడుదల

**మంత్రి ఇంటి ముట్టడికి విఫలయత్నం**

**తోపులాట, రాస్తారోకో.. స్వల్ప లాఠీచార్జి**




ఎమ్మెల్యే జగ్గారెడ్డిని అరెస్ట్ చేసి తీసుకువెళ్తున్న పోలీసులు

**సాక్షి, సంగారెడ్డి:** ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ మంగళవారం ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఇంటి ముట్టడికి విఫల యత్నం జరిగింది. ఈ క్రమంలో తొపులాట చోటు చేసుకోవడంతో జగ్గారెడ్డిని పోలీసులు అరెస్టు చేసి అనంతరం విడుదల చేశారు. జగ్గారెడ్డి, ఆర్టీసీ జేఏసీ పిలుపు మేరకు సంగారెడ్డి బస్ డిపోలోని కార్మికులు మంగళవారం సంగారెడ్డి బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన ధర్నా వేదిక వద్దకు చేరుకుని రాస్తారోకో నిర్వహించారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకొని రాస్తారోకోను విరమింపజేశారు. ముందస్తు సమాచారంతో ఎమ్మెల్యే జగ్గారెడ్డితో పాటు కార్మికులు హైదరాబాద్ వెళ్లకుండా అడ్డుకునేందుకు పోలీసులను భారీగా మోహరించారు. ఎట్టకేలకు నాటకీయ పరిణామాల మధ్య ఎమ్మెల్యే జగ్గారెడ్డి మధ్యాహ్నం 1 గంట సమయంలో వేదిక వద్దకు చేరుకోగా.. వెంటనే పోలీసులు ఆయనను అరెస్టు చేసే ప్రయత్నంలో తోపులాట చోటుచేసుకుంది. పోలీసుల చర్యను నిరసిస్తూ ఆర్టీసీ కార్మికుడొకరు పోలీసు వాహనంపైకి రాయి విసరడంతో అద్దం పగిలింది. ఈ సమయంలో పోలీసులు స్వల్ప లాఠీచార్జి చేసి అక్కడున్నవారిని చెదరగొట్టి జగ్గారెడ్డిని అరెస్టు చేసి అక్కడి నుంచి తరలించి అనంతరం విడుదల చేశారు. అంతకు ముందు పలు సంఘాల నేతలు ఆర్టీసీ కార్మికులకు మద్దతు తెలిపారు.

## పిడుగుపాటుతో తండ్రీకొడుకులు మృతి

**పత్తి ఏరుతుండగా ఘటన**



తండ్రీకొడుకులు కిషన్, సంతోష్ మృతదేహాలు

**మరిపెడ రూరల్:** పొలంలో పత్తి ఏరుతుండగా ఒక్కసారిగా పడిన పిడుగు తండ్రీకొడుకుల ప్రాణాలను బలి తీసుకుంది. మరొకరు ప్రాణాపాయ స్థితి నుంచి బయట పడ్డారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం తానంచర్ల శివారు వాల్యాతండా గ్రామపంచాయతీ పరిధిలో మంగళవారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. తండాకు చెందిన తేజావత్ కిషన్ (48), భార్య తారతో కలసి వ్యవసాయ క్షేత్రంలో పత్తి ఏరటం కోసం వెళ్లారు. ఈ క్రమంలో భార్యాభర్తలిద్దరు పత్తి ఏరుతుండగా కొడుకు తేజావత్ సంతోష్ (14) తల్లిదండ్రులకు మధ్యాహ్న భోజనం తీసుకెళ్లాడు. భోజన విరామం తర్వాత అమ్మనాన్నతో కలసి తాను సైతం పత్తి ఏరుతుండగా ఆ సమయంలో ఉరుములు, మెరుపులతో వాన మొదలైంది. అంతలోనే వారికి సమీపంలో పిడుగు పడటంతో తండ్రీకొడుకులు కిషన్, సంతోష్ అక్కడికక్కడే మృతి చెందగా, తార స్వల్ప గాయాలతో ప్రాణాపాయ స్థితి నుంచి బయట పడింది.

## సహకార బ్యాంకింగ్ డైరెక్టర్‌గా కొండూరి



రవీందర్‌రావు

**సిరిసిల్ల:** అంతర్జాతీయ సహకార బ్యాంకింగ్ సమాఖ్య డైరెక్టర్‌గా జిల్లాకు చెందిన కొండూరి రవీందర్ రావు మంగళవారం ఎన్నికయ్యారు. జిల్లాలోని గంభీరావుపేట సింగిల్ విండో చైర్మన్‌గా ఎన్నికై , ఉమ్మడి కరీంనగర్ జిల్లా సహకార బ్యాంక్ చైర్మన్‌గా, రాష్ట్ర సహకార బ్యాంక్ చైర్మన్‌గా పనిచేస్తున్న కొండూరి అంతర్జాతీయ స్థాయిలో సహకార బ్యాంకింగ్ సమాఖ్య డైరెక్టర్‌గా ఎన్నికయ్యారు.

## గ్రామస్తుల దాడిలో దొంగ హతం



గంగాధర్

**మాక్లూర్:** గ్రామస్తుల దాడిలో ఓ దొంగ మృతి చెందాడు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం ధర్మోర గ్రామంలో సోమవారం అర్ధ రాత్రి జరిగింది. అర్సపల్లికి చెందిన గంట గంగాధర్ (28) గ్రామంలోని శ్రీ మహాలక్ష్మీ ఆలయం తాళం పగులగొట్టి చోరీకి యత్నించాడు. గమనించిన గ్రామస్తులు కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అనంతరం 108 అంబులెన్స్, పోలీసులకు సమాచారం అందజేశారు. గంగాధర్‌ను జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.




# అక్కడ చక్రం తిప్పినవారికే..!



- కేంద్రంలో అధికారం చేపట్టిన వారికే మహారాష్ట్ర పగ్గాలు
- అసెంబ్లీపై లోక్‌సభ ఫలితాల ప్రభావం ఎలా ఉందంటే..




మహారాష్ట్రలో ఎన్నికల వేడి రాజుకుంది. బీజేపీ–శివసేన, కాంగ్రెస్–ఎన్సీపీ మధ్యే పోటీ నెలకొని ఉంది. గత 20 ఏళ్లుగా ఈ రెండు కూటముల మధ్యే రాజకీయాలు తిరుగుతున్నాయి. రెండు కూటములు అధికారాన్ని అనుభవించాయి. ప్రతీసారి లోక్‌సభ ఎన్నికలు జరిగిన అయిదారు నెలలకే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరుగుతూ ఉండడంతో సార్వత్రిక ఎన్నికల ప్రభావం వీటి మీద తప్పనిసరిగా పడుతోంది. 1999 నుంచి గణాంకాలను లోతుగా పరిశీలిస్తే ఓటర్లు కేంద్రంలో అధికారం చేపట్టిన పార్టీకే తిరిగి అందలం ఎక్కిస్తున్నారు. అంతకు ముందు 1990–91, 1995–96లో వ్యతిరేక ఫలితాలు వచ్చాయి కానీ, ఆ తర్వాత నుంచి ఓటర్లు రెండు చోట్ల ఒకే ప్రభుత్వం ఉండాలని కోరుకుంటున్నారు. 1992లో బాబ్రీ మసీదు కూల్చివేత, 1993 ముంబై పేలుళ్ల తర్వాత మహారాష్ట్రలో హిందూత్వ వాదులు బలపడ్డారు. కాంగ్రెస్‌కు గట్టి పోటీ ఇచ్చే స్థాయికి బీజేపీ సేన కూటమి ఎదిగింది. 2004లో కేంద్రంలో యూపీఏ ప్రభుత్వం ఏర్పాటైతే, మహారాష్ట్రలో తిరిగి కాంగ్రెస్ కూటమి అధికారాన్ని దక్కించుకుంది. 2009లో కేంద్రంలో యూపీఏ–2 ఏర్పాటైతే, రాష్ట్రంలో కాంగ్రెస్ ఎన్సీపీ అధికారాన్ని దక్కించుకున్నాయి. 2014 లోక్‌సభ ఎన్నికల్లో కలసికట్టుగా బీజేపీ, శివసేన పోటీ చేశాయి. కేంద్రంలో పూర్తిస్థాయి మెజార్టీతో మోదీ ప్రభుత్వం ఏర్పాటైంది. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, శివసేన రెండూ విడివిడిగా పోటీ చేశాయి. కానీ ఎన్నికల అనంతరం పొత్తు కుదుర్చుకున్నాయి.

ఈ సారి ఎన్నికలు అందరికీ గట్టి సవాళ్లే విసురుతున్నాయి. ప్రతిపక్ష కాంగ్రెస్, ఎన్సీపీ బలం పుంజుకోకపోగా మరికాస్త బలహీనపడింది. కాంగ్రెస్ పార్టీని నాయకత్వ లేమి సమస్య వెంటాడుతోంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు అగ్ర నాయకులు ఎందరో పార్టీలు మారారు. ఎంపీ ఉద్యానరాజే భోస్లే వంటి వారు చేజారిపోయారు. మరఠ్వాడా ప్రాంతంలో ఫిరాయింపుల ప్రభావం ఎక్కువగా చూపించనుంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ సీనియర్ నాయకులు పదవుల్ని వీడడంతో ఆ పార్టీ ఆత్మరక్షణలో పడిపోయింది. ఇక ఎన్సీపీ ఈడీ నీడలో ఉంటూ ఎన్నికల్ని ఎదుర్కొంటోంది. పార్టీ అధ్యక్షుడు శరద్ పవార్ చుట్టూ ఈడీ ఉచ్చు బిగుసుకుంటోంది. దీంతో ఎందరో నేతలు పార్టీని వీడి బీజేపీలో చేరిపోయారు. ఇక బీజేపీకి ఈ సారి ఎన్నికల్లో గెలుపు అత్యంత అవసరం. ఎందుకంటే గత ఏడాది జరిగిన రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఓటమి పాలైన ఆ పార్టీకి గట్టి దెబ్బే తగిలింది. కానీ ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికల నాటికి బలం పుంజుకుంది. అయితే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల అంశాలు, ప్రాధాన్యాలు వేరు కావడంతో ఆ పార్టీ కూడా ఒక మెట్టు దిగి శివసేనతో ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఇక శివసేనకు ఇవి చారిత్రాత్మక ఎన్నికలు. ఠాక్రే వారసుడు ఆదిత్య ఠాక్రే ఈ సారి ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి దిగారు. కొన్నాళ్లుగా నేరుగా ప్రధాని మోదీపైనే విమర్శలు గుప్పిస్తూ వచ్చిన శివసేన ఈ సారి క్షేత్రస్థాయిలో బలపడి సీట్లు పెంచుకోవాలని తహతహలాడుతోంది. అందుకే ఆదిత్య ఠాక్రే ఎన్నికల బరిలో దిగినట్టుగా రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. రైతు సమస్యలు, ఆర్థిక మందగమనం, వరదలు వంటి పరిస్థితులు నెలకొన్న వేళ బీజేపీ శివసేన కూటమి తన వ్యూహాన్ని మార్చుకుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ కశ్మీర్ 370 రద్దుపైనే అధికంగా దృష్టి సారించారు. పదే పదే దానిపైన విపక్ష పార్టీకి సవాళ్లు విసురుతున్నారు. రాహుల్ గాంధీ ఇంకా రఫేల్ అంశాన్నే పట్టుకొని వేళ్లాడుతున్నారు. విపక్షాల బలహీనతే ఈ సారి బీజేపీ కూటమికి వరంగా మారుతుందని రెండు చోట్లా ఒకటే ప్రభుత్వం అన్న సంప్రదాయం కొనసాగుతుందనే అభిప్రాయం వినిపిస్తోంది.

## సవాళ్ల బాటలో..



**2004**

| లోక్‌సభ ఫలితాలు | |
|---|---|
| కాంగ్రెస్, ఎన్సీపీ | 23 |
| బీజేపీ , శివసేన | 25 |
| **అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు** | |
| కాంగ్రెస్, ఎన్సీపీ | 69+71 |
| బీజేపీ శివసేన | 54+ 62 |

**2009**

| లోక్‌సభ ఫలితాలు | |
|---|---|
| కాంగ్రెస్, ఎన్సీపీ | 25 |
| బీజేపీ , శివసేన | 20 |
| ఇతరులు | 03 |
| **అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు** | |
| కాంగ్రెస్ – ఎన్సీపీ | 82 + 62 |
| శివసేన, బీజేపీ | 45+46 |
| ఆర్‌పీఐ (అథావలే) | 14 |
| ఎంఎన్‌ఎస్ (రాజ్‌ఠాక్రే) | 13 |

**2014**

| లోక్‌సభ ఫలితాలు | |
|---|---|
| బీజేపీ శివసేన | 41 |
| కాంగ్రెస్, ఎన్సీపీ | 6 |
| ఇతరులు | 1 |
| **అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు** | |
| బీజేపీ కూటమి | 122+1 |
| శివసేన | 63 |
| కాంగ్రెస్ | 42 |
| ఎన్సీపీ | 41 |
| ఏఐఎంఐఎం | 2 |

## సావర్కర్‌కు భారతరత్న ఇప్పిస్తాం

- అయిదేళ్లలో కోటి ఉద్యోగాల కల్పన
- మహారాష్ట్రలో బీజేపీ మేనిఫెస్టో

**ముంబై:** మహారాష్ట్ర ఎన్నికల సందర్భంగా బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోని విడుదల చేసింది. రాష్ట్రంలో రెండోసారి అధికారం సాధించడమే లక్ష్యంగా బీజేపీ పలు కీలక హామీలు ఇచ్చింది. అందులో హిందుత్వ నాయకుడు, సంఘ్‌పరివార్ కీలక నేత వినాయక్ దామోదర్ సావర్కర్ (వీర సావర్కర్)కు దేశ అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్న ఇప్పిస్తామని హామీ ఇచ్చింది. ఆయనతోపాటు సామాజికవేత్తలైన జ్యోతిబాపూలే, సావిత్రి బాయిపూలేలకు సైతం భారతరత్న ఇప్పిస్తామని పేర్కొన్నారు. ఈ మేరకు కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వంతో చర్చలు జరుపుతామని తెలిపింది. స్వాతంత్ర్య సమరయోధుడిగా పోరాడిన సావర్కర్ అనంతరం హిందుత్వ నాయకుడిగా పేరందుకున్నారు. ముస్లిం లీగ్‌కు వ్యతిరేకంగా హిందూ మహాసభలో పాల్గొని హిందువులను ఏకతాటిపైకి తెచ్చే ప్రయత్నం చేశారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌తో కలిసి బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేపీ నడ్డా ఎన్నికల మేనిఫెస్టో 'సంకల్ప పాత్ర'ను మంగళవారం విడుదల చేశారు. మేనిఫెస్టో విడుదల సందర్భంగా నడ్డా మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఫడ్నవిస్ మహారాష్ట్ర రాజకీయ సంస్కృతిని మార్చేశారన్నారు. గతంలో మహారాష్ట్ర అవినీతితో నిండి ఉండగా, ఇప్పుడు అవినీతిరహితంగా మారిందన్నారు. గతంలో ముఖ్యమంత్రి పీఠం ''మ్యూజికల్ చైర్''లా మారిపోయేదని, ఇప్పుడు ముఖ్యమంత్రి ఫడ్నవిస్ దాన్ని సుస్థిరం చేశారని వ్యాఖ్యానించారు. సావర్కర్‌కు భారతరత్న హామీపై సీపీఐ ప్రధాన కార్యదర్శి డీ రాజా మండిపడ్డారు. ఓ వైపు దేశమంతటా గాంధీ జయంతి ఉత్సవాలు జరుపుతూ మరోవైపు ఆయన హత్యలో నిందితుడైన సావర్కర్‌కు భారతరత్న ఇవ్వాలని ఎలా కోరతారని ప్రశ్నించారు. కొద్దికాలం గడిస్తే గాంధీని చంపిన నాథూరాం గాడ్సేకు కూడా భారతరత్న ఇవ్వాల్సిందిగా కోరతారని ఎద్దేవా చేశారు.

**మేనిఫెస్టో ముఖ్యాంశాలు..**


- రాబోయే అయిదేళ్ళలో కోటి ఉద్యోగాలు.
- 2022 నాటికి అందరికీ ఇళ్లు.
- రూ. 16,000 కోట్లతో మహారాష్ట్ర తాగునీటి ప్రాజెక్టు
- డ్యాముల అనుసంధానంతో మరట్వాడాకు నీరు

## క్లుప్తంగా...

### ఆ మాజీ ఎంపీల ఇళ్లకు నీళ్లు, కరెంట్, గ్యాస్ కట్

**న్యూఢిల్లీ:** గడువు ముగిసినా అనధికారికంగా ఎంపీల భవనాల్లో నివసిస్తున్న 27 మంది మాజీ ఎంపీల ఇళ్లకు నీరు, కరెంట్, గ్యాస్ నిలిపివేయాలని లోక్‌సభ హౌస్ కమిటీ నిర్ణయించింది. వారిని ఖాళీ చేయించేందుకు పోలీసుల సహకారం తీసుకోవాలని కమిటీ చైర్మన్ సీఆర్ పాటిల్ మంగళవారం నిర్ణయం తీసుకున్నారు. ల్యూటెన్స్ ఢిల్లీలోని అధికారిక నివాసాలను ఖాళీ చేయాల్సిందిగా కమిటీ గతంలో పలుమార్లు మాజీ ఎంపీలను హెచ్చరించింది. అయినా ఇంకా కొందరు తిష్టవేసి ఉన్నారు.

### షారుఖ్ @ 3.9 కోట్లు



**ముంబై:** బాలీవుడ్ నటుడు షారుఖ్ ఖాన్‌కు ట్విట్టర్ ఫాలోవర్ల సంఖ్య 3.9 కోట్లను దాటింది. ఈ సందర్భంగా ఆయన తన అభిమానులకు సెల్ఫీతో కూడిన కృతజ్ఞతలు తెలిపారు. 'ప్రేమను పంచుతూనే ఉండండి. సానుకూల దృక్పథాన్ని పెంచుతూనే ఉండండి. మిమ్మల్ని మీరు ఆనందంగా ఉంచుకోండి. మీరు చూసే దృష్టికోణాన్ని బట్టే ప్రతిదానిలో ఆనందపుపాళ్లు కనిపిస్తాయి. లవ్ యూ ఆల్' అంటూ ట్వీట్ చేశారు.

### కశ్మీర్లో పాక్ ఉగ్రవాదులు

**న్యూఢిల్లీ:** ఉత్తర కశ్మీర్లోని గందర్‌బల్ ప్రాంతంలోని త్రుంఖల్ అడవుల్లో భారతీయ సైన్యం సెప్టెంబర్ 28 నుంచి 'ఆపరేషన్ త్రుంఖల్' కొనసాగిస్తోంది. పాకిస్తానీ ఉగ్రవాదులున్నారన్న సమాచారంతో సెప్టెంబర్ 28న గాలింపు చేపట్టారు. ఆ రోజే ఒక ఉగ్రవాదిని మట్టుపెట్టారు. మరునాడు మరో టెర్రరిస్టును హతమార్చారు. వారి వద్ద నుంచి ఆటోమేటిక్ ఆయుధాలను, ఇతర పేలుడు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. అయితే, ఇంకా ఆ ప్రాంతంలో దాదాపు పాతికమంది శిక్షణ పొందిన సాయుధ ఉగ్రవాదులున్నారనే సమాచారంతో నాటి నుంచి 'ఆపరేషన్ త్రుంఖల్'ను సైన్యం, జమ్మూకశ్మీర్ పోలీసులు సంయుక్తంగా కొనసాగిస్తున్నారు. సుశిక్షితులైన పారా కమెండోలను సైతం రంగంలోకి దింపారు. దాంతో ఈ సంవత్సరంలో ఇప్పటివరకు ఎక్కువ రోజులు కొనసాగిన ఆర్మీ ఆపరేషన్‌గా ఇది నిలిచింది. 'దాదాపు రెండు డజన్ల మంది శిక్షణ పొందిన ఉగ్రవాదులు పాక్ నుంచి గురెజ్ ప్రాంతం ద్వారా కశ్మీర్లోకి ప్రవేశించారు. అక్కడి నుంచి బండిపొరకు దక్షిణ కశ్మీర్‌కు వెళ్లాలన్నది వారి ఆలోచన' అని హోం శాఖ వర్గాలు వెల్లడించాయి.

### ప్రచారం కోసం రైళ్లు




**న్యూఢిల్లీ:** అదనపు ఆదాయం పెంపొందించుకునే దిశగా రైల్వే శాఖ ఓ నూతన ఆలోచనకు శ్రీకారం చుట్టింది. ప్రచార కార్యక్రమాల కోసం రైళ్లను ఉపయోగించుకునేందుకు వీలుగా అనుమతినిచ్చినట్లు మంగళవారం తెలిపింది. 'ప్రమోషన్ ఆన్ వీల్స్' కింద ప్రచార కార్యక్రమాల కోసం ప్రత్యేక రైళ్లు అందుబాటులో ఉంటాయని, దీంతో కళలు, సంస్కృతి, సినిమాలు, టీవీకి సంబంధించిన కార్యక్రమా లను ప్రచారం చేసుకోవచ్చని వివరించింది. కాగా, అక్షయ్ కుమార్ హీరోగా నటిస్తున్న హౌజ్‌ఫుల్–4 సినిమా ప్రచారం కోసం ఆ సినిమా నిర్మాతలు ఇప్పటికే ఓ రైలును బుక్ చేసుకున్నారు.

# జిన్‌పింగ్‌కు 'దంగల్' నచ్చింది

- మహాబలిపురం భేటీలో ఆ సినిమా చూశానని నాతో చెప్పారు
- ఈ రాష్ట్ర యువతులు దేశానికి గర్వకారణంగా నిలిచారు
- హరియాణాలో ప్రధాని మోదీ



**చర్ఖిదాద్రి (హరియాణా):** చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ బాలీవుడ్ బ్లాక్ బస్టర్ సినిమా 'దంగల్'ను చూశారని, ఆ సినిమా ఆయనకెంతో నచ్చిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. గతవారం మహాబలిపురంలోని సముద్రతీరంలో ఇరువురు నేతలు ఇష్టాగోష్టిగా మాట్లాడుకుంటున్న సమయంలో.. ఈ విషయాన్ని జిన్‌పింగ్ ప్రస్తావించారని మోదీ వివరించారు. మహిళలు ఏదైనా సాధించగలరని సినిమాలో బాగా చూపారని జిన్‌పింగ్ వ్యాఖ్యానించారన్నారు. జిన్‌పింగ్ వ్యాఖ్యలు తనకెంతో సంతోషాన్నిచ్చాయన్నారు. కుస్తీయోధులు బబిత, గీతలను ఆయన తండ్రి మహావీర్ సింగ్ ఫొగట్ ప్రపంచస్థాయి రెజ్లర్లుగా తీర్చిదిద్దే క్రమాన్ని దంగల్ సినిమాలో చిత్రీకరించారు. బాలీవుడ్ స్టార్‌హీరో ఆమిర్‌ఖాన్ మహావీర్ సింగ్ పాత్రలో నటించిన ఈ సినిమా ఘనవిజయం సాధించింది. హరియాణాలోని చర్ఖిదాద్రి అసెంబ్లీ స్థానం నుంచి బీజేపీ తరఫున బబిత ఫొగాట్ పోటీ చేస్తున్నారు. ఆ నియోజకవర్గంలో జరిగిన బీజేపీ ప్రచారంలో మంగళవారం ప్రధాని మోదీ పాల్గొన్నారు. దంగల్ సినిమాలో హరియాణ్వీ యాసలో 'మన ఆడపిల్లలేమైనా మగపిల్లల కన్నా తక్కువా?' అన్న డైలాగ్‌ను సైతం మోదీ గుర్తు చేశారు. ఈ రాష్ట్ర యువతులు దేశానికి గర్వకారణంగా నిలిచారన్నారు. హరియాణా గ్రామాల సహకారం లేకుండా తన 'బేటీ బచావో.. బేటీ పఢావో' విజయవంతం కాకపోయేదన్నారు. మహిళల ఆరోగ్యం, ఆత్మగౌరవం, భద్రత తన ప్రభుత్వ ప్రాధామ్యాలని మోదీ స్పష్టం చేశారు. దేశానికి, సమాజానికి, తమ కుటుంబానికి గర్వకారణంగా నిలుస్తున్న మహిళలకు రాబోయే దీపావళి పండుగను అంకితమివ్వాలని మోదీ పిలుపునిచ్చారు. బబిత ఫొగాట్‌కు వ్యతిరేకంగా సీనియర్ నేతలు నిర్పేందర్ సింగ్ సంగ్వాన్(కాంగ్రెస్), సత్పాల్ సంగ్వాన్(జననాయక్ జనతాపార్టీ) బరిలో ఉన్నారు.

**ఆర్టికల్ 370పై కాంగ్రెస్ అసత్య ప్రచారం**

'మోదీని తిట్టాలనుకుంటే ఎంతైనా తిట్టండి. అవసరమైతే థాయ్‌లాండ్, వియత్నాం.. ఎక్కడి నుంచైనా మరిన్ని తిట్లను అరువు తెచ్చుకోండి. నాకేం బాధ లేదు. కానీ అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న భారత్‌కు వెన్నుపోటు పొడవాలనుకోకండి' అని మోదీ విపక్షాలనుద్దేశించి వ్యాఖ్యానించారు. ఆర్టికల్ 370పై కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోందని, అలాంటి కాంగ్రెస్‌ను ఈ ఎన్నికల్లో ఓడించి శిక్షించాలని హరియాణా ఓటర్లకు పిలుపునిచ్చారు. జమ్మూకశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించే రాజ్యాంగ అధికరణ 370ని రద్దు చేస్తూ ఈ ఆగస్ట్ 5న కేంద్రం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. చర్ఖిదాద్రి, థానేసర్‌ల్లో జరిగిన ఎన్నికల సభల్లో మోదీ పాల్గొన్నారు.

## నవ్‌లఖాకు అరెస్టు నుంచి 4 వారాల రక్షణ

**న్యూఢిల్లీ:** కోరేగావ్– బీమా అల్లర్ల కేసులో పౌర హక్కుల కార్యకర్త గౌతం నవ్‌లఖాను మరో నాలుగు వారాలపాటు అరెస్టు రాదంటూ సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. నవ్‌లఖా పిటిషన్‌పై మంగళవారం విచారణ చేపట్టిన జస్టిస్ అరుణ్ మిశ్రా, జస్టిస్ దీపక్ గుప్తాల ధర్మాసనం ముందస్తు బెయిల్ కోసం సంబంధిత న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సిందిగా కోరింది. మహారాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించగా నవ్‌లఖాను విచారించకుండా ఏడాది నుంచి ప్రభుత్వం ఏం చేసిందని ధర్మాసనం నిలదీసింది. నవ్‌లఖాను అక్టోబర్ 15 వరకు అరెస్టు చేయరాదంటూ అక్టోబర్ 4వ తేదీన సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. హక్కుల కార్యకర్త నవ్‌లఖాకు 2017లో జరిగిన కోరేగావ్–బీమా అల్లర్లకు, మావోయిస్టులతో సంబంధాలను రుజువు చేసేందుకు తగు ఆధారాలున్నాయంటూ పోలీసులు కేసు నమోదు చేశారు.



గురు నానక్ 550వ జయంతి సందర్భంగా లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ లక్ష్యంగా జలంధర్‌లోని సీటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు 550 రకాల శాండ్‌విచ్‌లు తయారు చేశారు.

## ఎట్‌వుడ్, బెర్నర్‌డైన్‌లకు బుకర్ అవార్డు



బెర్నర్‌డైన్, మార్గరెట్

**లండన్:** కెనడా రచయిత మార్గరెట్ ఎట్‌వుడ్, ఆంగ్లో నైజీరియా రచయిత బెర్నర్‌డైన్‌లు 2019 బుకర్ బహుమతి విజేతలుగా నిలిచారు. మార్గరెట్ ఎట్‌వుడ్ రచించిన 'ద టెస్టమెంట్స్', బెర్నర్ డైన్ ఎవరిస్టో రచించిన 'గర్ల్, ఉమన్, అదర్' పుస్తకం రెండూ ఒకదానికొకటి పోటీపడ్డాయి. అయితే, సంయుక్తంగా ఈ బహుమతి ఇవ్వకూడదనే నియమాలను జ్యూరీ ఈసారి పక్కనపెట్టింది. ఇద్దరినీ కలిపి విజేతలుగా ప్రకటించింది. ఆంగ్ల సాహిత్యంలో బుకర్ బహుమతిని అత్యున్నత పురస్కారంగా భావిస్తారు. 1969లో లండన్ వేదికగా ప్రారంభమైన ఈ అవార్డు అందుకున్న తొలి నల్లజాతి మహిళ బెర్నర్‌డైడ్(60) కావడం విశేషం. కాగా, కెనడాకు చెందిన మార్గరెట్ ఎట్‌వుడ్(79) బుకర్ ప్రైజ్ అందుకోవడం ఇది రెండోసారి.

# నేటితో 'అయోధ్య' వాదనలు పూర్తి!

**సాయంత్రం 5 వరకు వాదనలు విననున్న సుప్రీంకోర్టు**

**న్యూఢిల్లీ:** వివాదాస్పద రామజన్మభూమి–అయోధ్య కేసు వాదనలను బుధవారంతో ముగించాలని సుప్రీంకోర్టు భావిస్తోంది. అక్టోబర్ 18తో అయోధ్య కేసు వాదనలను ముగించాలని తొలుత నిర్ణయించినా.. 16వ తేదీతోనే ముగించాలని యోచిస్తోంది. దీనిలో భాగంగా ఈ కేసుకు సంబంధించిన వాదనలన్నీ నేటితో ముగించాలని మంగళవారం హిందూ, ముస్లిం పార్టీలకు సూచించింది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు వాదనలు వింటామని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ పేర్కొన్నారు. మంగళవారం కూడా సాయంత్రం 5 గంటల వరకు వాదనలు విన్నది. సీజేఐ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం.. ఈ కేసును 39 రోజులుగా విచారిస్తున్న విషయం తెలిసిందే. సీజేఐ పదవీకాలం నవంబర్ 17తో ముగియనుంది. అప్పటికల్లా తీర్పు వెలువడకపోతే కేసు విచారణను మళ్లీ మొదటి నుంచి ప్రారంభించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆలోపే తీర్పు వెలువరించాలని ధర్మాసనం భావిస్తోంది. గతంలో ఓ సందర్భంలో సీజేఐ మాట్లాడుతూ.. 'అయోధ్య కేసులో తీర్పు వెలువరించేందుకు నాలుగు వారాల సమయం మాత్రమే ఉంది. ఇంత స్వల్ప సమయంలో తీర్పు చెప్పడం ఓ అద్భుతం లాంటిదే'అని పేర్కొన్నారు.

**బాబర్ తప్పును సరిదిద్దాల్సి ఉంది..**

రాముడి జన్మస్థలమైన అయోధ్యలో ఆలయాన్ని కూల్చి మసీదును నిర్మించి బాబర్ చక్రవర్తి చారిత్రక తప్పిదం చేశారని.. దీనిని సరిదిద్దాల్సిన అవసరం ఉందని హిందూ పార్టీ సుప్రీంకోర్టుకు తెలిపింది. అయోధ్య కేసుకు సంబంధించి సీజేఐ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. హిందూ పార్టీ తరఫున సీనియర్ అడ్వొకేట్ కె.పరాశరన్ వాదనలు వినిపించారు.



### న్యాయ వ్యవస్థపై బురద జల్లే ప్రయత్నం

భూసేకరణ చట్టంపై విచారణ నుంచి తప్పుకోవాలంటూ తనపై సోషల్ మీడియాలో వచ్చిన కథనాలపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరుణ్ మిశ్రా తీవ్రంగా అభ్యంతరం తెలిపారు. ఫలానా జడ్జి అంటూ ఆ కథనాల్లో వేలెత్తి చూపకున్నా న్యాయ వ్యవస్థపై బురద జల్లే ప్రయత్నం జరిగిందని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం చేపట్టే భూసేకరణలో నిబంధనలపై గతంలో రెండు ధర్మాసనాలు వేర్వేరుగా తీర్పులు వెలువరించాయి. ఆ ధర్మాసనాల్లో ఒకదానికి జస్టిస్ మిశ్రా నేతృత్వం వహించారు. పరస్పర విరుద్ధ తీర్పులు వివాదాస్పదం కావడంతో ఈ అంశాన్ని రాజ్యాంగ ధర్మాసనానికి బదిలీ చేస్తున్నట్లు గతంలో సుప్రీంకోర్టు ప్రకటించింది. అయిదుగురు సభ్యులతో కూడిన ఈ ధర్మాసనంలో జస్టిస్ మిశ్రా కూడా ఉన్నారు. దీనిపై కొన్ని పక్షాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయని, ఆ ధర్మాసనం నుంచి జస్టిస్ మిశ్రా వైదొలగాలంటూ సోషల్ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. మంగళవారం విచారణ సందర్భంగా జస్టిస్ మిశ్రా వీటిపై అభ్యంతరం వ్యక్తం చేశారు.

# ఇక ఈడీ కస్టడీకి చిదంబరం!

- అరెస్ట్ చేసేందుకు అనుమతించిన ప్రత్యేక కోర్టు
- నేడు తీహార్ జైల్లో మాజీ కేంద్ర మంత్రిని విచారించనున్న ఈడీ

**న్యూఢిల్లీ:** ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులోని నగదు అక్రమ చలామణికి సంబంధించి కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ కేంద్ర మంత్రి పీ చిదంబరంను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అరెస్ట్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం తీహార్ జైల్లో ఉన్న చిదంబరంను విచారించేందుకు, అవసరమైతే అరెస్ట్ చేసేందుకు ఈడీకి స్థానిక కోర్టు మంగళవారం అనుమతి మంజూరు చేసింది. చిదంబరంను బుధవారం ఉదయం 8.30 గంటల నుంచి విచారించేందుకు జైల్లో అవసరమైన ఏర్పాట్లు చేయాలని జైలు అధికారులను ప్రత్యేక న్యాయమూర్తి అజయ్ కుమార్ కుహార్ ఆదేశించారు. 55 రోజులుగా, ఆగస్టు 21 నుంచి, సీబీఐ, జ్యుడీషియల్ కస్టడీల్లోనే చిదంబరం ఉన్న విషయం తెలిసిందే. మరో రెండు రోజుల్లో ఆయన జ్యుడీషియల్ కస్టడీ ముగియనుంది. కోర్టు ఆవరణలోనే చిదంబరంను ప్రశ్నించేందుకు అనుమతివ్వాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ అమిత్ మహాజన్ కోర్టును కోరారు. అయితే, ఆయన గౌరవాన్ని దృష్టిలో పెట్టుకుని, బహిరంగంగా విచారించడం, అరెస్ట్ చేయడం సరికాదని జడ్జి తెలిపారు.




చిదంబరాన్ని కోర్టుకు తరలిస్తున్న దృశ్యం

**సీబీఐ నన్ను అవమానిస్తోంది: చిదంబరం**


ఐఎన్‌ఎక్స్ మీడియా అవినీతి కేసుకు సంబంధించి సీబీఐ విచారిస్తున్న మరో కేసులో నిందితుడిగా తీహార్ జైల్లో ఉన్న చిదంబరం మంగళవారం సుప్రీంకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. తనను అవమానపరిచేందుకే సీబీఐ కస్టడీ కోరుతోందని ఆరోపించారు. చిదంబరం తరఫున సీనియర్ అడ్వొకేట్లు కపిల్ సిబల్, అభిషేక్ మను సింఘ్వీలు వాదించారు. జస్టిస్ ఆర్ బానుమతి నేతృత్వంలో సుప్రీం బెంచ్ ఎదుట వాదనలు వినిపించిన లాయర్లు ఈ కేసులో అంశాలన్నీ చిదంబరానికే అనుకూలంగా ఉన్నప్పటికీ ఢిల్లీ హైకోర్టు బెయిల్ ఇవ్వడానికి నిరాకరించిందన్నారు. చిదంబరం బెయిల్ పిటిషన్‌ను గతంలో ఢిల్లీ హైకోర్టు విచారించినప్పుడు మూడు అంశాలపైనే సీబీఐ పదే పదే వాదించింది. అయితే విదేశాలకు వెళ్లిపోవడం, సాక్ష్యాలను తారుమారు చేస్తారు అనే విషయాల్లో సీబీఐ వ్యక్తం చేసిన అనుమానాలను ఢిల్లీ హైకోర్టు కొట్టేసింది.

# ప్రఫుల్ పటేల్‌కు ఈడీ సమన్లు

- 18న విచారణకు రావాలని ఆదేశం
- మనీలాండరింగ్ అభియోగాలు
- తమకేం సంబంధం లేదన్న ప్రఫుల్



**ముంబై:** ఎన్సీపీ నేత ప్రఫుల్ పటేల్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమన్లు జారీ చేసింది. ఈ నెల 18న ముంబైలోని తమ కార్యాలయం ఎదుట హాజరు కావాలని సూచించింది. అవినీతి నియంత్రణ చట్టం కింద ఆయన్ను విచారించనుంది. ప్రఫుల్ ప్రారంభించిన రియల్ ఎస్టేట్ కంపెనీ గురించి ప్రధానంగా ఈడీ అధికారులు ఆరా తీయనున్నారు.. యూపీఏ హయాంలో కేంద్ర మంత్రిగా పనిచేసిన ప్రఫుల్‌ను ఇప్పటికే ఏవియేషన్ కుంభకోణం కేసులో ఈడీ అధికారులు విచారించారు. కాగా ఇప్పుడు.. అండర్ వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీంకు సన్నిహితుడైన డ్రగ్స్ సరఫరాదారు ఇక్బాల్ మిర్చి భార్య హజ్రా మీమన్‌తో చేసిన వ్యాపార లావాదేవీల వ్యవహారంలో మనీ లాండరింగ్ కింద ప్రఫుల్‌పై ఈడీ అభియోగం మోపింది. ప్రఫుల్‌కు చెందిన మిలీనియం డెవలపర్స్ పేరుతో ఓ రియల్ ఎస్టేట్ కంపెనీ ఉంది. ఆ కంపెనీ సీజయ్ హౌస్ పేరుతో 2006–07లో ఓ భవనం నిర్మించింది. నిర్మించిన భవనంలో మూడు, నాలుగో అంతస్తులు ఇక్బాల్ భార్యకు ఇచ్చినట్లు ఈడీ అభియోగాలు మోపింది. ఈ స్థలం కూడా ఇక్బాల్‌కు చెందినదేనని.. డ్రగ్స్, ఇతర నేరాల ద్వారా సంపాదించిన సొమ్ముతో దీన్ని కొనుగోలు చేసినట్లు ఈడీ ఆరోపించింది. 2013లో ఇక్బాల్ మరణించడంతో అతడి భార్య ఈ వ్యవహారంలో పావులు కదిపినట్లు ఈడీ తెలిపింది. అయితే ఈ విషయంలో తమపై వస్తున్నవన్నీ నిరాధార ఆరోపణలేనని ప్రఫుల్ కొట్టిపారేశారు. కంపెనీలో తమ కుటుంబం మాత్రమే భాగస్వాములని, ఇతరులెవరూ అందులో లేరని అన్నారు. తమకు, హజ్రా మీమన్‌కు మధ్య ఒక్క పైసా లావాదేవీ కూడా జరగలేదని అన్నారు.



## వేటగాళ్ల కోసం వచ్చాడు..

ఎర్రటి వర్ణంతో వెలుగులు విరజిమ్ముతోంది ఎవరో తెలుసా.. సంధ్యా సమయంలో సూర్యుడేమో అనిపిస్తోంది కదూ.. కానేకాదు.. మన చందమామ. ఎంత అందంగా ఉన్నాడో కదూ.. ఏటా సెప్టెంబర్ ఈక్వినాక్స్ తర్వాత వచ్చే తొలి పౌర్ణమి రోజున ఇలా చంద్రుడు చాలా కాంతిమంతంగా ఉంటాడు. సాధారణంగా ఈ చంద్రుడిని హంటర్స్ మూన్ అని పిలుస్తారు. ఎందుకంటే ఈ కాంతి వెలుగులో వేటగాళ్లు వేటకు వెళ్లేవారని చెబుతారు. అలాగే శరదృతువు ప్రారంభంగా కూడా భావిస్తారు. ఈ వెలుగును చూసే అప్పట్లో రైతులు పంటలు వేసేవారని ప్రతీతి. బ్రిటన్‌లోని కేంబ్రిడ్జ్‌షైర్‌లో ఉన్న ఎలీ క్యాథడ్రల్ చర్చి వద్ద తీసిన ఫొటో ఇది.

# కొత్త పురపాలికల్లో ఎల్ఆర్ఎస్

**లే అవుట్లలోని స్థలాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అనుమతి**

సాక్షి, హైదరాబాద్: అనధికారిక లేఅవుట్లలోని స్థలాల క్రమబద్ధీకరణ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) పథకానికి రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. కొత్తగా ఏర్పడిన 73 నగర/పురపాలక సంఘాల పరిధిలో ఈ పథకం అమలుకు మార్గదర్శకాలు జారీ చేసింది. గతేడాది మార్చి 30లోగా రిజిస్టర్ అయిన ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు వెసులుబాటు కల్పించింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల సమర్పణకు 90 రోజుల గడువు విధించింది. దరఖాస్తుతోపాటు రూ. 10 వేలు చెల్లించాల్సి ఉంటుంది. కొత్త మున్సిపాలిటీ/కార్పొరేషన్లలో ఎల్ఆర్ఎస్ అమలు చేయడంతో రాష్ట్ర ఖజానాకు భారీగా ఆదాయం సమకూరనుంది. అలాగే అక్రమ లే అవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన సామాన్య, మధ్యతరగతి ప్రజల కష్టాలు తొలగి సొంతింటి కల నెరవేరనుంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు లక్షకుపైగా దరఖాస్తులు వస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఇందులో అధికంగా హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో నూతనంగా ఏర్పడిన నగర/పురపాలక సంఘాల పరిధిలో రానున్నాయి. 2015 నవంబర్‌లో అప్పటి నగర పాలక సంస్థలు, పురపాలక సంఘాల పరిధిలో ఎల్ఆర్ఎస్‌ను రాష్ట్ర ప్రభుత్వం వర్తింపజేసింది. అయితే కొత్తగా ఏర్పడ్డ 73 కార్పొరేషన్లు/మున్సిపాలిటీలు గతంలో పంచాయతీలుగా కొనసాగాయి. ఇవి గతేడాది పురపాలనలో విలీనం కావడంతో వాటిలోనూ స్థలాలను క్రమబద్ధీకరించుకునే వెసులుబాటు కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

**200 గజాల ప్లాటు క్రమబద్ధీకరణకు రూ. లక్షపైనే...**

ఆదిభట్ల పురపాలక సంఘం పరిధిలోని ఓ అనధికారిక లే అవుట్‌లో నారాయణకు 200 చదరపు గజాల విస్తీర్ణంలో ప్లాటుంది. ఈ ప్లాటును క్రమబద్ధీకరించుకోవాలంటే రెండు రకాల రుసుములు చెల్లించాల్సి ఉంటుంది. మొదటిది ఈ విస్తీర్ణాన్ని చదరపు మీటర్లలో లెక్కిస్తే.. 167 చదరపు మీటర్లు అవుతుంది. దీనిపై ప్రతి చ.మీకి రూ. 400 చొప్పున మొత్తం రూ. 66,800 చెల్లించాలి. దీనికి అదనంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్లాటు ఉన్న ప్రాంతానికి నిర్దేశించిన మార్కెట్ విలువ (14–10–2019 నాటికి) మరో 20% చెల్లించాల్సి ఉంటుంది. అంటే గజానికి నిర్దేశిత విలువ రూ. వెయ్యి అయితే దానిపై 20% అదనపు వడ్డన తప్పదు. ఈ రూపేణా కూడా మరో రూ. 40 వేలు సమర్పించుకోవాల్సిందే. మొత్తంగా 200 గజాల ప్లాటు క్రమబద్ధీకరణకు రెండు రుసుములు కలిపితే రూ. 1.06 లక్షలు చెల్లించాల్సిందేనని అధికార వర్గాలు చెబుతున్నాయి. అనధికారిక లే అవుట్‌లో 10 శాతం బహిరంగ ఖాళీ స్థలం వదలకపోతే లే అవుట్‌లోని ప్లాట్ల క్రమబద్ధీకరణకు అదనంగా 14% వసూలు చేయనున్నారు. ఇవేకాకుండా నాలా చార్జీలు (వ్యవసాయేతర) కూడా కట్టాల్సి ఉంటుంది. అయితే నాలా, శిఖం, చెరువు, కుంట, ఎఫ్‌టీఎల్ పరిధిలో వెలిసిన లే అవుట్లను క్రమబద్ధీకరణకు పరిగణనలోకి తీసుకోరు. పట్టణ భూ గరిష్ట పరిమితి (యూఎల్‌సీ) ప్లాట్లను కూడా రెగ్యులరైజేషన్ చేస్తారు. అయితే వాటికి యూఎల్‌సీ క్లియరెన్స్ తప్పనిసరి. దరఖాస్తుతోపాటు సేల్ డీడ్, రెవెన్యూ స్కెచ్, మార్కెట్ విలువ, లే అవుట్ నకలు, లోకేషన్ స్కెచ్, ఇండెమ్నిటీ బాండ్, అవసరమైన నిరభ్యంతర పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. హెచ్ఎండీఏ పరిధిలోని కార్పొరేషన్లు/మున్సిపాలిటీల్లో ఎల్ఆర్ఎస్‌ను హెచ్ఎండీఏ, ఇతర నగర/పురపాలక సంఘాలకు సంబంధించి డీటీసీపీ పరిశీలించనుంది. దరఖాస్తులను తిరస్కరిస్తే ట్రిబ్యునల్‌కు అప్పీల్ చేసుకునే వీలుంటుంది. మొత్తం నిర్దేశిత రుసుము చెల్లించిన 6 నెలల్లో స్థల క్రమబద్ధీకరణ చేస్తారు.

| ప్లాటు వైశాల్యం (చ.మీటర్లలో) | రుసుము (చ.మీ. రూ.లలో) |
|---|---|
| 100లోపు | 200 |
| 101–300 | 400 |
| 301–500 | 600 |
| 500పైనా | 750 |

- మురికివాడల్లో రూ.5 (వైశాల్యంతో సంబంధం లేకుండా)

**భూముల మార్కెట్ విలువ ఆధారంగా నిర్దేశించిన క్రమబద్ధీకరణ రుసుము**

| స్థల వైశాల్యం (చ.గజాల్లో) | రుసుము (శాతం) |
|---|---|
| 3,000లోపు | 20 |
| 3,001–5,000 | 30 |
| 5,001–10,000 | 40 |
| 10,001–20,000 | 50 |
| 20,001–30,000 | 60 |
| 30,001–50,000 | 80 |
| 50,000పైనా | 100 |

# ఆడవారిదే 'ఆయువు'పట్టు!

▶ మొదటి పేజీ తరువాయి

అత్యధికంగా మహిళలు 87.1 ఏళ్లు, పురుషులు 81.1 ఏళ్లు బతుకుతున్నారు.

**18 ఏళ్ల ఆయుర్దాయ వ్యత్యాసం..**

ఇక ప్రపంచంలో మహిళలతో పోలిస్తే పురుషుల ఆయుర్దాయం తగ్గడానికి ఏదో ఒకట్రెండు కారణాలు అనుకోలేమని, 40 ప్రధాన కారణాలున్నాయని విశ్లేషించింది. అందులో 33 కారణాలు అధికంగా దోహదం చేస్తాయని పేర్కొంది. గుండెపోటు, ఊపిరితిత్తుల కేన్సర్, టీబీ, రోడ్డు ప్రమాదాలు వంటివి ఉన్నాయి. ఇక తక్కువ ఆదాయం కల దేశాల్లో పుట్టినవారి ఆయుర్దాయం 62.7 ఏళ్లు కాగా, అధికాదాయ దేశాల ప్రజల ఆయుర్దాయం మాత్రం ఏకంగా 80.8 ఏళ్లు. అంటే అధికాదాయ దేశాల కంటే అల్పాదాయ దేశాల ప్రజల ఆయుర్దాయం 18.1 సంవత్సరాలు తక్కువ. ఈ దేశాల జాబితాలో భారత్ కూడా ఉండటం గమనార్హం. తక్కువ ఆదాయం గల దేశాల్లో ఆయుర్దాయం తక్కువ ఉండటానికి 10 ప్రధాన కారణాలు ప్రత్యేకంగా ఉన్నాయి. శ్వాసకోశ ఇన్ఫెక్షన్లతో ఆయుర్దాయం 2.09 ఏళ్లు తగ్గింది. అతిసార వ్యాధులతో 1.97 ఏళ్లు, గుండెపోట్లతో 1.45 ఏళ్లు, ఎయిడ్స్‌తో 1.45 ఏళ్లు, టీబీతో 1.35 సంవత్సరాలు, గుండె జబ్బుల తో 1.35 ఏళ్లు, మలేరియాతో 10 నెలలు, రోడ్డు ప్రమాదాలతో ఏడున్నర నెలలు, పోషకాహార లోపంతో 6 నెలలు, ఇతరత్రా కారణాలతో మరో ఏడాదిన్నర ఆయుర్దాయం తగ్గుతోందని తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా 2016లో మధుమేహం, గుండెపోటు, కిడ్నీ, కేన్సర్ తదితర వ్యాధుల కారణంగా 4.10 కోట్ల మంది చనిపోయారు. అంటే మొత్తం ప్రపంచంలో ఆ ఏడాది చనిపోయినవారిలో ఈ సంఖ్య ఏకంగా 71 శాతం ఉండటం ఆందోళన కలిగిస్తోంది.



**పది మందిలో ఒకరికి కాలుష్యం కాటు..**

పట్టణాలు, నగరాల్లో ప్రతీ పది మందిలో ఒకరు వాయు కాలుష్యం బారిన పడుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. వాయుకాలుష్యం కారణంగా గుండె జబ్బులు, ఊపిరితిత్తుల కేన్సర్, ఇతర శ్వాసకోశ వ్యాధులు రావడానికి ప్రమాదముంది. ప్రపంచవ్యాప్తంగా వాయు కాలుష్యం వంటి కారణాల వల్ల 2016లో ఏకంగా 70 లక్షల మంది చనిపోయారు. ఇక పరిశుభ్రమైన తాగునీటిని వాడుతున్న ప్రజల శాతం పెరిగింది. 2015లో 71 శాతం మంది ప్రజలు పరిశుభ్రమైన నీరు తాగుతున్నారు. అయితే ప్రపంచవ్యాప్తంగా 2016లో పారిశుద్ధ్యలోపం, అపరిశుభ్రమైన నీటి వల్ల 9 లక్షల మంది చనిపోయారని తెలిపింది. అందులో ఐదేళ్లలోపు చిన్నారులు డయేరియా కారణంగా 4.70 లక్షల మంది చనిపోయారు.

**80.80 కోట్ల మంది 10 శాతానికి పైగా ఖర్చు**

ప్రపంచంలో సగం జనాభాకు అత్యవసర వైద్య సేవలు అందడం లేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. వీరికి తప్పనిసరిగా వైద్యం అందాల్సిన అవసరముందని చెప్పింది. ప్రపంచంలోని జనాభాలో 80.80 కోట్ల మంది తమ ఇంటి ఖర్చులో 10 శాతం పైగా వైద్యానికి ఖర్చు చేస్తున్నారు. తమ ఇంటి ఖర్చులో వైద్యానికి అధికంగా ఖర్చు చేసిన ఫలితంగా 2010లో ఏకంగా 9.70 కోట్ల మంది పేదరికంలోకి వెళ్లాల్సి వచ్చింది. అంటే వైద్యం కోసం ఆస్తులు అమ్ముకోవడం వంటి పరిణామాలతో ఈ పరిస్థితి తలెత్తింది. పెద్ద చిన్నా అనే తేడా లేకుండా అన్ని దేశాల్లోనూ మందుల కొనుగోళ్లకే ప్రజలు ఎక్కువగా ఖర్చు చేస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతీ పది వేల మందికి 15 మంది డాక్టర్లు మాత్రమే ఉన్నారు. షుగర్, బీపీ, గుండె, కిడ్నీ సంబంధింత వ్యాధులకు థాయ్‌లాండ్ కంటే కూడా భారత్‌లో యూనివర్సల్ హెల్త్ కవరేజీ ఎక్కువగా లేకపోవడం గమనార్హం. శ్రీలంకలో 62% జనాభాకు యూనివర్సల్ హెల్త్ కవరేజీ అందుతుండగా, దేశంలో కేవలం 56% మందికే అందుతోంది. గర్భిణిలు ఆసుపత్రికి వస్తే ప్రసవం చేయడానికి నిపుణులైన వైద్య సిబ్బంది ఉండటం లేదు. దీనివల్ల మాతా శిశుమరణాలు అధికంగా సంభవిస్తున్నాయని తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా యూనివర్సల్ హెల్త్ కేర్ అందుబాటులోకి వస్తేనే ప్రజల ఆరోగ్య ప్రమాణాలు, ఆయుర్దాయం పెరుగుతాయని డబ్ల్యూహెచ్‌వో దేశాలకు పిలుపునిచ్చింది.

## డిమాండ్‌కు అనుగుణంగా ఉపాధి అవకాశాలు



సాక్షి, హైదరాబాద్: ఆధునిక నైపుణ్యాన్ని అందిస్తూ, శిక్షణా సదుపాయాలను విస్తరిస్తేనే విద్యావంతులైన నిరుద్యోగ యువతకు మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. పారిశ్రామిక, సేవా రంగాలకు నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఫ్యాప్సి కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన అప్రెంటిస్ పక్వాడా కార్యక్రమంలో మల్లారెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఐటీఐలో ఉత్తీర్ణులైన విద్యార్థుల వివరాలను అప్రెంటిస్ పోర్టల్‌లో నమోదు చేయమని ఆదేశాలిచ్చామని మంత్రి వివరించారు. ప్రభుత్వ ఐటీఐల్లో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు అప్రెంటిస్ కోసం ప్రాంగణ నియామకాలు నిర్వహించి వివిధ కంపెనీలకు ఎంపిక చేస్తామన్నారు. నైపుణ్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని, దీనికోసం రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చైర్మన్‌గా కమిటీ వేసినట్లు తెలిపారు.

## తెలంగాణకు 79.. ఏపీకి 69.34 టీఎంసీలు

**కృష్ణాలో నీటి కేటాయింపులు జరిపిన బోర్డు..**

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుత వాటర్ ఇయర్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు ఈ నెల 4 వరకు వినియోగించుకున్న నీటి లెక్కలను కృష్ణా బోర్డు తేల్చింది. రెండు రాష్ట్రాలు నీటి కేటాయింపుల కోసం పంపిన ప్రతిపాదనలు.. ఇప్పటివరకు చేసిన కేటాయింపులను పరిగణనలోకి తీసుకుని, తక్షణ సాగు, తాగునీటి అవసరాల కోసం తెలంగాణకు 79 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్‌కు 69.34 టీఎంసీలు కేటాయిస్తూ కృష్ణా బోర్డు సభ్య కార్యదర్శి ఎ.పరమేశం మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నవంబర్ వరకు సాగు, తాగునీటి అవసరాల కోసం 150 టీఎంసీలు కేటాయించాలని ఏపీ సర్కార్, 79 టీఎంసీలు కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వం బోర్డుకు ప్రతిపాదనలు పంపాయి. కాగా ఈ నెల 4 వరకు శ్రీశైలం జలాశయంలో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి 112.970 టీఎంసీలు, హంద్రీ–నీవా నుంచి 10.257, నాగార్జునసాగర్ కుడి కాలువ నుంచి 51, ఎడమ కాలువ నుంచి 10, కృష్ణా డెల్టాలో 59.510 వెరసి 232.654 టీఎంసీలు ఏపీ వినియోగించుకున్నట్లు కృష్ణా బోర్డు లెక్క కట్టింది. ఇటు తెలంగాణ శ్రీశైలం ప్రాజెక్టు నుంచి కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా 12.727 టీఎంసీలు, నాగార్జునసాగర్ ఎడమ కాలువ ద్వారా 18.22, ఏఎమ్మార్పీ, హైదరాబాద్ తాగు నీటి అవసరాలకు 16.141, మిషన్ భగీరథకు 1.358 మొత్తం 48.436 టీఎంసీలను వినియోగించుకున్నట్లు బోర్డు లెక్కించింది. తాజా నీటి కేటాయింపుల మేరకు ఏపీకి శ్రీశైలం ప్రాజెక్టులో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కు 3.03, హంద్రీ–నీవాకు 9.743, సాగర్ కుడి కాలువకు 42.554, ఎడమ కాలువకు 5.529, కృష్ణా డెల్టాకు 8.49 వెరసి 69.348 టీఎంసీలను కేటాయించింది. తెలంగాణకు శ్రీశైలం ప్రాజెక్టు నుంచి కల్వకుర్తి ఎత్తిపోతలకు 15 టీఎంసీలు, సాగర్ ఎడమ కాలువకు 45, ఏఎమ్మార్పీకి 17, మిషన్ భగీరథకు 2 కలిపి 79 టీఎంసీలను కేటాయించింది.




## సుగంధ ద్రవ్య పంటలపై దృష్టి సారించాలి

**మంత్రి నిరంజన్‌రెడ్డి**

సాక్షి, హైదరాబాద్: సుగంధ ద్రవ్య పంటల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి రైతులకు సూచించారు. సుగంధ ద్రవ్యాల పరిశోధన సంస్థను రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరతామని చెప్పారు. హైదరాబాద్‌లోని రెడ్‌హిల్స్‌లో తెలంగాణ ఉద్యాన శిక్షణ సంస్థలో సుగంధ ద్రవ్యాల పంటల సాగుపై జరిగిన రాష్ట్ర స్థాయి సదస్సుకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పంట పండించిన తరువాత దానిని మార్కెట్ చేసే బాధ్యత ప్రభుత్వానిదేనని తెలిపారు. ఎరువులు, ఇతర ముడి సరుకులు సబ్సిడీపై ఇస్తామన్నారు. రాబోయే రోజుల్లో రైతులకు మేలు చేసే మరిన్ని కార్యక్రమాలు చేపడతామన్నారు. ప్రపంచం ఇప్పుడు సేంద్రియ పంటల సాగు వైపు పోతుందన్నారు. కార్యక్రమానికి వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సి.పార్థసారథి, ఉద్యానశాఖ డైరెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి, నేషనల్ రీసెర్చ్ సెంటర్ ఫర్ సీడ్ స్పైసెస్ డైరెక్టర్ గోపాల్‌లాల్ హాజరయ్యారు.

## పదోన్నతుల షెడ్యూల్ ప్రకటించాలి: యూఎస్‌పీసీ

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియను వెంటనే ప్రారంభించి, అప్‌గ్రేడెడ్ పండిట్, పీఈటీ పోస్టులతో సహ ఖాళీగా ఉన్న ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) డిమాండ్ చేసింది. మంగళవారం టీటీఏ అధ్యక్షుడు హరికృష్ణ అధ్యక్షతన యూఎస్‌పీసీ స్టీరింగ్ కమిటీ సమావేశం జరిగింది. పదోన్నతులు లేక అర్హత గల సీనియర్ టీచర్లు నష్టపోతున్నారని, సబ్జెక్టు టీచర్ల కొరతతో విద్యార్థులకు నష్టం జరుగుతోందని యూఎస్‌పీసీ ఆందోళన వ్యక్తం చేసింది. అదే విధంగా ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సంఘీభావంగా యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో ఈ నెల 17న బైక్ ర్యాలీ నిర్వహించాలని, 19న బంద్‌కు మద్దతునివ్వాలని తీర్మానించింది.



సాక్షి
బుధవారం, అక్టోబర్, 16

# పేదరికంపై పోరుకు పురస్కారం

అత్యంత సంక్లిష్టమైన అంశంగా, ఓ పట్టాన కొరుకుడుపడని విషయంగా దేన్నయినా చెప్పదల్చుకున్నప్పుడు దాన్ని రాకెట్ సైన్స్‌తో పోలుస్తారు. ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలకూ పేదరిక నిర్మూలన అంశం ఇప్పుడు రాకెట్ సైన్స్‌లాగే తయారైంది. ఆర్థికాభివృద్ధిని సాధించే సమాజాలు సైతం సంక్షోభాల్లో చిక్కుకోవడం, పేదరికం మటుమాయం కాకపోవడం, బలమైన ఆర్థిక వ్యవస్థలనుకున్నవి బీటలువారుతుండటం, బడా సంస్థలు సైతం నేలమట్టం కావడం... ఇవన్నీ సంపన్న దేశాలు మొదలుకొని సాధారణ దేశాల వరకూ అన్నిటినీ కలవరపరుస్తున్నాయి. ఎక్కడ తేడా వచ్చిందో తెలియదు... ఏం చేస్తే నిలబడుతుందో తోచదు. ముఖ్యంగా పేదవర్గాలవారిని ఏ మార్గంలో ఆదుకుంటే వారి బతుకులు మెరుగుపడతాయో, వారంతటవారు నిలదొక్కుకోగలుగుతారో అర్థంకాదు. అనేక దేశాలు ఈ పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో పేదరిక నిర్మూలనపై వినూత్న కోణంలో పరిశోధనలు చేసిన ముగ్గురు ఆర్థిక శాస్త్రవేత్తలు అభిజిత్ వినాయక్ బెనర్జీ, ఆయన జీవన సహచరి ఎస్తర్ డఫ్లో, మరో శాస్త్రవేత్త మైకెల్ క్రెమెర్‌లకు సోమవారం నోబెల్ పురస్కారం లభించింది. అభిజిత్ బెంగాల్‌కు చెందినవారు. డఫ్లో ఫ్రాన్స్ దేశస్తురాలు, క్రెమెర్ అమెరికాకు చెందినవారు. భిన్నరంగాల్లో అద్వితీయమైన కృషిచేసేవారికి నోబెల్ కమిటీ అందజేసే పురస్కారాలకు అర్థం, పరమార్థం ఉంటాయి. ఆ పురస్కారాల ద్వారా వారి కృషిని ప్రపంచ దేశాలన్నీ గుర్తించేలా చేయడం, ఆ పరిశోధనల నుంచి లబ్ధి పొందేందుకు ఆ దేశాలను ప్రోత్సహించడం ఆ పురస్కారాల లక్ష్యం. శాస్త్ర విజ్ఞానం, వైద్యం తదితర రంగాల మాటెలా ఉన్నా... ఆర్థిక రంగంలో జరిగే పరిశోధనలపైనా, వాటి ఫలితాలపైనా ఏ దేశమూ పెద్దగా దృష్టి పెడుతున్న దాఖలా లేదు. అయితే అభిజిత్ బెనర్జీ త్రయం భిన్నమైనది. అభిజిత్ సాగిస్తున్న పరిశోధనలపై ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌తో పాటు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి కూడా ఆసక్తి కలిగింది. విద్యారంగంలో తాము తీసుకొచ్చిన మార్పులకు అభిజిత్ మార్గదర్శకమే కారణమని కేజ్రీవాల్ ప్రకటించగా, గత సార్వత్రిక ఎన్నికల్లో తాము ప్రకటించిన కనీస ఆదాయ పథకం ఆయన సలహాతో రూపొందించిందేనని రాహుల్ చెప్పారు. ముంబై, వడోదరా వంటిచోట్ల స్వచ్ఛంద సంస్థలు ఈ విధానాలను అనుసరించి మెరుగైన ఫలితాలు సాధించాయి.

పేదరిక నిర్మూలన కోసం రెండున్నర దశాబ్దాలుగా బెనర్జీ, డఫ్లో, క్రెమెర్‌లు పరిశోధనలు సాగిస్తున్నారు. శాస్త్రీయ పరిశోధనల్లో ఖచ్చితత్వాన్ని సాధించడానికి అనుసరించే ప్రక్రియలనే ఆర్థిక శాస్త్రానికి అనువర్తింపజేసి ఈ ముగ్గురూ క్షేత్ర స్థాయిలో సాగించిన పరిశోధనలు మంచి ఫలితాలనిచ్చాయి. ఒక ప్రాంతాన్నో, ఒక గ్రామాన్నో, లేక కొంతమంది పౌరుల్నో నమూనాలుగా తీసుకుని పరిశోధించడం కాక... తక్కువమందిని నమూనాగా తీసుకుని వారిని రెండు చిన్న చిన్న బృందాలుగా విడగొట్టి ఆ బృందాలకు వేర్వేరు విధానాలను అనుసరించి ఫలితాలెలా వస్తున్నాయో వీరు పరిశోధించారు. ఇది ఒకరకంగా ఔషధ ప్రయోగంలో అనుసరించే విధానం. ఒక బృందానికి పూర్తిగా ఔషధాన్ని అందించడం, మరో బృందానికి ఉత్తుత్తి ఔషధాన్ని అందించడం ఆ విధానంలోని కీలకాంశం. ఔషధాన్ని నిజంగా తీసుకున్నవారూ, తీసుకున్నామని అనుకున్నవారూ తమకెలా ఉన్నదని చెబుతారో తెలుసుకుని వాటి ప్రాతిపదికన ఒక అవగాహనకు రావడం, ఔషధ ప్రభావాన్ని అంచనా వేయడం ఆ విధానం లక్ష్యం. చిన్న చిన్న అంశాలను ప్రాతిపదికగా తీసుకుని క్షేత్ర స్థాయిలో వీరు సాగించిన అధ్యయనాలు అద్భుతమైన ఫలితాలను వెలువరించాయి. నిర్దిష్టమైన కాలంలో, నిర్దిష్టమైన ప్రాంతంలో జరిపే ప్రయోగాలు మెరుగైన ఫలితాలిచ్చినా... వాటిని సార్వత్రికంగా అమలు చేసినప్పుడు భిన్నమైన ఫలితాలు వెలువడుతుంటాయని ఆర్థిక రంగ అధ్యయనాలపై తరచు ఫిర్యాదులొస్తుంటాయి. అందువల్లే వీరు వినూత్న విధానాలు అనుసరించారు. టీచర్–పిల్లల నిష్పత్తి తక్కువుండేలా చూసి పిల్లలపై అధిక శ్రద్ధ ఉండేలా చూడటం, అలాగే ఆ టీచర్లను శాశ్వత ప్రాతిపదికన కొందరిని, స్వల్పకాలిక కాంట్రాక్టుపై మరికొందరిని తీసుకుని వారి బోధనా విధానం ఫలితాలెలా ఉన్నాయో చూడటం, చదువులో వెనకబడిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, అదనంగా సమయం కేటాయించడం, శారీరకంగా బలహీనంగా ఉంటున్న పిల్లలకు పోషకాహారాన్ని అందించి వారు చదువులో మెరుగుపడుతున్న విధానాన్ని గమనించడం వంటివి ఇందులో ఉన్నాయి. అతి సాధారణమైన అంశాలుగా కనబడే ఇటువంటివన్నీ అభివృద్ధి తీరునే మార్చివేశాయని నోబెల్ కమిటీ ప్రశంసించిందంటే ఈ ముగ్గురి ప్రతిభాపాటవాల్నీ అంచనా వేయొచ్చు. వీరి పరిశోధనలన్నీ ఎప్పటినుంచో అమలవుతున్నవేనని కొందరు నిపుణులు కొట్టిపారేశారు. కానీ అంతిమంగా ఇవి అత్యంత ప్రభావవంతమైనవని, తక్కువ ఖర్చుతో కూడుకున్నవనీ తేలింది.

అభిజిత్‌కు నోబెల్ రావడంలోని ఇతర కోణాలను కూడా చూడాలి. ఆయన చిన్నప్పుడు బాగా చదివే విద్యార్థే తప్ప, ప్రథమశ్రేణికి చెందినవాడు కాదు. చదువుతోపాటు ఆటపాటలు, సినిమాలు వగైరాలపై ఆసక్తి. ఢిల్లీ నెహ్రూ విశ్వవిద్యాలయం(జేఎన్‌యూ)లో చదువుతున్నప్పుడు విద్యార్థి ఉద్యమాల్లో పాల్గొని 12 రోజులు తీహార్ జైల్లో ఉన్నవాడు. విద్యార్థికి చదువు మినహా మిగిలినవన్నీ అస్పృశ్యమని, జీవితంలో ఎదుగుదలకు ఆటంకమని భావించేవారంతా అభిజిత్ నేపథ్యాన్ని గమనించక తప్పదు. నిజానికి తన చుట్టూ నివసించేవారి జీవితాలను చిన్నప్పటినుంచీ గమనిస్తుండటం వల్లే, వారితో సన్నిహితంగా మెలగడం వల్లే వారి బతుకులను మెరుగుపరచడానికి తోడ్పడే అసాధారణమైన విధానాలను అభిజిత్ కనుక్కోగలిగాడు. అమలవుతున్న విధానాలను అనుసరిస్తూ పోవడం కాక... వాటిని ప్రశ్నించడం ద్వారా, అధ్యయనం చేయడం ద్వారా మాత్రమే మరింత ఉన్నతమైన విధానాలు రూపుదిద్దుకుంటాయని నిరూపించాడు.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు ఆశ్వయుజ మాసం, తిథి బ.తదియ తె.4.58 వరకు (తెల్లవారితే గురువారం), నక్షత్రం భరణి ప.2.01 వరకు, తదుపరి కృత్తిక వర్జ్యం రా.2.33 నుంచి 4.13 వరకు, దుర్ముహూర్తం ప.11.23 నుంచి 12.10 వరకు, అమృతఘడియలు... ఉ.8.53 నుంచి 10.33 వరకు, అట్లతదియ.

సూర్యోదయం : 5.56
సూర్యాస్తమయం: 5.36
రాహుకాలం : ప. 12.00 నుంచి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుంచి 9.00 వరకు

# మహారాష్ట్రలో ఫడ్నవీయం

సందర్భం


స్వాతి చతుర్వేది

**మహారాష్ట్రలో అయిదేళ్ల పదవీకాలాన్ని అవిచ్ఛిన్నంగా పూర్తి చేసుకున్న రెండో ముఖ్యమంత్రిగా ఫడ్నవిస్ చరిత్ర సృష్టించారు. గత అయిదేళ్ల పాలనలో ఆయన సాధించిన గొప్ప విజయాలు రెండు. మరాఠా రాజకీయాల్లో తిరుగులేని శివసేన స్థాయిని కూటమిలో జూనియర్ భాగస్వామిగా కుదించివేయడం, సొంత పార్టీలో బలమైన ప్రత్యర్థులను మట్టికరిపించి పోటీ లేకుండా చూసుకోవడం. ఆరెస్సెస్ అగ్రనాయకత్వంతో సాన్నిహిత్యం, మోదీ, అమిత్‌షాల విశ్వాసాన్ని కీలక సమయంలో సాధించడం, వివాద రహితంగా రాజకీయాల్లో నిలబడటం.. ఒకప్పటి అర్భక నేతను మరాఠా వీరుడిగా మార్చివేశాయి. పార్టీలో బలమైన నేతలను పైకి ఎదగనివ్వని నరేంద్రమోదీ, అమిత్ షా హయాంలో ఫడ్నవీస్ ఇంత శక్తివంతుడిగా రూపొందడం అరుదైన విషయమే మరి.**

నాగ్‌పూర్‌లో ఆరెస్సెస్ ప్రధాన కార్యాలయంలో ఆ సంస్థ అధినేత మోహన్ భాగవత్ ప్రతి ఏటా విజయ దశమినాడు చేసే ప్రసంగానికి సంఘ్ పరివార్ రాజ కీయ లక్ష్య ప్రకటనగా భావిస్తుంటారు. ఈ సంవత్సరం భాగవత్‌తో కలిసి ఆ వేదికను పంచుకునే మహదవకాశం 49 సంవత్సరాల వయసున్న మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌కు దక్కింది. మహారాష్ట్రలో అయిదేళ్ల పదవీకాలాన్ని అవిచ్ఛిన్నంగా పూర్తి చేసుకున్న రెండో ముఖ్యమంత్రిగా ఫడ్నవిస్ చరిత్ర సృష్టించారు. శివసేన అధినేత ఉద్ధవ్ థాకరేతో సీట్ల పంపకంపై చేసిన సంయుక్త ప్రకటన నాగ్‌పూర్ నుంచి మూడుసార్లు శాసనసభ్యుడిగా ఎన్నికైన ఫడ్నవిస్ ప్రతిష్టకు, బీజేపీ ప్రాంతీయ నేతగా సాధించిన వైభవానికి పరీక్షగా నిలిచింది.

సరిగ్గా ఎనిమిది నెలలకు ముందు, థాకరే నివాసమైన మాతోశ్రీ గది వెలుపల ఫడ్నవిస్ వేచి ఉంటుండగా ఆయన బాస్ బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా 48 పార్లమెంటరీ స్థానాలకోసం శివసేనతో ఆ గదిలో చర్చలు జరిపారు. బీజేపీ, శివసేన కూటమి మహారాష్ట్రలో 8 స్థానాలు మినహా 40 లోక్‌సభ సీట్లను గెల్చుకుంది. అయితే ఈసారి పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. బీజేపీ నిర్దాక్షిణ్యంగా శివసేన స్థితిని ఒక జూనియర్ భాగస్వామి స్థాయికి కుదించివేసింది. అది శాసనసభ స్థానాల పంపిణీలో స్పష్టంగా ప్రతిఫలించింది. బీజేపీ ఈ దఫా అసెంబ్లీ ఎన్నికల్లో 150 స్థానాల్లో పోటీ చేయనుండగా సేన 124 స్థానాలతోనే సరిపుచ్చుకోవలసి వచ్చింది.

### స్వపక్షంలో పోటీదారుల ఆటకట్టు

ఒకవైపు ఉద్ధవ్ థాకరే పార్టీకి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి వెళ్లిపోవాలనుకుంటున్న 26 మంది కార్పొరేటర్లు, 300 మంది సేన కార్యకర్తలతో తలపడటంలో నిత్యం తలమునకలవుతూ ఉండగా మరోవైపున దేవేంద్ర ఫడ్నవిస్ మాత్రం బీజేపీలోని తన ప్రత్యర్థి, విద్యా మంత్రి వినోద్ త్వాడేకి ఈ అసెంబ్లీ ఎన్నికలకు గాను సీటు దక్కకుండా చేయడంలో బ్రహ్మాండంగా విజయం సాధించారు. బీజేపీకి అత్యంత సురక్షితమైనదిగా భావించే బోరివిల్లి శాసనసభ స్థానం వినోద్ త్వాడేకి ఇవ్వడానికి అధిష్టానం నిరాకరించింది. అలాగే మహారాష్ట్ర పార్టీ విభాగంపై తన పట్టును మరింత బలపర్చుకున్న ఫడ్నవిస్ తన చిరకాల ప్రత్యర్థి, బలమైన నేత అయిన ఏక్‌నాథ్ ఖడ్సేకి జల్‌గావ్ నుంచి టికెట్టు దక్కకుండా చేయడంలో కూడా విజయవంతమయ్యారు. ఖడ్సేని తనవద్దకు పిలిపించుకున్న అమిత్ షా ఆయనకు సీటు ఇవ్వడానికి నిరాకరించి ఆయన కుమార్తె రోహిణ్ ఖడ్సే కేవాల్కర్‌కి సీటు ప్రసాదించారు.

నాగ్‌పూర్ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్‌గా రాజకీయ జీవితంలో అడుగుపెట్టిన దేవేంద్ర ఫడ్నవిస్ ప్రాభవం అచిరకాలంలోనే మహారాష్ట్ర రాజకీయాల్లో అత్యున్నత స్థాయికి చేరుకుంది. 49 ఏళ్ల ఫడ్నవిస్ త్వరలో జరగనున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అన్నీ తానై ప్రభావం చూపుతున్నారు. దేశ పశ్చిమ ప్రాంతంలోని ప్రాధాన్య కులాల్లో దేనికీ చెందనప్పటికీ ఇంత తక్కువ కాలంలో దేవేంద్ర ఫడ్నవిస్ బలమైన మరాఠా నాయకుడిగా నిలబడటానికి కారణాలేవి?



ప్రధానంగా ఫడ్నవిస్ నాగ్‌పూర్ నుంచి వచ్చారు. ఇది బీజేపీ సైద్ధాంతిక ప్రబోధకురాలైన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ అగ్రనాయకత్వం కొలువుండే నగరం. ఆరెస్సెస్ అగ్రనాయకత్వంతో ఫడ్నవిస్ సన్నిహిత సంబంధాలే ఆయనను సునాయాసంగా ముఖ్యమంత్రి స్థానం వరకు సులభంగా తీసుకొచ్చాయి. పైగా ప్రధాని నరేంద్రమోదీ అపార మద్దతు కూడా ఫడ్నవిస్‌కు కొండంత అండగా నిలిచింది.

వయసులోనూ, రాజకీయాల్లోనూ, బీజేపీలోనూ చాలామంది ఇతర నాయకులు తనకంటే సీనియర్లుగా ఉన్నప్పటికీ, ఫడ్నవిస్ వారి స్థాయిని తన రాజకీయ ఎత్తుగడల ద్వారా బాగా కుదించివేయగలిగారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి పదవిపై కాంక్ష వ్యక్తం చేస్తూ తనకు ప్రమాదకరంగా మారగలిగే వారికి మంత్రివర్గంలో చోటు కల్పించకుండా అడ్డుకున్నారు లేదా బీజేపీలో వారు ప్రాధాన్యత కోల్పోయేలా చేశారు.

### వివాదాలకు తావీయని వ్యక్తిత్వం

ప్రధానమంత్రి జనరంజకత్వాన్ని తనకు అనుకూలంగా మల్చుకోవడంలో, మునిసిపల్, పంచాయతి ఎన్నికల్లో బీజేపీకి వరుస విజయాలను అందించడంలో ఫడ్నవిస్ ప్రదర్శించిన సామర్థ్యం తనకు ముఖ్యమంత్రి పదవిని కట్టబెట్టడమే కాకుండా పార్టీలో పోటీ అన్నదే ఎరుగని నేతగా తీర్చిదిద్దింది. కుంభకోణాలు, ఆర్థిక అవతవకలపై ఆరోపణలు వంటి వాటి కారణంగా బడా రాజకీయ నేతలు సైతం పదవులను పోగొట్టుకునే చరిత్ర కలిగిన రాష్ట్రంలో చెక్కుచెదరని ఫడ్నవిస్ ప్రతిష్ట తనకు ఎంతో ప్రయోజనం చేకూర్చింది.

శివసేన ఆకాంక్షలు, పేరాశలకు చెక్ పెట్టడంలో వారితో ఒప్పందం కుదుర్చుకోవడంలో ఫడ్నవిస్ సామర్థ్యం వల్లే ప్రతి ఎన్నికల సమయంలోనూ రెండు పార్టీలు కలిసి పోటీచేస్తూ వచ్చాయి. ఇది బీజేపీకి ప్రయోజనం కలిగించడమే కాకుండా తాను వ్యక్తిగతంగా ఎదగడానికి కూడా కారణమైంది. కొన్ని ఎత్తులూ, జిత్తులూ ప్రదర్శించినప్పటికీ కూటమిలో తాను జూనియర్ భాగస్వామే అని శివసేనను అంగీకరింపజేయడంలో ఫడ్నవిస్ ప్రదర్శించిన నైపుణ్యం ఆయన నాయకత్వానికి ఎదురు లేదన్న హామీని ఇచ్చింది.

ఫడ్నవీస్ 2014లో మహారాష్ట్ర ముఖ్యమంత్రి అయినప్పుడు, ఆయనకు ఎలాంటి పాలనానుభవం లేదు. పైగా మహారాష్ట్ర వెలుపల ఆయన గురించి తెలిసినవారే లేరు. ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్‌లాగా ఆయన నరేంద్రమోదీ, అమిత్ షాల అనూహ్య ఎంపిక నుంచి నేతగా ఆవిర్భవించారు. ఫడ్నవిస్‌కి సంఘ్ అనుకూలుడు అనే పేరు ఉండేది. పైగా మహారాష్ట్ర బ్రాహ్మణుడు కావడంతో సంఘ్ అధినేత మోహన్ భాగవత్ ప్రాపకం సులువుగానే సంపాదించారు. అయితే దేవేంద్ర ఫడ్నవిస్ ముఖ్యమంత్రిగా గద్దెనెక్కాక, ఆయన అంతర్గత ప్రత్యర్థులు ఆయన్ని చాలా తేలిగ్గా అంచనా వేశారు. అయిదేళ్ల తన హయాంని ఫడ్నవిస్ పూర్తి చేయలేడని బలంగా విశ్వసించారు. వారి అభిప్రాయం పూర్తిగా తప్పని ఫడ్నవిస్ నిరూపించారు.

బీజేపీ మరాఠా నేత మాటల్లో చెప్పాలంటే, ఫడ్నవిస్ కూడా నరేంద్రమోదీ గుజరాత్ నమూనాను ఉపయోగించి తన ప్రత్యర్థులను ధ్వంసం చేశాడు. ఢిల్లీ, నాగ్‌పూర్ కేంద్రాలు రెండూ తన పట్ల సంతోషంతో ఉండేలా ఫడ్నవిస్ జాగ్రత్తపడ్డారు. మరోవైపున చాలామంది మహారాష్ట్ర ముఖ్యమంత్రుల్లా కాకుండా ఫడ్నవిస్ వివాదాలకు చాలా దూరంగా ఉంటూవచ్చారు. అత్యున్నత స్థాయి బ్యాంకర్ అయిన తన సతీమణి అమృత వివాదంలో చిక్కుకున్నప్పుడు కూడా అమిత ప్రేమ కలిగిన భర్త పాత్రనే పోషించారు. దాంతో ఈ వివాదంలో అందరూ వారిని క్షమించేశారు. ఇంకా చెప్పాలంటే పాలనా నైపుణ్యాలు లేక పోవడం కూడా ఆయనకు అవరోధాలను పెద్దగా సృష్టించలేదు.

### మోదీ, షాలే కొండంత అండ

ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌లా కాకుండా ఫడ్నవిస్ తన పనిగురించి త్వరలో నేర్చుకున్నారు. ఎలాంటి వివాదాలు తనను చుట్టుముట్టకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. పైగా మహారాష్ట్ర నుంచి అధికంగా లోక్‌సభ స్థానాలను గెలిపించి ఇస్తానంటూ బీజేపీ అధ్యక్షుడు అమిత్ షాకు తానిచ్చిన మాటను నిలబెట్టుకోవడంతో ఆయన విశ్వసనీయత రెట్టింపైంది.

అప్పటినుంచి ఫడ్నవిస్‌ని అమిత్ షా అపారంగా ఇష్టపడుతూ వచ్చారు. ఆయన్ని పూర్తిగా బలపర్చడమే కాకుండా, ప్రత్యర్థులు ఆయనను దెబ్బతీయడాన్ని ఏమాత్రం అనుమతించకుండా రక్షణ ఛత్రంలాగా షా అడ్డుపడ్డారు. మహారాష్ట్ర రాజకీయాల్లో ఫడ్నవిస్ బలమైన ప్రత్యర్థి అని అందరూ భావించేలా మోదీ, అమిత్ షాలు ఆయనకు అండదండగా నిలుస్తున్నారు. ఒకరకంగా చెప్పాలంటే మహారాష్ట్ర రాజకీయాల్లో గడ్కరీకి ఎంత పట్టుందో ఫడ్నవిస్ కూడా అదే స్థాయికి చేరుకున్నట్లు స్పష్టమవుతోంది.

మరి అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఫడ్నవిస్ ముందు ఉన్నదేమిటి? మహారాష్ట్ర ముఖ్యమంత్రి నివాస భవనమైన వర్షాకు ఆయన తిరిగి రావడం ఖాయం. మహారాష్ట్ర రాజకీయాల్లో కనీవినీ ఎరుగనట్లుగా రెండో దఫా కూడా అధికారంలోకి రానుండటమే కాదు. ఆ రాష్ట్ర బీజేపీ చరిత్రలో అత్యున్నత నేతగా ఫడ్నవీస్ దుర్నిరీక్షుడుగా వెలుగొందనున్నారు. ప్రత్యర్థుల పట్ల రాజీలేని వైఖరిని ప్రదర్శించే నరేంద్రమోదీ, అమిత్ షాల హయాంలో ఒక ప్రాంతీయ బీజేపీ నేత ఇంత ప్రాభవాన్ని గడించడం అరుదైన విషయమే మరి.


వ్యాసకర్త సీనియర్ జర్నలిస్టు, రచయిత

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



## సోషల్ మీడియా

### ఆకలి



"ప్రపంచ ఆకలి సూచిక 2019 విడుదలైంది. భారత్ 102వ ర్యాంకుకు పడిపోయింది. నరేంద్ర మోదీ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించాకే ఈ పతనం ప్రారంభమైంది. 2014లో భారత్ 55వ ర్యాంక్‌లో ఉండగా, 2017 నాటికి అది 100వ ర్యాంకుకు పడిపోయింది. ప్రపంచంలోని అన్నార్తుల్లో ఎక్కువ భాగం ఇప్పుడు భారత్‌లోనే ఉన్నారు" – థామస్ ఐజాక్, కాంగ్రెస్ నేత

### క్షమించం



"కశ్మీర్‌లో పోస్ట్ పెయిడ్ మొబైల్ ఫోన్ సేవలను పునరుద్ధించిన అనంతరం, గత రాత్రి వరకూ పని చేసిన ఎస్ఎంఎస్ సేవలు పని చేడం లేదు. కశ్మీరీలను ఇలాంటి చిన్న విషయాల్లో నిమగ్నం చేసి అసలు సమస్యను మరిపించాలని చూడటం. కానీ, మీకు తెలుసా? మేము మర్చిపోం, మేము క్షమించం" – సమియా లతీఫ్, జర్నలిస్ట్

### కిరాతకం



"రాజస్తాన్ ట్రక్కు డ్రైవర్ మొహమ్మద్ షరీఫ్‌ను షిర్మాల్ షోపియన్‌లో హతమార్చడం క్షమించరాని కిరాతక చర్య. కశ్మీర్‌కు చెందిన లక్షలాదిమంది పండ్ల పెంపకందారులను, వాటిని రవాణా చేసేవారిని భయభ్రాంతులకు గురిచేయడానికే ఈ దారుణానికి పాల్పడ్డారు. ఇటువంటి చర్యలకు పాల్పడేవారు సిగ్గుపడాలి" – అహ్మద్ అలీ ఫయ్యాజ్, జర్నలిస్ట్

### నోబుల్



"తమ దేశస్తుడికి నోబుల్ బహుమతి వచ్చినందుకు చాలామంది భారతీయులు గర్వపడుతుండగా, కొంతమంది దొంగ జాతీయవాదులు మాత్రం విధ్వంసకర నోట్ల రద్దును పట్టుకు వేళాడుతున్నారు. వీరి దొంగ జాతీయత త్వరలోనే బయటపడుతుంది" – గౌరవ్ గొగోయ్, కాంగ్రెస్ నేత

### భక్తులు



"ఈడీ, ఐటీ అధికారుల్లో చాలామంది శివభక్తుల్లా ఉన్నారు. వాళ్లు మొదట చిదంబరాన్ని, తరువాత శివకుమార్‌నీ, ఇప్పుడు పరమేశ్వర్‌ను అరెస్ట్ చేశారు. తరువాత వంతు మల్లికార్జునదేమో" – మహేష్ విక్రమ్ హెగ్డే, జర్నలిస్ట్

### కొందరు



"తమ ఫోన్ నెట్ వర్క్ పునరుద్ధరించగానే బారాముల్లా నుంచి డాక్టర్ అజర్ కాల్ చేశారు. ఒకరి బాగోగులు ఒకరం విచారించుకున్నాం. గతంలో కంటే ఇప్పుడు పరిస్థితులు బావున్నాయని ఆయన చెప్పారు. కానీ, ఢిల్లీలోని కొంతమంది మాత్రం నేను అబద్ధం చెబుతున్నానని అనొచ్చు" – రిచా అనిరుధ్, యాంకర్

### బలహీనం



"ఫరూక్ అబ్దుల్లా సోదరి సురయ్యా, కుమార్తె సఫియాలను 370 అధికరణం రద్దుకు వ్యతిరేకంగా నిరసన తెలియజేస్తుంటే అరెస్ట్ చేశారు. ఒక పార్కులో నిరసనగా ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఇద్దరు మహిళల ముందు నిలబడలేక ప్రపంచంలోనే అత్యంత పెద్దదయిన ప్రజాస్వామ్య దేశం బలహీనతను చాటుకుంది" – షెహ్లా రషీద్, హక్కుల కార్యకర్త

ఇన్‌బాక్స్

## మరో సకల జనుల సమ్మె

నాడు మలిదశ తెలంగాణ ఉద్యమానికి శ్రీకాంతాచారి ఆత్మబలిదానం ఊపిరి పోసింది. ఇపుడు ఆర్టీసీ కార్మికులు శ్రీనివాస్ రెడ్డి, సురేందర్‌ల త్యాగం తెలంగాణ రాష్ట్రంలో మరో సకల జనుల సమ్మెకు పురుడు పోసింది. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో మరో ఉద్యమం చేయాల్సిరావటం బాధాకరం. నాడు ఉస్మానియా యూనివర్సిటీ జాక్ నాయకుడిగా తెలంగాణ స్వరాష్ట్రం కోసం మేము చేసిన పోరాటం కళ్ళముందు కదలాడుతుంది. కేసీఆర్ ప్రజా ఉద్యమాలను అణిచివేస్తున్న తీరు నియంత పోకడలను తలపిస్తున్నాయి. అప్పటి సీమాంధ్ర నాయకుల పాలనలో కూడా ఇన్ని నిర్బంధాలు లేవు. ఉద్యమ పునాదుల మీద ఏర్పడిన తెలంగాణ గడ్డమీద బూర్జువ పాలనకు తావు లేదు. ఆర్టీసీ కార్మికులు తెలంగాణ ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు, తెలంగాణ సకలజనుల సమ్మెలో ముందు వరుసలో ఉన్నారు. అప్పుడు కార్మికులను రెచ్చగొట్టిన హరీశ్ రావు, ఈటెల రాజేందర్ ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారో? ఉద్యమ కాలంలో కేసీఆర్, ఆర్టీసీ కార్మిక సోదరుల జీతాలు పెంచాలని అప్పటి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మన స్వరాష్ట్రం తెలంగాణలో కూడా అన్యాయమే జరిగితే, మరి వాళ్ళు ఎవల్తో చెప్పుకోవాలి?

ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలనే చిత్తశుద్ధి కేసీఆర్‌లో కనబడుతలేదు. ప్రభుత్వం నియమించిన ఐ.ఏ.ఎస్ అధికారుల త్రిసభ్య కమిటీ కూడా సమ్మె విరమిస్తే కానీ, చర్చలు లేవు అంటూ మొండి వైఖరి అవలంబించారు. నాడు తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యోగాలను లెక్కచేయకుండా పోరాడిన ఆర్టీసీ కార్మికులు 50 వేల మందిని ఉద్యోగాల నుంచి తొలగిస్తాననటం కెసీఆర్ అహంకారానికి నిదర్శనం. సెల్ఫ్ డిస్మిస్ అనే పదం భారత రాజ్యాంగంలోగాని, జాతీయ మరియు అంతర్జాతీయ కార్మిక చట్టాలలో కానీ ఎక్కడ లేదు. ఆర్టీసీ కార్మికులను వెంటనే చర్చలకు పిలిచి, సమస్యల శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలి. లేని పక్షంలో, కాళోజీ స్ఫూర్తితో తెలంగాణ మరో సకల జనుల సమ్మెకు సిద్ధంగా ఉంది.

కొనగాల మహేష్,
ఏఐసీసీ జాతీయ సభ్యులు

# పిల్లలపై సాగుతున్న దౌర్జన్యాలు

అభిప్రాయం


అచ్యుతరావు

పిల్లలు భావి భారత పౌరులు అని అంటాం, పిల్లలు దేవుళ్లని అంటాం, రేపటి నాయకులంటాం, డాక్టర్లూ, ఇంజనీర్లూ, సైంటిస్ట్‌లూ ఇలా రకరకాలుగా భావి భాగ్య విధాతలంటాం. కానీ అనడం ఒకటి, చెయ్యడం ఒకటి అన్నట్లు, రేపటి పౌరులపై ముప్పేట దాడులు, దౌర్జన్యాలు ఇదీ సమాజంలో ఎందుకు జరుగుతున్నాయి. ప్రవచనాలు చెప్పే ఒకాయన పిల్లలకు మనో భావాలే లేవని అంటాడు. పిల్లలను టీచర్ కొడితే ఆ విషయం ఇంట్లో చెబితే ఇంట్లో వారు మరో నాలుగు తగిలించాలని సిద్ధాంతీకరించారు. ఈ పండితుడు, ఈయన ప్రవచించిన నెలకే ఓ మూడున్నర సంవత్సరాల పసిపాపపై పంతులు లైంగిక దాడి చేశాడు. ఆ పాప ఇంట్లో స్కూల్‌కి వెళ్లనని ఈ ఘటన తర్వాత మారాం చేస్తే, ఈ ప్రవచనకారుడితో ప్రభావితమైన తల్లిదండ్రులు నాలుగు తగిలించి, వద్దు మొర్రో అని పాప మొత్తుకున్నా స్కూలుకి పంపిస్తే ఆపాప పంతులు మళ్లీ పాపపై అత్యాచారం చేశాడు. ఇది తెలిసి ఆ తల్లిదండ్రులు అవాక్కై ఏ నుయ్యో, గొయ్యో చూసుకుంటామంటున్నారు. ఇప్పుడు ఆ పండితుడు ఏం ప్రవచిస్తాడో చూడాలి.

ఇక హైదరాబాద్ నడిబొడ్డులోని రాజ్‌భవన్ పాఠశాల పంతుళ్లు మీరు పదిలో పాస్ కాలేరని ఓ ముప్పై మంది విద్యార్థినీ, విద్యార్థులను తరిమి, తరిమి పాఠశాల నుండి వెళ్లగొట్టారు. ఇంటర్మీడియట్ బోర్డు చేసిన పాపాలకు ఇరవై అయిదు మంది ఆత్మ హత్య చేసుకుంటే ఏ వ్యవస్థా వారికి న్యాయం చేయలేకపోయింది. మరో ఘటనలో కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో నడిచే కేంద్రీయ విద్యాలయం అని గర్వంగా చెప్పుకొని పిల్లలని చదువులకు పంపిస్తే పాయిఖానాలు పిల్లలతో కడిగించారు. సదరు ప్రిన్సిపాల్‌గారు, ఇదేమంటే



మోదీగారు కలలు గనే స్వచ్ఛభారత్ అన్నారు. హైదరాబాద్ నగరంలోని ప్రభుత్వ పాఠశాలలో రోజూ తరగతి గదిని పిల్లలచే శుభ్రం చేయిస్తూ, మగ పిల్లలు ఊడిస్తే అష్టదరిద్రమంటూ, ఆడ పిల్లలకే ఈ ఊడ్చే ఊడిగం అప్పజెప్పారు.

పిల్లలు పండుగలు అంటే దసరాగానీ, సంక్రాంతిగానీ, చివరకు వేసవి సెలవుల సమయంలో గానీ విద్యా శాఖ, ఇంటర్మీడియట్ బోర్డు ఇచ్చిన ఏ ఒక్క ఉత్తర్వునూ పట్టించుకోని పిల్లలకు సెలవులు ఇచ్చే పాపాన పోయిన ప్రైవేటు పాఠశాలలు లేవు, విద్యాశాఖ ఉత్తర్వులన్నీ టాయిలెట్ పేపర్‌కన్నా హీనంగా చూస్తాయి. కన్న తల్లులు కొందరు పిల్లలని రోడ్లపై పడేస్తే కుక్కలు పీక్కు తిన్న ఘటనలు ఎన్నో ఉన్నా, వారిని రక్షించడానికి ఓ విధానం లేదు. ఆంధ్ర రాష్ట్రంలో నూతన ప్రభుత్వం పిల్లలు చదువుకుంటే తల్లులకు డబ్బులిస్తుంటే, బంగారు తెలంగాణలో మాత్రం ఆడపిల్లలకు చదువులెందుకని కాబోలు కనీస వయసు నిర్ధారించుకోకుండా పెళ్ళిళ్లకు డబ్బులు మాత్రం ఇస్తున్నారు.

ఓ శాసనసభ్యుడు తల్లిదండ్రులకు దూరమై చివరకు తల్లిపాలకు నోచుకోని అనాథలు పెరిగే శిశువిహార్‌ని కూల్చి రోడ్డు పేరున మిగిలిన జాగాను కైంకర్యం చేద్దామనుకున్నాడు. అతనికి అండగా ఓ ఉన్నతాధికారి సై అంటూ ఆ ప్రతిపాదనను పరుగులు పెట్టించే బాధ్యత నెత్తినెత్తుకున్నాడు. ప్రైవేటు ఫార్మా కంపెనీలతో చేతులు కలిపి దాదాపు మూడు వందల పైచిలుకు పిల్లలపై నిలోఫర్ దవాఖానా కేంద్రంగా ఔషధ ప్రయోగాలు చేపట్టారని ఊరూ, వాడా కోడై కూస్తున్నవి. పిల్లలపై ఇన్ని రకాల దాడులూ, దౌర్జన్యాలూ జరుగుతుంటే వారి సంక్షేమం, క్షేమం గురించి ఆదేశాలు ఇవ్వాల్సిన ప్రభుత్వం పిల్లలు ఓటర్లు కానందున పట్టించుకోకపోవడం, పని చేయాల్సిన అధికారులు పిల్లల పనిలే... ఎవరడగబోతారని అనుకోవడం వెరసీ... పిల్లలు ఎవ్వరి ఆదరణా లేకుండా, ఎదిరించి అడగలేక, జీవచ్ఛవాలుగా బతుకుతున్నారన్నది అందరికీ తెలిసినా నోరిప్పి మాట్లాడే నాథుడే లేడు.

వ్యాసకర్త గౌరవ అధ్యక్షుడు, బాలల హక్కుల సంఘం । 93910 24242

# శీలసంపద

మానవుల సత్ప్రవర్తనే శీలం. ధనధాన్యాలు, ఐశ్వర్యంతో సమాన స్థానమిచ్చి శీలాన్ని సంపదగా గుర్తించాయి గ్రంథాలు. ప్రతివ్యక్తికి శీలసంపద ముఖ్యమని మతాలు బోధించాయి. ప్రహ్లాదుని ఇంద్రపదవికి అర్హుణ్ణి చేయడానికి అతని శీలసంపదే కారణమని పురాణాలు వర్ణించాయి.

'తేజస్సు, క్షమ, ధైర్యం, అంతశ్శుద్ధి, బాహ్యశుద్ధి, నిరహంకారమనే సద్గుణాలే మానవుల శీలసంపదను రెట్టింపు చేస్తాయన్న 'భగవద్గీత' బోధనలు శీల ప్రాధాన్యతను లోకానికి వెల్లడించాయి. శీలసంపదకు నిలువెత్తు సాక్ష్యం శ్రీరాముడని రామాయణం వివరించింది. శ్రీరాముడు ఒకే మాట, ఒకే బాణం, ఒకే పత్ని అనే ఆదర్శాలను నెలకొల్పి ఆచరించాడు. పితృవాక్య పాలకుడుగా, జనుల స్పందనకు విలువనిచ్చి పరిపాలించే ప్రభువుగా మెప్పులు పొందాడు.


జ్యోతిర్మయం

సుగుణశీలురు పాపభీతితో మెలుగుతూ, పాపకార్యం చేపట్టేవారిని నిరోధిస్తారని సీతాపహరణం చేసిన రావణుని ఎదిరించి ధర్మపక్షం వహించిన విభీషణుడి కథ తెలిపింది. 'మనసా, వాచా, కర్మణా, సకల సృష్టిలోని జీవులకు, ద్రోహం చేయకుండా దయతో ప్రవర్తిస్తూ తోచిన దానాలు చేయడాన్ని శీలం అంటారన్న' వ్యాసుడి వాక్యాలు మానవులకు దిశానిర్దేశాలు. 'ముక్కలుగా నరికినా గంధపు చెట్టు సుగంధాన్ని వీడనట్టే, కష్టాల్లోనూ శీలవంతులు సద్గుణాలను వీడరని' చాణక్యుడు అంటాడు. సత్యవ్రతానికి హరిశ్చంద్రుడు, దానగుణానికి కర్ణుడు, పరోపకారానికి రంతిదేవుడు, శరణాగత రక్షకునిగా శిబి చక్రవర్తి గడించిన కీర్తికి సచ్ఛీలతే కారణమని లోకానికి చాటాయి పురాణాలు.

సచ్ఛీలి కానివాడు కుటుంబంలో, సమాజంలో ఒంటరి అవుతాడని, బలగం ఎంతున్నా, సైన్యం ఎంతున్నా కాపాడలేరనడానికి అధర్మమార్గంలో నడిచి అశువులు బాసిన రావణుడు, కీచకుడు, సైంధవులను పురాణాలు చూపించాయి. 'లోకంలోని సిరి సంపదలన్నింటిలో శీలమే గొప్పదన్న' కబీరుదాసు మాటలు నిజం చేసిన వారు చరిత్ర పుటల్లో దర్శనమిస్తారు. పరాజితరాజు కోడలయిన ముస్లిం యువతిని బహూకరించగా తల్లిగా గౌరవించిన ఛత్రపతి శివాజీ సర్వకాలాలకు ఆదర్శనీయుడు.

– నారంశెట్టి ఉమామహేశ్వరరావు

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899




సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
బుధవారం ॥ 16-10-2019




చెట్టు నీడ

# ఇదేం గుర్రం!

ఢిల్లీ సుల్తానుల పాలనలోని రోజులవి. ఓమారు అరబ్ దేశం నుంచి ఓ పండితుడు వచ్చాడు. ఖగోళశాస్త్రం, భౌగోళికం, విజ్ఞానశాస్త్రం, గణితం... ఇలా అతనికి తెలియని శాస్త్రమంటూ లేదు. ఏ శాస్త్రమన్నా అతనికి కొట్టిన పిండి. పైగా అప్పటికప్పుడు ఏ శాస్త్రం మీద ప్రశ్నలడిగినా టకీటకీమని జవాబివ్వడంలో



దిట్ట. అతని ప్రజ్ఞకు మెచ్చిన ఢిల్లీ సుల్తాన్ ఆ పండితుడిని ఘనంగా సన్మానించాడు. అంతే కాక తన అశ్వశాలకు తీసుకువెళ్లి అక్కడున్న తన ప్రత్యేకమైన గుర్రాన్ని చూపించి దాని గురించి ఎంతో గొప్పగా చెప్పాడు. వెంటనే అరబ్ పండితుడు ''ఇదేం గుర్రం? ఎందుకూ పనికిరాని గుర్రం. అటువంటి చెత్త గుర్రాన్ని మేపుతున్నారా?' అని హేళనగా నవ్వాడు. అతని మాటలు విని సుల్తాన్ కంగుతిన్నాడు. తానెంతో ఇష్టంగా కొన్న గుర్రం గురించి ఇంత చులకనగా మాట్లాడుతున్నాడేమిటా అని బాధపడుతూనే, ''ఆ విషయం మీరెలా చెప్తున్నారు?'' అని అడిగాడు ఆసక్తిగా.

''నాకు అశ్వశాస్త్రం మీదున్న పట్టు ఎంతని చెప్పనూ... ఏ గుర్రం ఏమాత్రం వేగంతో దౌడు తీస్తుంది, స్వారీ చేసేటప్పుడు ఎలా గుర్రాన్ని నియంత్రించాలి, ఏ గుర్రం యుద్ధానికి పనికొస్తుంది.. ఇలా ఏదైనా చెప్పగలను'' అంటూనే ''ఈ గుర్రంమీద ఎలా స్వారీ చెయ్యాలో చెప్తాను. ఒకమారు గుర్రాన్ని ఎక్కనివ్వు'' అన్నాడు పండితుడు. సుల్తాన్ సరేనంటూ పండితుడికి గుర్రాన్ని ఇచ్చాడు. పండితుడు గుర్రమెక్కి ఓ అయిదు నిమిషాలు స్వారీ చేసిన తర్వాత దాని

**పుస్తక జ్ఞానమూ జ్ఞానమే.
అయితే లోకజ్ఞానమూ తోడైనప్పుడే
అది పరిపూర్ణమైన జ్ఞానం అవుతుంది.**

నియంత్రణ తెలీక కిందపడి గాయపడతాడు. పరిస్థితి గ్రహించిన సుల్తాన్, గబగబా దగ్గరకెళ్లి ''అయ్యో అలా ఎలా పడ్డారు?'' అంటూనే ఆ అరబ్ పండితునికి తగిన చికిత్స చేయించి సాగనంపాడు. వెళ్లేముందు ఆ అరబ్ పండితుడు తలవంచుకుని.. ''నాదంతా పుస్తక పరిజ్ఞానమే కానీ అసలైన అనుభవం లేదు.. మీ గుర్రం గురించి తక్కువగా మాట్లాడి, మిమ్మల్ని నొప్పించినందుకు మన్నించండి'' అని చెప్పి వెళ్లిపోయాడు.

– జగద్రేణు

హెయిర్‌కేర్

# ఒకటి రెండైతే బెంగే


జుత్తు చిట్లుతుంటే నెలకోసారి కత్తిరించాలి

హెయిర్ స్లిట్స్! ఓ యాభై ఏళ్లు నిండిన వాళ్లకు ఇదసలు విషయమే కాదు. అయితే టీనేజ్ పిల్లలకు, ఇరవైలలో ఉన్న యువతకు మాత్రం వెంట్రుక రెండుగా చీలిపోయిందంటే... గుండె పగిలిపోయినంతగా బాధ పడిపోతారు. జుట్టు చిట్లక ముందు ఎన్ని జాగ్రత్తలు చెప్పినా పట్టించుకోరు! జుత్తు చిట్లడానికి కారణాలు తెలుసుకుంటే నివారణ మన చేతిలోనే ఉంటుంది.



జుత్తుకు తగినంత తేమ లేక పోవడం, ఎండకు ఎక్కువగా తిరగడం, గాఢత కలిగిన షాంపూల వాడకం, హెయిర్ డ్రయర్‌తో జుత్తును ఎక్కువ సేపు ఆరబెట్టడం, తరచుగా హెయిర్ స్ట్రెయిటెనింగ్ చేయించుకోవడం, జుత్తుకు రంగు వేయడం, హెయిర్ బ్లీచ్ చేయించడం... వంటివన్నీ జుత్తు చిట్లడానికి దారి తీస్తాయి.



### చిట్లకుండా ఏం చేయాలి?

- వారానికి మూడుసార్లకు మించి తలస్నానం చేయకూడదు, సలసల మసిలే వేడి నీరు కూడా తలస్నానానికి మంచిది కాదు.
- నీళ్లు కారే జుట్టును టవల్‌తో తుడిచిన తర్వాత మాత్రమే డ్రయర్ వాడాలి. డ్రయర్ వాడకం కంటే జుట్టుని సహజంగా ఆరనివ్వడమే మంచిది.



### చిట్లితే ఏం చేయాలి?

- జుట్టు చివర్లను నెలకోసారి కత్తిరించాలి. రెండుగా చిట్లిన వెంట్రుక వేగంగా పైకి చీలిపోతుంటుంది. చిట్లిన చివర్లను కత్తిరిస్తే చిట్లటం అంతటితో ఆగిపోతుంది.
- కొబ్బరినూనె, ఆలివ్ ఆయిల్, బాదం నూనెలను సమపాళ్లలో తీసుకుని గోరువెచ్చగా చేసి జుట్టుకు పట్టించి మసాజ్ చేయాలి. రాత్రంతా అలాగే ఉంచి ఉదయం తలస్నానం చేయాలి. రాత్రంతా ఉంచుకోవడం సాధ్యం కాకపోతే గంట తర్వాత తలస్నానం చేయవచ్చు.
- కోడిగుడ్డు సొనలో (తెల్లసొన, పచ్చసొన రెండూ) మూడు టేబుల్ స్పూన్ల ఆలివ్ ఆయిల్ కలిపి తలకు పట్టించి అర గంట తర్వాత తలస్నానం చేయాలి.
- ఒక కప్పు బొప్పాయి పండు గుజ్జులో అరకప్పు పెరుగు కలిపి మాడుకు, జుట్టుకు పట్టించి అరగంట తర్వాత తలస్నానం చేయాలి.




ప్రాంజల్ పాటిల్

**తనకు తీపిని పంచిన వాళ్లెవ్వరినీ నేరుగా చూడలేదు ప్రాంజల్. మనోనేత్రంతో మాత్రమే ఆ అభిమానాన్ని ఆస్వాదించింది. అదే నేత్రంతో ప్రజల సమస్యలను ఆకళింపు చేసుకుని చక్కటి పాలనను అందించగలుగుతుందనే నమ్మకాన్ని కూడా కలిగిస్తోంది. చూపు లేకపోవడం లక్ష్యాన్ని సాధించడానికి అడ్డంకి కాదని నిరూపించిన ముప్పై ఏళ్ల ప్రాంజల్ పాటిల్.. తొలి 'విజువల్లీ చాలెంజ్‌డ్' ఉమన్ ఐఏఎస్ ఆఫీసర్‌గా కొత్త రికార్డును సృష్టించింది!**

# తనను తాను గెలిపించుకుంది

ప్రాంజల్ పాటిల్.. 2016లో యూపీఎస్‌సీ రాసింది. 773వ ర్యాంకు తెచ్చుకుంది. ర్యాంకు ఆధారంగా ఆమెకు ఇండియన్ రైల్వేస్‌లో అకౌంట్స్ సర్వీస్‌లో ఉద్యోగం రావాలి. ఆ ఉద్యోగంలో చేరడానికి ఏ అడ్డంకీ వచ్చి ఉండకపోయి ఉంటే ఎలా ఉండేదో తెలియదు. ఆమె కూడా జీవితంతో రాజీ పడిపోయి ఉండేదేమో! కానీ ఆ ఉద్యోగానికి కాంపిటీటివ్ ఎగ్జామ్‌లో ర్యాంకు ఒక్కటే సరిపోలేదు. చూపు కూడా కావలసి వచ్చింది. అప్పుడు ప్రాంజల్... ''నా అసలు టార్గెట్ ఇది కాదు, కాబట్టి మీరు ఈ ఉద్యోగం ఇవ్వనక్కర్లేదు'' అని మళ్లీ ఎగ్జామ్‌కి ప్రిపేరైంది. తర్వాతి ఏడాది 124వ ర్యాంకు తెచ్చుకుంది. అప్పుడు జాతీయ స్థాయిలో మీడియా సంస్థలన్నీ ఆమెను సంభ్రమంగా చూశాయి. ఐఏఎస్ ఆఫీసర్ కాబోతున్న యువతిగా దేశానికి పరిచయం చేశాయి. ప్రతి పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలోనూ అమ్మాయిలు విజయకేతనం ఎగురవేస్తూనే ఉన్నారు. వాళ్లను జాతి సగర్వంగా గుర్తు చేసుకుంటూనే ఉంది. అమ్మాయిని ఇంకా ప్రత్యేకంగా, మరికొంత ప్రేమగా గుర్తు చేసుకున్నది.

మొదట ప్రాంజల్‌కి కేరళ కేడర్ ఐఏఎస్ ఆఫీసర్‌గా ఎర్నాకుళంలో అసిస్టెంట్ కలెక్టర్‌గా పోస్టింగ్ వచ్చింది. ముస్సోరిలో శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత ఇప్పుడు తాజాగా త్రివేంద్రంలో సబ్‌కలెక్టర్‌గా సోమవారం నాడు రాట్నం వడుకుతున్న గాంధీజీ చిత్రపటం సాక్షిగా పూర్తి స్థాయిలో విధుల్లో చేరారామె. తిరువనంతపురం కలెక్టరేట్‌లోని ఉద్యోగులు ప్రాంజల్‌ను భావోద్వేగాలతో స్వాగతించారు, అభినందనల్లో ముంచెత్తారు. తమ ఇంటి పాపాయికి పుట్టిన రోజు పండుగ చేసి కేక్ తినిపించినంత ప్రేమగా స్వీట్లు తినిపించారు.

**ఓటమి దరి చేరదు**

''ఎటువంటి ప్రతికూలమైన పరిస్థితులు ఎదురైనా మన లక్ష్యాన్ని వదులుకోకూడదు. అప్పుడు జీవితంలో ఓడిపోవడం అనేది ఉండదు. మన లక్ష్యం మీద మనం పెట్టిన శ్రద్ధ, శ్రమతోనే మనం అనుకున్నది సాధించి తీరుతాం. ఓడిపోయాం... ఓడిపోతామేమో... అనే భావనలే మనల్ని ఓటమిలోకి నెట్టేస్తాయి. అలాంటి భావనలను మనసులోకి రానివ్వకూడదు'' అని బాధ్యతలు చేపట్టిన సందర్భంగా, మీడియా అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా చిరునవ్వుతో చెప్పారు ప్రాంజల్. గత ఏడాది సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన క్షణాలను, తనను ఆత్మీయంగా అక్కున చేర్చుకున్న సహోద్యోగులను మర్చిపోలేనని చెబుతూ... ఈ కొత్త ఉద్యోగంలో ప్రజల సంక్షేమం కోసమే పని చేస్తానని అన్నారు. జీవితంలో ప్రతి సందర్భాన్ని సానుకూలంగా స్వీకరించే ప్రాంజల్ రెండు సందర్భాలను ఎప్పటికీ మర్చిపోలేనని ఎప్పుడూ చెబుతుంటారు. ఒకటి చిన్నప్పుడు ఆపరేషన్‌లతో కలిగిన బాధ, రెండవది రైల్వే ఉద్యోగానికి అంధత్వం కారణంగా తనను దూరం పెట్టడం. ''ఒకటి శారీరకంగా బాధకలిగించిన సంఘటన అయితే మరొకటి మనసును మెలిపెట్టిన సంఘటన'' అని చెప్తుంటారామె.

మధ్యప్రదేశ్‌కు చెందిన కృష్ణ గోపాల్ తివారీ తొలి విజువల్లీ చాలెంజ్‌డ్ ఐఏఎస్ ఆఫీసర్. సర్వేంద్రియాల్లో కళ్లు అత్యంత ప్రధానమైనవే. అయినప్పటికీ కంటిచూపు లేకపోవడం మాత్రం దేనికీ అవరోధం కాదని నిరూపించారాయన. ఆయన బాట ఎందరికో స్ఫూర్తినిచ్చింది. ఇప్పుడు అదే బాటను మరింతగా విస్తరించిన మరో స్ఫూర్తిప్రదాయిని ప్రాంజల్.

– మంజీర


## దృఢమైన వ్యక్తిత్వం



ప్రాంజల్ పాటిల్‌ది మహారాష్ట్రలోని ఉల్లాస్ నగర్. ఆరేళ్ల వయసులో కంటిచూపును కోల్పోయింది. కూతురికి తిరిగి చూపు తెప్పించడానికి ఆపరేషన్‌ల మీద ఆపరేషన్‌లు చేయించారు ఆమె తల్లిదండ్రులు. ఒక్కటీ విజయవంతం కాలేదు. అన్ని ఫెయిల్యూర్స్ నుంచి తనకు తానుగా ఎదిగింది ప్రాంజల్. కమలామెహతా దాదర్ బ్లైండ్ స్కూల్‌లో చదువుకుంది. తర్వాత ముంబయిలోని సెయింట్ జేవియర్స్ కాలేజ్‌లో పొలిటికల్ సైన్స్‌లో గ్రాడ్యుయేషన్ చేసింది. ఇంటర్నేషనల్ రిలేషన్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసింది. ''ప్రాంజల్ చాలా నిబద్ధత కలిగిన విద్యార్థి. కాలేజ్‌లో జరిగే స్పెషల్ లెక్చర్స్‌కు కూడా అందరికంటే ముందే వచ్చేది. డిబేట్‌లలో అనర్గళంగా మాట్లాడేది. ఒక విషయం మీద తన అభిప్రాయాన్ని సున్నితంగా, చాలా స్పష్టంగా, ఎదుటి వాళ్లు కన్విన్స్ అయ్యేలా చెప్పడం ప్రాంజల్ ప్రత్యేకత. సమస్య వచ్చినప్పుడు జారిపోకుండా నిలబడగలిగిన దృఢమైన వ్యక్తిత్వం ఉన్న అమ్మాయి'' అని ప్రాంజల్ గురించి ఆమె స్నేహితురాలు సరస్వతి చెప్పింది. ప్రాంజల్, సరస్వతి ఇద్దరూ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో కలిసి చదువుకున్నారు.

గ్లామర్

# జాన్వీ డౌట్


'కబీర్ సింగ్' చిత్రంలో షాహిద్ కపూర్

చదువు, ఆటల్లో తప్ప ఒక మనిషికి ఉండే సున్నితత్వం, మర్యాద, మన్నన వగైరా ఏదీ లేని వ్యక్తిని హీరోగా, హృదయ బద్ధలైన ప్రేమికుడిగా చూపించి హిట్టయి.. అంతే సంచలనం రేపిన తెలుగు, హిందీ సినిమాలు.. అర్జున్‌రెడ్డి, కబీర్ సింగ్! 'తోచినట్టు' ఉండడం.. 'నచ్చింది' చేయడం.. హీరోయిజంగా తెరమీద చూపిస్తే ఎంత ప్రమాదమో.. ఎంత అనర్థమో చెప్పడానికి ఇటీవల 'టిక్‌టాక్' స్టార్ అశ్వని కుమార్ అలియాస్ 'జానీ దాదా' చేసిన హత్యే ఉదాహరణ. తాను ప్రేమించిన అమ్మాయి వేరొకరిని పెళ్లి చేసుకోబోతోందనే విషయం తెలిసి ఆగ్రహావేశాలతో ఆ అమ్మాయిని చంపి.. తర్వాత తానూ ఆత్మహత్య చేసుకున్నాడు జానీ. సదరు టిక్‌టాక్ 'జానీ దాదా' కబీర్ సింగ్ సినిమా చూసి తీవ్ర ప్రభావం చెందినట్టు పోలీసులు చెప్పడాన్ని బట్టి తెలుస్తోంది. పాపం.. ఈ లేటెస్ట్ న్యూస్ తెలీకో ఏమో మరి జాన్వీ కపూర్ ''మగవాళ్లు ఎలా ఉన్నా హీరోలా చూపిస్తారు.. మరి ఆడవాళ్ల నెత్తినెందుకు మర్యాద, సంప్రదాయం, ఆచారం అంటూ తట్టెడు బరువును నెడతారు? లేడీస్‌ను కూడా లేడీ అర్జున్‌రెడ్డి, లేడీ కబీర్ సింగ్‌లా ఎందుకు చిత్రీకరించరు?'' అంటూ ప్రశ్నించింది.. 'జియో మామి ముంబై ఫిల్మ్ ఫెస్టివల్ ' వేదిక మీద. ''బాందిని సినిమాలో నూతన్ పోషించిన పాత్రే అన్నిటి కన్నా బెస్ట్ ఫిమేల్ రోల్' అని కూడా అంది ఈ యువనటి.

**"లేడీస్‌ను కూడా లేడీ అర్జున్‌రెడ్డి, లేడీ కబీర్ సింగ్‌లా ఎందుకు చిత్రీకరించరు?"**


జాన్వీ కపూర్

స్ట్రెచ్ మార్క్స్


# తల్లికి బిడ్డ కానుక

పాల మీగడ లాంటి తెల్లటి మృదువైన మేని ఛాయ, జీరో సైజ్, స్ట్రెచ్ మార్క్స్ లేని స్ట్రక్చర్.. ఇవన్నీ మార్కెట్ కల్పించే భ్రమలు! ఈ ఆదర్శ నమూనా పట్టికలో ఇమడడానికి ఎంత మంది అమ్మాయిలు మానసిక, శారీరక హింసకు గురయ్యారో.. గురవుతున్నారో!! ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయడమే మార్కెట్ స్ట్రాటజీ. దానికి అందాన్ని మించిన ఆయుధం లేదు. సెలబ్రిటీలను మోడల్స్‌గా చూపించి ప్రొడక్ట్స్ అమ్ముతుంటుంది. ఇలాంటి మార్కెట్ ఐడియల్ బ్యూటిప్స్‌కి 'నో' అంటోంది కైలీ జెన్నర్. అమెరికన్ రియాలిటీ టెలివిజన్ స్టార్ ఆమె. ఈ మధ్య ఓ బిడ్డకు తల్లి అయింది. ఇటీవల జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో ''ప్రెగ్నెన్సీ వల్ల స్ట్రెచ్ మార్క్స్ ఏర్పడ్డాయా?'' అంటూ ఓ అభిమాని కైలీని ఆరా తీసింది. ''యెస్.. ఛాతీ మీద, నడుము భాగంలో, తొడల మీదా స్ట్రెచ్ మార్క్స్ వచ్చాయి. కాని వాటిని పోగొట్టుకోవడానికి నేనేలాంటి ప్రయత్నమూ చేయలేదు. నా బిడ్డ స్టార్మి నాకు ఇచ్చిన గిఫ్ట్ ఆ చారలు. వాటిని చూసుకుంటూంటే గర్వంగా అనిపిస్తుంది'' అని చెప్పింది కైలీ.

**అందం శరీరం మీద ప్రస్ఫుటమయ్యేది కాదు.. ఆత్మవిశ్వాసంతో ద్విగుణీకృతమయ్యేదని చాటిచెప్పింది కైలీ.**



సాక్షి ఫ్యామిలీ సినిమా
నల్లగొండ ॥ బుధవారం
16-10-2019



● రజనీకాంత్

## బర్త్‌డేకి ఫిక్స్

సినిమా పూర్తి చేయడం, హిమాలయాలకు వెళ్లి, కొన్ని రోజులు ఉండి రావడం రజనీకాంత్ అలవాటు. మురుగదాస్ దర్శకత్వంలో 'దర్బార్' సినిమా షూటింగ్ పూర్తి చేయడంతో పాటు తన పాత్రకు డబ్బింగ్ కూడా చెప్పి, హిమాలయాలు వెళ్లారాయన. అక్కడ్నుంచి రాగానే తన 168 సినిమాపై దృష్టి పెడతారు. శివ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ నిర్మించనుంది. కాగా రజనీకాంత్ పుట్టినరోజు (డిసెంబర్ 12)న ఈ సినిమాను ప్రారంభించాలనుకుంటున్నారని కోలీవుడ్ టాక్. మామూలుగా ఒక సినిమాకి సంబంధించిన నటీనటులందరినీ అధికారికంగా ప్రకటించేవరకూ కీలక తారాగణం అయిన హీరోయిన్, విలన్ పాత్రధారుల గురించి రకరకాల వార్తలు వస్తుంటాయి. అలా ఈ చిత్రంలో రజనీ సరసన జ్యోతిక కథానాయికగా నటించనున్నారనే వార్త ప్రస్తుతం షికారు చేస్తోంది. రజనీ సరసన జ్యోతిక ఇప్పటివరకూ నటించలేదు. అయితే రజనీ కీలక పాత్రలో రూపొందిన 'చంద్రముఖి' సినిమాలో ప్రభు భార్యగా జ్యోతిక నటించిన విషయం గుర్తుండే ఉంటుంది. మరి.. రజనీ 168లో సూపర్ స్టార్ సరసన నటించబోయే హీరోయిన్ జ్యోతికా? కాదా? అనేది తెలియాలంటే కొన్ని రోజులు ఆగాల్సిందే.




● ఛోటా కె. నాయుడు

# అమ్మో.. ఛోటానా? అంటారు

''నాకు నేను అప్‌గ్రేడ్ అవడానికి ఇప్పటి సినిమాలు చూస్తా. ముఖ్యంగా ఆస్కార్ అవార్డ్ నామినేషన్స్‌లో బెస్ట్ సినిమాటోగ్రఫీ విభాగంలో ఎంపికైన 5 సినిమాలు చూస్తా.. ఎలా తీశారనే టెక్నిక్స్ తెలుసుకుంటా. మన భారతీయ సినిమా, హాలీవుడ్ సినిమాలన్నీ ఇప్పుడు బాగా దగ్గరైపోయాయి. ప్రస్తుతం కొత్త డైరెక్టర్లకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నా. ఎందుకంటే కొత్తవారు కొత్త ఆలోచనలతో వస్తారు. మనకు తెలియని విషయాలు కూడా వారికి తెలుస్తాయి'' అని ప్రముఖ కెమెరామన్ ఛోటా కె.నాయుడు అన్నారు. అశ్విన్ బాబు, అవికా గోర్ జంటగా ఓంకార్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'రాజుగారి గది 3'. ఈ శుక్రవారం సినిమా విడుదల కానుంది. ఈ చిత్రానికి కెమెరామన్‌గా చేసిన ఛోటా కె.నాయుడు చెప్పిన విశేషాలు.

- అల్లాణి శ్రీధర్‌గారి దర్శకత్వంలో నా తొలి సినిమా 'రగులుతున్న భారతం' స్టార్ట్ అయింది. అదే సమయంలో మా గురువు దాసరి నారాయణరావుగారి దర్శకత్వంలో 'అమ్మ రాజీనామా' చేశా. 'రగులుతున్న భారతం' కంటే ముందుగా 'అమ్మ రాజీనామా' విడుదలయింది. ఇప్పటి వరకూ ఎన్ని సినిమాలు చేశాననే సంఖ్య కరెక్టుగా తెలియదు. మా వాళ్లేమో 94 అంటున్నారు. అందుకే 100కు దగ్గరలో ఉన్నానని చెబుతుంటా.
- కొందరు హీరోలు, నిర్మాతలు 'అమ్మో.. ఛోటానా?' అంటూ నా వద్దకు రాకుండా వెళ్లిపోయిన సందర్భాలు ఉన్నాయి. ఎందుకంటే నేను చాలా ప్రొఫెషనల్‌గా ఉంటా. ఏ విషయంలోనూ రాజీ పడను. 'ఠాగూర్' సినిమాకి చిరంజీవిగారు ఛోటాని తీసుకుందామని చెప్పగానే వీవీ వినాయక్ ఎగిరి గంతెయ్యలేదు. మన మాట వింటాడో? లేదో? అని లోపల మదనపడ్డాడు. రెండు రోజులు షూటింగ్ తర్వాత.. 'మీరేంటో, మీ పనేంటో నాకు అర్థం అయింది' అని వినాయక్ సంతోషంగా చెప్పాడు.
- 'స్టాలిన్' సినిమా తర్వాత ఓంకార్ యాంకర్‌గా ఉన్న ఓ కార్యక్రమానికి నన్ను అతిథిగా పిలిచాడు. అప్పటి నుంచి మా మధ్య మంచి సాన్నిహిత్యం ఉంది. 'జీనియస్' సినిమాని డైరెక్ట్ చేయబోతున్నానంటూ ఓంకార్ కథ చెప్పగానే ఆశ్చర్యపోయా. ఆ సినిమాకి డేట్స్ కుదరకపోవడం వల్ల నేను చేయలేకపోయా. ఆ తర్వాత 'రాజుగారి గది' చిత్రానికి కూడా పని చేద్దామనుకున్నాం. కానీ, కుదరలేదు. 'రాజుగారి గది 3'కి కుదిరింది.
- పక్కా కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన చిత్రం 'రాజుగారి గది 3'. హారర్ అంశాలు తక్కువగా ఉంటాయి. నాకు చెప్పిన కథని ఓంకార్ అదే విధంగా తెరపైకి తీసుకొచ్చాడు. ఈ సినిమాలో హీరో అశ్విన్ బాబు అనగానే పూర్తి స్థాయి పాత్రకి సరిగ్గా న్యాయం చేయగలడా?' అనిపించింది. ఎందుకంటే హీరోగా చేయడం అంటే చాలా కష్టం. కానీ తన నటన చూశాక చాలా సర్‌ప్రైజ్ అయ్యా. డైలాగ్స్, డ్యాన్స్, ఫైట్స్... ఇలా ప్రతిదీ సింగిల్ టేక్‌లోనే చేశాడు. తనకు మంచి భవిష్యత్ ఉంటుంది. హీరోయిన్‌గా తమన్నా స్థానంలో అవికా గోర్‌ని తీసుకున్నామని ఓంకార్ చెప్పగానే సరిగ్గా చేయగలదా? అనిపించింది. పతాక సన్నివేశాల్లో తన నటన చూసి అభిమాని అయిపోయా. అద్భుతంగా నటించింది.
- దర్శకత్వం చాలా కష్టమైన పని. ఇప్పుడు నాకున్న టెంపర్‌కి దర్శకత్వం చేయాలనే ఆలోచన లేదు. పైగా ప్రస్తుతం సినిమాలకి కథ చాలా ముఖ్యం. అది లేకుంటే ఏమీ చేయలేం. మంచి కథ కుదిరితే కొన్నేళ్ల తర్వాత అయినా దర్శకత్వం చేస్తా. నాకు యాక్షన్ సినిమాలంటే ఇష్టం. ఆ తర్వాత ప్రేమకథలంటే ఆసక్తి.
- 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్' సినిమా తర్వాత రాత్రిళ్లు షూటింగ్ చేయడం మానేశా. కానీ, 'రాజుగారి గది 3'కి మాత్రం చాలా రోజులు రాత్రిళ్లు పని చేయాల్సి వచ్చింది. పొద్దున్నే 6:30 గంటలకు సెట్స్‌కి వెళ్లడమే నా పని. రాత్రి అయినా ఎప్పుడు ప్యాకప్ చెబుతాడన్నది ఓంకార్ ఇష్టం.
- 24 శాఖల్లో నాకు కొరియోగ్రఫీ అంటే ఇష్టం. భారతీయ కెమెరామన్లలో సంతోష్ శివన్, పీసీ శ్రీరామ్, ఛోటా కె.నాయుడు (నవ్వుతూ) అంటే ఇష్టం. హాలీవుడ్ కెమెరామన్ రాబర్ట్ రిచర్డ్‌సన్ అంటే ఎంతో ఇష్టం. ఆయనతో రెండున్నర గంటలు కలిసి మాట్లాడిన రోజుని మరచిపోలేను. ఎవరైనా దర్శకులు, కెమెరామన్లు అద్భుతం చేస్తే అహంభావం లేకుండా వాళ్లకు నేను సరెండర్ అయిపోతా.. అభినందిస్తా.
- ఏ సినిమాకైనా 100శాతం డైరెక్టర్లతో ప్రయాణం చేస్తా. వాళ్లు అనుకున్న దాని కంటే కనీసం ఒక్క శాతమైనా ఎక్కువ చేయాలనుకుంటా. అదే నా విజయ రహస్యం. నా తమ్ముడు శ్యామ్ కె.నాయుడు నా కంటే మంచి కెమెరామన్.. చాలా మంచి సినిమాలు చేశాడు. ప్రస్తుతానికి నేను కొత్త సినిమా ఏదీ అంగీకరించలేదు. చివరి శ్వాస ఉన్నంత వరకూ కెమెరామన్‌గానే పని చేయాలన్నది నా కోరిక.




● నయనతార



● అజిత్

## మళ్లీ జంటగా..

బిల్లా, ఏగన్, విశ్వాసం.. ఈ మూడు చిత్రాల్లోనూ జంటగా నటించారు అజిత్, నయనతార. 'బెస్ట్ పెయిర్' అని కూడా అనిపించుకున్నారు. ఇప్పుడు నాలుగోసారి ఈ జంట తెరపై కనిపించే అవకాశం ఉందని సమాచారం. అజిత్ 60వ సినిమా త్వరలో ఆరంభం కానుంది. వినోద్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని బోనీ కపూర్ నిర్మించనున్నారు. ఇందులో కథానాయికగా నయనతార అయితే బాగుంటుందని చిత్రబృందం భావించిందట. నయనతారను సంప్రదించారని కూడా సమాచారం. మరి.. అజిత్ 60లో నయనతార ఉంటారా? లేక వేరే కథానాయిక నటిస్తారా? జస్ట్ కొన్ని రోజుల్లో తెలిసిపోతుంది.



● సందీప్ కిషన్

## రామకృష్ణ వినోదం

'వికటకవి' అనగానే కృష్ణదేవరాయల కాలంలోని అష్టదిగ్గజాల్లో ఒకరైన 'తెనాలి రామకృష్ణ' కవిని తలచుకుంటాం. ఇప్పుడు ఆయన పేరుతో సందీప్ కిషన్ హీరోగా 'తెనాలి రామకృష్ణ బీఏబీఎల్' అనే చిత్రం తెరకెక్కింది. శ్రీ నీలకంఠేశ్వర స్వామి క్రియేషన్స్ పతాకంపై అగ్రహారం నాగిరెడ్డి, సంజీవ్ రెడ్డి, రూప జగదీష్ నిర్మించారు. ఎంటర్‌టైన్‌మెంట్ చిత్రాలను అందంగా తెరకెక్కించే జి.నాగేశ్వరరెడ్డి ఈ చిత్రానికి దర్శకుడు. ప్రస్తుతం ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. ఔట్ అండ్ ఔట్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ చిత్రాన్ని నవంబర్‌లో విడుదల చేయటానికి చిత్రనిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు. హన్సిక హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో వరలక్ష్మీ శరత్‌కుమార్ కీలక పాత్ర చేశారు. ఈ చిత్రం ఫస్ట్ లుక్, టీజర్‌కు అద్భుతమైన స్పందన వచ్చిందన్నారు చిత్రబృందం. ఈ చిత్రానికి సంగీతం: సాయికార్తీక్, కెమెరా: సాయి శ్రీరామ్

# కమల్ కూతురికి గిల్టీగా లేదా?

**- మీరా మిథున్**



● కమల్‌హాసన్



● మీరా మిథున్

● అక్షరాహాసన్

''హిందీ పరిశ్రమలో బంధుప్రీతి బాగా ఎక్కువ. వారసులకు ఇచ్చిన ప్రాధాన్యం బయటి నుంచి వచ్చినవారికి ఇవ్వరు'' అని కథానాయిక కంగనా రనౌత్ విమర్శనాస్త్రాలు విసురుతుంటారు. ఇప్పుడు తమిళ పరిశ్రమలో 'నెపోటిజమ్' (బంధుప్రీతి) వివాదం మొదలైంది. ''ఇక్కడ వారసులదే హవా. ప్రతిభను పట్టించుకోరు. బిగ్ డాడీ (కమల్‌ని ఉద్దేశించి మీరా ఇలా అంటారట)కి, చిత్రపరిశ్రమలోని పెద్దలకు వారసులు చాలు. పైగా ఎవరైనా (బయటనుంచి వచ్చిన ఆర్టిస్టులు) పాపులర్ అవుతుంటే భరించలేరు. వాళ్లు యాక్ట్ చేసిన సీన్స్‌ని కత్తిరించేస్తారు. సినిమాలు చేజారేలా చేస్తారు'' అని తమిళ నటి మీరా మిథున్ సోషల్ మీడియా సాక్షిగా ఆరోపణలు చేశారు. మోడల్‌గా కెరీర్ ఆరంభించి, '8 తోటాక్కళ్' (2017)తో సినిమా కెరీర్ మొదలుపెట్టారామె. ఆ తర్వాత నాలుగైదు సినిమాల్లో నటించిన మీరా ప్రస్తుతం కమల్‌హాసన్ హోస్ట్ చేస్తున్న తమిళ 'బిగ్ బాస్ 3'లో పాల్గొన్నారు. హౌస్ నుంచి బయటకు వచ్చేశారు కూడా. 'బిగ్ బాస్ 3' మీరాకి కావాల్సినంత క్రేజ్‌ని తెచ్చింది. ఈ క్రేజ్‌తో తమిళంలో చాలా అవకాశాలు వస్తాయని కూడా ఊహించారామె. దానికి తగ్గట్టే మీరాకి అవకాశాలు వస్తున్నాయి. అయితే 'అగ్ని శిరగుగళ్' అనే సినిమాలో నటించే అవకాశం వచ్చినట్లే వచ్చి చేజారింది. ఆ తర్వాత ఆ సినిమాలో అక్షరాహాసన్‌ని కథానాయికగా తీసుకున్నారు. ''కోలీవుడ్‌లో నెపోజిటమ్ ఏ స్థాయిలో ఉందో ఇప్పుడు బాగా స్పష్టం అయిపోయింది. ఈ సినిమా నుంచి నన్ను తప్పించడానికి కమల్‌హాసన్ కారణం అయ్యుంటారు. ఎందుకంటే ఆయన సొంత కూతురు అక్షరాహాసన్‌ని తీసుకున్నారు. అక్షరాకి కొంచెం కూడా గిల్టీ అనిపించడంలేదా? నవీన్ (చిత్రదర్శకుడు), టి. శివమ్మా (నిర్మాత).. మీ ఇద్దరి ద్వంద్వ వైఖరి నాకు అర్థమైంది'' అని మీరా మిథున్ ట్వీటర్‌లో పేర్కొన్నారు. అందుకు బదులుగా ''మీరా మిథున్‌ని ఈ చిత్రంలో నటింపజేయాలని అనుకోలేదు. మాతో మాట కూడా చెప్పకుండా తనంతట తనే ఈ సినిమా చేస్తున్నట్లు మీడియాకి చెప్పింది. కానీ నేను వివాదం చేయదలచుకోలేదు. అందుకని మాట్లాడలేదు. మేం ముందు షాలినీ పాండేని అనుకున్నాం. ఇప్పుడు తన స్థానంలో అక్షరాహాసన్‌ని తీసుకున్నాం'' అని ట్వీటర్ ద్వారా నవీన్ పేర్కొన్నారు. అయితే మీరా మిథున్ జిమ్నాస్ట్ కాబట్టి, ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో తనని తీసుకోవాలనుకుంటున్నాం అని నవీన్ చెప్పిన ఇంటర్వ్యూని బయటపెట్టారు మీరా. ''ఈ ఇంటర్వ్యూ ఇచ్చిన సంగతి మీకు గుర్తుందా? లేక ప్రెస్ కూడా అబద్ధం ఆడిందంటారా? ఏంజెలినా జోలీ (హాలీవుడ్ నటి) లాంటి నటి కావాలని నన్ను తీసుకుంటున్నట్లు మీరు చెప్పిన విషయం మరచిపోయారా? మీకు జ్ఞాపకశక్తికి సంబంధించిన సమస్య ఏమైనా ఉందేమో! అందుకే నేను గుర్తు చేస్తున్నాను'' అంటూ మీరా ఘాటుగా స్పందించారు. అంతేకాదు.. ఓ పురుషుడివి అయ్యుండి నిజం చెప్పడానికి గట్స్ లేవా అంటూ ఓ ఇంటర్వ్యూలో నవీన్‌ని ఉద్దేశించి అన్నారు మీరా. అందుకు నవీన్ స్పందిస్తూ – ''మగవాడిగా పుట్టినందుకు గర్వపడే వ్యక్తిని కాదు నేను. స్త్రీలు అయినప్పటికీ మా అమ్మ, సోదరి, నా భార్య నాకన్నా గట్స్ ఉన్నవాళ్లు. మీకేదో సమస్య ఉందనుకుంటా మీరా.. డాక్టర్‌ని సంప్రదించండి. మీ 'సిల్లీ ట్వీట్స్'కి ఇదే నా చివరి సమాధానం. శుభాకాంక్షలు'' అన్నారు. ''మాటలు జాగ్రత్త. ఒక స్త్రీని డాక్టర్‌ని కలవమని చెప్పే అధికారం మీకెవరు ఇచ్చారు? 'అగ్ని శిరగుగళ్' సినిమా గురించి, నా పాత్ర గురించి మనం మాట్లాడినట్లు నిర్ధారించడానికి నా దగ్గర ఆడియో ఉంది. అది కనుక నేను బయటపెడితే మీకొక్కరికే కాదు మీ కుటుంబంలో ఉన్న స్త్రీల మీద కూడా ఆ ప్రభావం పడుతుంది. మరి.. నేను బయటపెట్టనా? ఎదుర్కొనే గట్స్ మీకున్నాయా?'' అని ట్వీట్ చేశారు మీరా. అందుకు నవీన్ నుంచి సమాధానం రాకపోవడంతో ''ఏమైంది నవీన్ కుమార్. ఎందుకు సైలెంట్ అయిపోయారు. సవాల్‌ని ఎదుర్కోకుండా ఎందుకు మౌనంగా ఉన్నారు'' అని ట్వీట్ చేశారు మీరా.

ఇలా వాడివేడి ట్వీట్స్‌తో మీరా మిథున్ టాక్ ఆఫ్ కోలీవుడ్ అయ్యారు. అయితే ఈ వివాదం గురించి మంగళవారం సాయంత్రం వరకూ కమల్, అక్షరా నుంచి ఎలాంటి స్పందన లేదు. మరి.. స్పందిస్తారో? సైలెంట్‌గా ఉండిపోతారో చూడాలి.



● సాయిపల్లవి

## అతిథి వస్తున్నారు

కేరళలో 1970లలో జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కిన చిత్రం 'అధిరన్'. సాయిపల్లవి, ఫాహద్ ఫాజిల్, ప్రకాష్ రాజ్, అతుల్ కులకర్ణి ప్రధాన పాత్రల్లో వివేక్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా ఈ ఏడాది ఏప్రిల్‌లో విడుదలై ఘన విజయం సాధించింది. ఈ చిత్రం 'అనుకోని అతిథి' పేరుతో నవంబర్ 15న తెలుగులో రిలీజ్ కానుంది. ఇన్ ట్రూప్ ఫిలిమ్స్ సమర్పణలో జయంత్ ఆర్ట్స్ బ్యానర్‌పై అన్నంరెడ్డి కృష్ణకుమార్, గోవింద రవికుమార్ తెలుగులో విడుదల చేస్తున్నారు. నిర్మాతలు మాట్లాడుతూ– ''సైకలాజికల్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రమిది. సాయిపల్లవి, ప్రకాశ్‌రాజ్, అతుల్ కులకర్ణి నటన సూపర్బ్. ప్రభాస్ 'సాహో'కి నేపథ్య సంగీతం అందించిన జిబ్రాన్ ఈ చిత్రానికి అద్భుతమైన నేపథ్య సంగీతం అందించారు. మలయాళంలోలానే తెలుగులోనూ విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: అను మోతేదత్, సంగీతం: పి.ఎస్. జయహరి, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: దక్షిన్ శ్రీన్వాస్, సమర్పణ: దీపా సురేందర్ రెడ్డి.



● కార్తీ

## ఖైదీ యాక్షన్

'యుగానికొక్కడు, ఆవారా, నా పేరు శివ, ఊపిరి, ఖాకీ' వంటి వైవిధ్యమైన సినిమాలతో తెలుగు ప్రేక్షకుల్లోనూ మంచి గుర్తింపు తెచ్చుకున్న కార్తీ నటించిన తాజా చిత్రం 'ఖైదీ'. లోకేష్ కనకరాజ్ దర్శకత్వం వహించారు. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ఎస్.ఆర్. ప్రకాష్ బాబు, ఎస్.ఆర్. ప్రభు, తిరుప్పూర్ వివేక్ నిర్మించిన ఈ చిత్రం దీపావళి కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. తెలుగు రాష్ట్రాల్లో శ్రీ సత్య సాయి ఆర్ట్స్ అధినేత కె.కె.రాధామోహన్ విడుదల చేస్తున్నారు. కార్తీ మాట్లాడుతూ– ''సాంగ్స్, రొమాన్స్ లేకుండా కేవలం యాక్షన్ అండ్ థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఉండే వైవిధ్యమైన చిత్రమిది. ఈ చిత్రాన్ని చూసి, ప్రేక్షకులందరూ థ్రిల్ అవుతారు'' అన్నారు. కె.కె.రాధామోహన్ మాట్లాడుతూ– ''రెగ్యులర్ సినిమాలకు భిన్నంగా ఉండే సినిమా ఇది. పాటలు, హీరోయిన్ లేకుండా డిఫరెంట్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ సినిమాలో తండ్రి, కూతురి సెంటిమెంట్ బాగుంటుంది. కార్తీ సినిమాల్లోనే 'ఖైదీ' ఓ ప్రత్యేక సినిమా అవుతుంది'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సామ్ సి.ఎస్., కెమెరా: సత్యన్ సూర్యన్.



## డైరీతో మార్పు

''నేను పుట్టింది, పెరిగింది హైదరాబాద్‌లోనే. ఇంజినీరింగ్ చదివా. నిర్మాణ రంగం, సినిమా రంగం రెండూ నాకు ఇష్టమైనవే. నా చదువు అయిపోయాక మా నాన్నగారి (కోటేశ్వరరావు) కన్‌స్ట్రక్షన్స్ వ్యాపారం చూసుకునేవాణ్ణి. యాక్టింగ్ మీద నాకున్న ఇష్టమే సినిమా రంగం వైపు వచ్చేలా చేసింది. హీరో వెంకటేష్‌గారే నాకు స్ఫూర్తి'' అని అనురాగ్ కొణిదెన అన్నారు. హేమంత్ కార్తీక్ దర్శకత్వంలో అనురాగ్ కొణిదెన హీరోగా, శ్వేత అవస్తి, కై రవి తక్కర్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'మళ్ళీ మళ్ళీ చూశా'. క్రిషి క్రియేషన్స్ పతాకంపై కె. కోటేశ్వరరావు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 18న విడుదల కానుంది. అనురాగ్ కొణిదెన మాట్లాడుతూ– ''వైజాగ్ నేపథ్యంలో మా సినిమా జరుగుతుంది. జులాయిగా తిరిగే ఒక అబ్బాయికి ఒక డైరీ దొరుకుతుంది. ఆ డైరీ చదివినప్పటి నుండి అతని ప్రవర్తనలో కొన్ని మార్పులు వస్తూ ఉంటాయి. డైరీ చదివితేనే మార్పులు వస్తున్నాయంటే ఆ డైరీ రాసిన అమ్మాయిని కలిస్తే లైఫ్ ఇంకా ఎంత అద్భుతంగా ఉంటుంది? అని ఆ అమ్మాయి కోసం వైజాగ్ నుంచి హైదరాబాద్ వస్తాడు. ఆ అమ్మాయిని కలిశాడా? లేదా? అనేది స్టోరీ. ఈ సినిమాలో నా పాత్రలో రెండు వేరియేషన్స్ ఉంటాయి. ఈ చిత్రం కోసం 100 శాతం కష్టపడ్డా. ఈ సినిమా ప్రొడక్షన్‌ని నేను, మా ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ సతీష్ పాలకుర్తి చూసుకున్నాం. ప్రస్తుతం 'మళ్ళీ మళ్ళీ చూశా' విడుదల కోసం వేచి చూస్తున్నా. నా తర్వాతి సినిమా కోసం కొన్ని కథలు విన్నాను. ఒక థ్రిల్లర్ సబ్జెక్ట్ అనుకుంటున్నాం'' అన్నారు.

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
బుధవారం
16-10-2019

సీరియల్

# మనసిచ్చి చూడు




**కన్నడ సీరియల్ నటి తెలుగు ప్రేక్షకులకు భానుగా పరిచయం అయ్యింది. 'మనసిచ్చి చూడు' అంటూ 'స్టార్ మా'లో వచ్చే ఈ సీరియల్ ద్వారా తెలుగు ప్రేక్షకుల మనసులను గెలుచుకుంటున్న ఈ నటి పేరు కీర్తి భట్. సీరియల్‌లోనే కాదు నిజ జీవితంలోనూ ఎన్నో ట్విస్ట్‌లు ఉంటాయంటూ తన గురించి చెప్పకొచ్చింది కీర్తి.**

''నేను పుట్టి పెరిగింది అంతా బెంగుళూరులోనే. కన్నడ పరిశ్రమలోనే ఉన్నాను కాబట్టి ఇంకా తెలుగు సరిగా రాదు. అర్థం చేసుకుంటూ నేర్చుకుంటున్నాను. 'ది క్రైస్ట్ సేవ్ యూ' అనే సినిమా తెలుగు, ఇంగ్లిష్‌లోనూ వచ్చింది. ఆ విధంగా తెలుగువారికి పరిచయం అయ్యాను. కిందటేడాది వచ్చిన ఈ సినిమాలో హీరోయిన్‌గా చేశాను. ఇప్పుడు 'మనసిచ్చి చూడు' సీరియల్ ద్వారా మీ ముందుకు వచ్చాను. ఈ సీరియల్‌లో నాది సంప్రదాయాలను గౌరవించే భాను పాత్ర. పెద్దల పట్ల మన్నన గౌరవం అధికం. బాధ్యతలను, బంధాలను వదలుకోని భాను జీవితంలో ఊహించని ఎన్నో మలుపులు ఉంటాయి. ప్రేమించిన వాడిని పెళ్లి చేసుకోవాలన్నది భాను కల. ఆ కల నిజమవుతున్న వేళ అతను ప్రమాదంలో చనిపోతాడు. దీంతో అతని తమ్ముడినే పెళ్లి చేసుకోవాల్సిన పరిస్థితి. ఎన్నో ఆసక్తికర మలుపులతో ఈ సీరియల్ ఉంటుంది. ఇప్పటి వరకు కన్నడలో మూడు టీవీ సీరియల్స్ చేశాను. రెండు కన్నడ సినిమాల్లో నటించాను.

**నిజజీవితంలోనూ పెద్ద ప్రమాదమే!**

సీరియల్‌లో హీరోయిన్ కష్టాలు కల్పితమే. కానీ, నిజ జీవితంలో.. బిబిఎమ్ చేసిన నాకు ఎప్పుడూ సినీ ఫీల్డ్ మీద ఆసక్తిగా ఉండేది. అమ్మానాన్న అంత ఆసక్తి చూపకపోయినా నా ఇంట్రస్ట్ చూసి కాదనలేదు. అయితే, మూడేళ్ల క్రితం కారు ప్రమాదంలో అమ్మానాన్న, అన్నయ్య.. ముగ్గురూ దూరమయ్యారు. దీంతో ఒంటరిదాన్నయ్యాను. కుటుంబాన్ని కోల్పోయి దురదృష్టవంతురాలిగా మిగిలిపోయాను. బాధపడుతూ కూర్చుంటే కాదని, లైఫ్‌ను సింగిల్‌గానే ఎదుర్కోవాలని నాకు నేను నచ్చజెప్పుకున్నాను. ఉన్న ఫీల్డ్‌లోనే కొనసాగాలని, నన్ను నేను ప్రూవ్ చేసుకోవాలనే ఉద్దేశ్యంతో సినిమా అవకాశాల కోసం ఎదురు చూడకుండా సీరియల్స్ వైపు వచ్చాను. ఇక్కడ ఆదరణ, అభిమానం ఈ పరిశ్రమలో కొనసాగేలా చేస్తోంది. నా తోటి నటీనటులు, దర్శక నిర్మాతలు, అందరితో కలిసే చేసే ఈ టీమ్‌లో నా కుటుంబాన్ని చూసుకుంటున్నాను.



సీరియల్‌లో ఓ దృశ్యం

**ఎంపికలో ముందు**

డ్రెస్ సెలక్షన్, ఫ్యాషన్ డిజైనింగ్ మీద కూడా ఆసక్తి ఉండటం నా వర్క్‌కి ప్లస్ అయ్యింది. నేను చేస్తున్న పాత్రలకు తగ్గట్టుగా కాంబినేషన్ డ్రెస్సులను ఎంచుకుంటాను. కొంతవరకు నా డిజైనర్ ఫ్రెండ్ సలహాలు తీసుకుంటాను. అమ్మాయిలు ఇప్పుడు ప్రతి రంగంలోనూ తమని తాము నిరూపించుకోవడానికి కష్టపడుతున్నారు. ఎవరూ లేరని, తమకేదో జరుగుతుందని జంకితే ఎదుగుదల ఉండదు. మనం పుట్టిందే సవాళ్లను ఎదుర్కోవడానికి అర్థమయ్యాక ఇప్పుడు ఏ సమస్య అయినా చిన్నదిగానే కనిపిస్తుంది. నన్ను ఆదరిస్తున్న తెలుగు ప్రేక్షకుల్లో ఎప్పటికీ నిలిచేఉండేలా గుర్తింపు తెచ్చుకోవాలన్నదే నా అభిలాష.''

– ఆరెన్నార్



**డ్యాన్స్‌తో మాయం**

**చిన్నప్పటి నుంచి డ్యాన్స్ అంటే విపరీతమైన ఇష్టం. అలాగే పుస్తకాలు చదవడం కూడా. ఇంట్లో ఉన్నప్పుడు కొంచెం లోన్లీగా అనిపించినా, ఎక్కువ హ్యాపీ అనిపించినా డ్యాన్స్‌నే బేస్ చేసుకుంటాను. ఏ స్ట్రెస్ అయినా డ్యాన్స్‌తో ఇట్టే మాయం అయిపోతుంది. డ్యాన్స్ షోస్ చూడడం కూడా చాలా ఇష్టం.**

పర్యావరణం

**'మన అవసరానికి భూమి మీద తగినన్ని వనరులు ఉన్నాయి. కానీ, అవి మన దురాశకు కాదు' అని చెప్పిన గాంధీజీ మాటలను గుర్తు చేసుకున్నారు హరిచందన. పర్యావరణ హితురాలిగా ప్లాస్టిక్ రీసైక్లింగ్ విధానాలు, కార్యక్రమాల ద్వారా విభిన్నంగా హరితవనానికి నాయకత్వం వహిస్తున్నారు ఐఏఎస్ అధికారి దాసరి హరిచందన. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ అడిషనల్ కమిషనర్‌గా తను చేపడుతున్న పనులను, ముందున్న సవాళ్లను ఆమె వివరించారు. ప్లాస్టిక్ రీ సైక్లింగ్ విధానాలలో తన సృజనాత్మక ఆలోచనలను 'సాక్షి'తో పంచుకున్నారు.**

# పారేసేది వాడేసేలా



**ఇంటి నుంచి మొదలు**

'మా ఇంట్లో పనమ్మాయి మొదట్లో కిచెన్ నుంచి వచ్చిన తడిచెత్త, మిగతా పొడిచెత్త, ఏమైనా పగిలిపోయిన వస్తువులన్నీ కలిపి ఒకే చెత్తబుట్టలో వేసేది. నేనూ మొదట్లో అంతగా పట్టించుకోలేదు. అనారోగ్యకారణం వల్ల ఓ నెల రోజులు ఇంట్లో ఉండాల్సిన పరిస్థితి వచ్చింది. అప్పుడు తను చేస్తున్న పనులు చూసి మూడు చెత్తబుట్టలను ఏర్పాటు చేసి, ఏ చెత్త ఎందులో ఎలా వేయాలో వివరంగా చెప్పాను. నేను గమనించిన అన్ని రోజులూ బాగానే చేసేది. ఆఫీసుకు రావడం మొదలయ్యాక నేను గమనించడం లేదనుకొని మళ్లీ అన్నీ ఓ ప్లాస్టిక్ బ్యాగ్‌లో వేయడం మొదలు పెట్టింది. 'ఎందరికో చెత్త, రీ సైక్లింగ్, పర్యావరణం గురించి అవగాహన కలిగించేలా చెబుతుంటాను. నా ఇంట్లోనే ఇలా ఉంది.. ఏమిటి చేయడం?' అని ఆలోచించాను. నా భయంతో కాకుండా అవగాహన కలిగించాలని నిర్ణయించుకున్నాను.

సాధారణంగా నెల చివర్లో తీసేసే న్యూస్ పేపర్లు తీసి, అమ్ముకోమని మా పనమ్మాయికి చెబుతుంటాను. ఆ పేపర్లతో పాటు మరో మార్గం సూచించా. తడి, పొడి చెత్తతో పాటు మూడవ డస్ట్ బిన్‌లో వేసే ప్లాస్టిక్, పనికిరాని వస్తువులను ఉంచేలా చూసి, ఒకరోజు వాటిని వేటికవి విడివిడిగా చేయించా. ఆ చెత్త నుంచి తీసిన స్క్రాప్‌ను కూడా అమ్మమని చెప్పా. ఆ నెల తనకు అలా మరో నాలుగు వందల రూపాయలు అదనంగా వచ్చాయి. దీంతో పేపర్లతో కలిపి నెలకు ఏడెనిమిది వందల రూపాయలు వస్తున్నాయి. ఇక అప్పటి నుంచి చాలా జాగ్రత్తగా దేనికది చెత్త డబ్బాలను ఉపయోగిస్తుంది. ప్రతీ ఇంట్లోనూ నెల–రెండు నెలలకోసారి ఏడెనిమిది వందల ఆదాయం మన చెత్త నుంచే వస్తుందంటే ఇదీ ఒక పొదుపే కదా! మనం వాడి పడేసే చెత్తను ఇంటి నుంచే తగ్గిస్తే డంప్ యార్డ్‌లకు చేరే చెత్త తగ్గుతుంది. మనకు పర్యావరణం పట్ల ప్రేమ, అవగాహన, బాధ్యత, భయం కూడా ఉంటేనే ఈ జాగ్రత్త తీసుకోగలం. మా అమ్మాయికి మూడేళ్ల వయసు. తనచేత ఒక కుండీలో మొక్క నాటించి, రోజూ దానికి కొన్ని నీళ్లు పోయమని చెప్పాను. ఇప్పుడు నేను సాయంకాలం ఇంటికి వెళ్లాక ఆ మొక్కకు సంబంధించిన విషయాలన్నీ ఆనందంగా చెబుతుంటుంది. వాటిని శ్రద్ధగా వింటాను. ఆ మొక్క మా ఇద్దరి మధ్య ఒక పాజిటివ్ ఎనర్జీని పెంచడం నాకు సంతోషంగా అనిపిస్తుంటుంది.



బాటిల్ ఫెన్సింగ్..



ఆయిల్ డ్రమ్ములతో ..



పాత టైర్లతో అందమైన చైర్లు, సెంటర్ టేబుల్



వాడి పడేసిన బాటిల్స్‌తో బస్ షెల్టర్స్

**పాల పాకెట్ల సేకరణ నుంచి**

'చదువుకునే రోజుల్లో మా అమ్మ చేస్తున్న పనులను అంతగా పట్టించుకునేదాన్ని కాదు గానీ గమనించేదాన్ని. అవి నేను పెద్దయ్యాక ఆలోచింపజేసేలా, ఆచరణలో పెట్టేలా దోహదమయ్యాయి. మా అమ్మ ఏ చిన్న డబ్బా దొరికినా అందులో కొద్దిగా మట్టి పోసి మొక్క పెట్టేస్తుంది.. ఇప్పటికీ ఇండోర్‌ప్లాంట్స్, రూఫ్‌గార్డెన్ పనులు అమ్మ చాలా ఇష్టంగా చేస్తుంటుంది. రోజూ పాల ప్యాకెట్లు డస్ట్ బిన్‌లో కాకుండా ఒక దగ్గర పోగుచేస్తుంది. అమ్మ నిరంతరం చేసే ఆ పనులను గమనించడం వల్ల నాకూ వేస్టేజ్‌పై దృష్టిపెట్టడం పెరిగిందనుకుంటాను.'

**అతి పెద్ద చెత్త కొండ**

'జీహెచ్‌ఎంసిలో పోస్టు తీసుకోగానే సిటీలో ఉన్న డంప్‌యార్డ్‌లను చూడటానికి వెళ్లాను. జవహర్ నగర్ డంప్‌యార్డ్‌ను చూడగానే 'వామ్మో' అనిపించింది. ఎటు చూసినా చెత్త.. పెద్ద కొండలా తయారైంది ఆ డంప్‌యార్డ్. నేను పుట్టింది ఖమ్మం. పెరిగిందంతా హైదరాబాద్‌లోనే. కానీ, ఎప్పుడూ అంత చెత్తను చూసింది లేదు. వాటన్నింటి గురించి తెలుసుకుంటే ఇళ్ల నుంచి వచ్చే చెత్తనే ఎక్కువ అని తేలింది. కొంచెం జాగ్రత్త పడితే చెత్త రావడాన్ని మనమే నిరోధించవచ్చు. ఉన్న చెత్తను తగ్గించవచ్చు అనుకున్నాను. అప్పుడే రీ సైక్లింగ్ విషయాల మీద మా టీమ్ అందరితో మాట్లాడాను. వేస్ట్‌ను తిరిగి వాడే సంస్థల గురించి తెలుసుకున్నాను. వాడి పడేసిన ప్లాస్టిక్ బాటిల్స్‌తో షెడ్, రీయూజ్ ప్లాస్టిక్‌తో టైల్స్ డిజైన్ చేయించాం, ఉపయోగంలో లేని టైర్లతోనూ, ఆయిల్ డ్రమ్ములతో సిట్టింగ్ చైర్లు, టేబుళ్లు తయారు చేయించాం. ఇలా వాడి పడేసి ఇక పనికిరావనుకున్న వస్తువులన్నీ తిరిగి పనికి వచ్చేలా ఏమేం చేయచ్చో తెలుసుకుంటూ, వాటిని ఏర్పాటు చేస్తూ, అలా ఏర్పాటు చేస్తామన్న వ్యక్తులతో కలిసి పనిచేస్తున్నాం. ఆహారం వృధా కాకుండా అవసరమైన వారికి అందజేయచ్చు అని ఉద్దేశ్యంతో ఫీడ్ నీడ్‌ను ఏర్పాటు చేశాం. అర్బన్ ఫారెస్ట్ పార్క్‌లను రూపొందించే పనిలో ఉన్నాం. ఈ జాబ్‌లోకి రాకముందు అమెరికాలో పర్యావరణానికి సంబంధించిన కంపెనీలో వర్క్ చేశాను. ఒక రోజు ఆఫీసులో ఉన్నప్పుడు నా ఆలోచనలు, పనులు ఒక ఆర్గనైజేషన్ వరకే పరిమితం అయితే ఎలా అని ఆలోచించాను. ఒక పెద్ద గ్రూప్‌లో ఉంటే మన ఆలోచనా విధానం కూడా పెరుగుతుందని ఇటువైపుగా వచ్చాను. ఆ దిశగానే నలుగురికి ఉపయోగపడే పనులు చేయాలనుకుంటున్నాను.'

– నిర్మలారెడ్డి

ఫొటోలు: సురేశ్‌కుమార్

లైఫ్ స్టయిల్ కౌన్సెలింగ్స్

ఫ్యామిలీ డాక్టర్

# ఫిట్‌నెస్ పెంచుకోవడం ఎలా?

**నా వయసు 55 ఏళ్లు. గతంలో నేను బాగా ఆరోగ్యంగానే ఉండేవాడిని. అయితే ఇటీవల కొద్ది దూరం నడిచినా అలసట వచ్చినట్లుగా అనిపిస్తోంది. గతంలో ఎంత నడిచేవాణ్ణో ఇప్పుడూ అంతే దూరం నడిచినా త్వరగా అలసిపోతున్నాను. పైగా గతంలోలా చురుగ్గా ఉండలేకపోతున్నాను. దాంతో నా ఫిట్‌నెస్ తగ్గినట్లుగా ఫీలవుతున్నాను. నేను ఇదివరకటి ఆరోగ్యాన్నే పొందడానికి ఏం చేయాలో సలహా ఇవ్వండి.**

**– డి. రామ్మోహన్‌రావు**, విశాఖపట్నం

వయసు పెరుగుతున్న సమయంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా ముఖ్యం. మీ వయసువారు తప్పక ఈ అంశంపై దృష్టి పెట్టాలి. మీ వయసు వారిలో డయాబెటిస్ లేదా హైబీపీ లాంటి వ్యాధి లక్షణాలు ఏవైనా ఉంటే, వాటికి తగిన చికిత్స పొందడం, మంచి ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వంటి అంశాలు ఎంతగానో దోహదపడతాయి. వీటన్నింటిలోనూ వ్యాయామం చాలా ముఖ్యం. మీరు ఏ వయసువారైనప్పటికీ వ్యాయామంతో తగిన ప్రయోజనం పొందవచ్చు. దీనివల్ల గుండె జబ్బులు, మతిమరపు, డయాబెటిస్, కొన్ని రకాల క్యాన్సర్లు, అధికరక్తపోటు, స్థూలకాయం వంటి సమస్యలను నివారించుకోవచ్చు. ఎముకల సాంద్రత తగ్గడం కూడ నివారితమవుతుంది. దాని వల్ల వయసుపైబడ్డవారు పడిపోయే అవకాశాలు తగ్గుతాయి. ఒకవేళ పడిపోయినప్పుడు ఎముకలు విరిగే అవకాశమూ తగ్గుతుంది. పైగా వ్యాయామం చేసేవారిలో ఎండార్ఫిన్ వంటి జీవరసాయనాలు ఎక్కువగా స్రవించి ఒత్తిడిని తగ్గిస్తాయి. అంతేకాదు అవి దిగులుగా ఉండటం, యాంగ్జైటీ,డిప్రెషన్‌ను కూడా నివారిస్తాయి. ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తాయి. అయితే కాస్త వయసుపైబడ్డవారు వ్యాయామాన్ని ప్రారంభించే ముందుగా డాక్టర్ నుంచి తగిన సలహా పొందాలి. వారి వ్యక్తిగత రుగ్మతలకూ, జీవనశైలికి తగిన వ్యాయామ విధానాల గురించి డాక్టర్ నుంచి సూచనలు పొందాలి. ఉదాహరణకు డయాబెటిస్ వంటి సమస్యలు ఉన్నవారు తాము తీసుకుంటున్న మందులు, ఆహారానికి తగినట్లుగా తమ వ్యాయామ పద్ధతులు, వేళల గురించి డాక్టర్ నుంచి సలహా పొందడం అవసరం. పైగా వ్యాయామాన్ని కొత్తగా మొదలుపెట్టేవారు భారమైన పెద్దపెద్ద వ్యాయామాలను ఒకేసారి ప్రారంభించకూడదు. వ్యవధినీ, శరీరం మీద పడే భారాన్ని మెల్లమెల్లగా పెంచాలి. రోజులో రెండుసార్లు వ్యాయామం చేయడం మంచిది. వ్యాయామం వల్ల అయ్యే గాయాలను నివారించడానికి ఎక్సర్‌సైజ్‌కు ముందుగా వార్మింగ్ అప్, తర్వాత కూలింగ్ డౌన్ వ్యాయామాలు చేయడం మేలు. వ్యాయామం మనల్ని మరింత చురుగ్గా ఉండేలా చేయాలి. అంతేతప్ప నిస్సత్తువను పెంచకూడదు. వ్యాయామం చేస్తున్నప్పుడు నొప్పులు పెరిగినా, ఒంట్లో ఎక్కడైనా ఎర్రబారినా, శ్వాస అందకపోయినా, చెమటలు ఎక్కువగా పట్టినా, ఇతరత్రా ఇబ్బందులు ఎదురైనా వెంటనే వ్యాయామం ఆపేయాలి. వెంటనే డాక్టర్‌ను కలిసి తగిన చికిత్సనూ, సలహాలు, సూచనలను పొందాలి.



# అదేపనిగా కూర్చుని పనిచేస్తున్నాను.. ప్రమాదమా?

**ఆఫీసులో నా పని అంతా కంప్యూటర్ మీదే ఉంటుంది. ఒకసారి ఆఫీస్‌లోకి వచ్చాక నేను నా సిస్టమ్ ముందు కూర్చుంటే మళ్లీ సాయంత్రం వరకూ లేవను. మధ్య మధ్య ఫ్రెండ్ టీకి పిలిచినా నా పని మధ్యలో వదిలేసి వెళ్లాలనిపించదు. అయితే అంతంత సేపు అలాగే కూర్చుండిపోవడం మంచిది కాదని చాలామంది సలహా ఇస్తున్నారు. ఈ విషయంలో నాకు తగిన సలహా ఇవ్వండి.**

**– విశాల్, హైదరాబాద్**

కూర్చొని పనిచేసే వృత్తుల్లో ఉన్నవారు అదేపనిగా కూర్చొనే ఉండటం చాలా ఆరోగ్య సమస్యలకు కారణమవుతుందని అనేక పరిశోధనల్లో వెల్లడయ్యింది. ఇలా సుదీర్ఘకాలం పాటు కూర్చొనే ఉండటం అన్నది టైప్–2 డయాబెటిస్, ప్రాణాంతకమైన గుండెజబ్బులు, కొన్ని రకాల క్యాన్సర్లకూ కారణమవుతుంది. కూర్చునే వృత్తుల్లో ఉన్నా లేదా ప్రయాణాలు చేసే వృత్తుల్లో ఉన్నవారు అదేపనిగా సీట్లో చాలాసేపు కూర్చోవడం, లేదా టీవీని వదలకుండా చూస్తూ కూర్చోవడం, వృత్తిపరంగా బైక్ మీద కూర్చొనే చాలాసేపు ప్రయాణం చేస్తూ ఉండటం వంటి అనేక అంశాలు ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపుతాయి. పొగతాగడం వంటి దురలవాటు ఎంత దుష్ప్రభావం చూపుతుందో, ఇలా కూర్చొనే ఉండటం అన్న అంశం కూడా అంతకంటే ఎక్కువ దుష్ప్రభావమే చూపుతుందని ఎన్నో అధ్యయనాలు వెల్లడించిన వాస్తవం. ప్రతివారు రోజూ కనీసం 30 – 45 నిమిషాల పాటు వాకింగ్ చేయడం అవసరం.

పిల్లలు ఎక్కువగా టీవీ చూడటం, కంప్యూటర్ గేమ్స్‌లో నిమగ్నం కావడం అనే కారణాలతో అదేపనిగా కూర్చొనే ఉంటారు. ఇక పెద్దలు తమ ఆఫీసు పనుల్లో మునిగిపోయి కూర్చొనే ఉంటారు.

**కొన్ని సూచనలు:** ● అదేపనిగా కూర్చోవడాన్ని బ్రేక్ చేయడం కోసం ఈ కింది సూచనలు పాటించాలి ● మీ బెడ్‌రూమ్స్‌లో టీవీ/కంప్యూటర్/ల్యాప్‌టాప్ లను ఉపయోగించకండి ● మీరు ఇంట్లో ఉన్నప్పుడు ఒంటికి పనిచెప్పే ఏదో పనిని ఎంచుకోండి ● పిల్లలకు మీరు ఇచ్చే బహుమతుల్లో పిల్లలకు శారీరక ఆరోగ్యం చేకూర్చే బంతులు/ఆటవస్తువుల వంటివి ఉండేలా చూసుకోండి ● మీరు ఆఫీసుకు వచ్చే ముందర లోకల్ బస్సుల్లో, లోకల్ ట్రైన్స్‌లో ప్రయాణం చేసేవారైతే ఆ టైమ్‌లో కూర్చుని ప్రయాణం చేయకండి ● ఎస్కలేటర్ వంటి సౌకర్యం ఉన్నా మెట్లెక్కండి ● రోజూ కనీసం 30నిమిషాలు నడవాలని నియమం పెట్టుకోండి ● మీ వర్క్ ప్లేస్‌తో ఫోన్‌లో మాట్లాడేటప్పుడు అటూ ఇటూ నడుస్తూ మాట్లాడండి ● మీ పనిలో కాసేపు కాఫీ లేదా టీ బ్రేక్ తీసుకోండి ● మీకు దగ్గరి కొలీగ్స్‌తో మాట్లాడాల్సి వస్తే మొబైల్ / మెయిల్ ఉపయోగించకండి. వారి వద్దకే నేరుగా వెళ్లి మాట్లాడండి ● టీవీ చూడటం కంటే మంచి హాబీని పెంపొందించుకోండి.



**డా. సుధీంద్ర ఊటూరి**
లైఫ్‌స్టైల్ స్పెషలిస్ట్,
కిమ్స్ హాస్పిటల్స్, సికింద్రాబాద్

హ్యాపీ బర్త్‌డే

# డెబ్బై నిండిన డ్రీమ్ గర్ల్

**నిజ జీవితంలోనూ నట జీవితంలోనూ హుందాగా ఉండవచ్చని, ఎనలేని కీర్తినీ గౌరవాన్ని పొందవచ్చని నిరూపించిన అతికొద్దిమంది భారతీయ నటీమణులలో హేమమాలిని ఒకరు. అక్టోబర్ 16కు ఆమె 70 ఏళ్లు పూర్తి చేసుకొని 71వ ఏటలోకి ప్రవేశిస్తున్నారు.**



దేశంలో కుర్రకారు చాలామందిని తమ డ్రీమ్‌గర్ల్స్‌గా భావించవచ్చు. కాని 'డ్రీమ్‌గర్ల్' అనగానే అందరికీ గుర్తొచ్చే పేరు ఒక్కటే. హేమ మాలిని. దక్షిణాది నుంచి వెళ్లి హిట్ అయిన హీరోయిన్ల వరుసలో హేమమాలినిది సుదీర్ఘ కెరీర్. నిజానికి ఆమెకు హీరోయిన్ పాత్ర కూడా దక్షిణాది హీరోయిన్ వల్లే వచ్చింది. తమిళ, తెలుగు సినిమాల్లో డాన్స్ పాటలు చేసిన (పాండవ వనవాసం) హేమ మాలిని హిందీలో మొదటిసారి 'సప్‌నోంకా సౌదాగర్'లో హీరోయిన్ అయారు. ఆ సినిమా హీరో అయిన రాజ్‌కపూర్ హేమమాలినికి స్క్రీన్ టెస్ట్ కోసం 'సంగమ్' సినిమాలోని ఒక సీన్ ఇచ్చి చేసి చూపమన్నాడు. ఆ టెస్ట్‌లో ఆమె పాస్ అయ్యారు. రాజ్ కపూర్ సినిమా ప్రమోషన్‌లో ఘనాపాటి కాబట్టి కొత్త హీరోయిన్‌నీ తద్వారా సినిమానీ ప్రమోట్ చేయడానికి హేమమాలినిని 'బాలీవుడ్ డ్రీమ్‌గర్ల్'గా ప్రచారం చేశాడు. అలా ఆమె డ్రీమ్‌గర్ల్‌గా ముద్ర పడింది. ఎంతగా అంటే కొన్నాళ్ల తర్వాత అదే పేరుతో ఆమె హీరోయిన్‌గా సినిమా వచ్చేంత.

**దక్షిణాది కథతో**

తెలుగులో హిట్ అయిన ఎన్.టి.ఆర్ 'రాముడు భీముడు' కథనే హీరోయిన్‌కు రాసి సలీమ్ జావేద్ ఆ స్క్రిప్టును రమేష్ సిప్పీకి అమ్మితే రమేష్ సిప్పీ హేమ మాలిని డబుల్ యాక్షన్‌తో ఆ సినిమా తీసి హిట్ కొట్టాడు. అలాగే మన తెలుగు సూపర్ హిట్ సినిమా 'ప్రేమ్‌నగర్' హిందీలో రీమేక్ అవుతున్నప్పుడు రాజేష్ ఖన్నా సరసన హీరోయిన్ పాత్ర హేమ మాలినికి దక్కింది. తెలుగులో వాణిశ్రీ గొప్పగా చేసిన ఆ పాత్రను హేమ మాలిని హిందీలో నిలబెట్టారు. ఆ తర్వాత వచ్చిన 'షోలే'తో హేమ మాలిని పూర్తి స్థాయి స్టార్‌డమ్‌కు చేరుకున్నారు.



భర్త ధర్మేంద్రతో...

**ముగ్గురు హీరోలతో**

హేమ మాలిని ఎక్కువగా దేవ్ ఆనంద్, రాజేష్ ఖన్నా, ధర్మేంద్ర సరసన నటించారు. 'జానీ మేరా నామ్','అందాజ్', 'నసీబ్', 'క్రాంతి', 'సత్తే పే సత్తా', 'అంధా కానూన్' వంటి ఎన్నో హిట్స్ ఆమె ఖాతాలో ఉన్నాయి. గ్లామర్ హీరోయిన్‌గా ఉన్నప్పటికీ 'ఏక్ చాదర్ మైలీసీ' వంటి బలమైన కథాంశం ఉన్న సినిమాలలో నటించి ఆమె పేరు తెచ్చుకున్నారు. హేమ మాలిని తన స్టార్ డమ్‌ను ఎప్పుడూ పోగొట్టుకోలేదు. కొత్త తరం ఎంత వచ్చినప్పటికీ వారితో సమానంగా అమితాబ్ సరసన 'బాగ్‌బన్'లో నటించి ఆ సినిమా విజయానికి కారకులయ్యారు.

**జబ్ తక్ హై జాన్**

హేమ మాలిని క్లాసికల్ డాన్సర్. బాల్యం నుంచే ప్రదర్శనలు ఇచ్చారు. అందువల్ల 'షోలే' సినిమా క్లయిమాక్స్‌లో గబ్బర్ సింగ్ ముందు ఆమె డాన్స్ చేసే పాట 'జబ్ తక్ హై జాన్' చాలా హిట్ అయ్యింది. ఎండలో బండ రాళ్ల మీద ఆమె గొప్ప నర్తనం చూపారు. కాళ్ల కింద గాజుపెంకులు వేస్తే డాన్స్ చేయడం ఆ తర్వాత పదుల సినిమాలో కాపీ అయ్యింది. మన శ్రీను వైట్ల కామెడీ కోసం కూడా ఈ గాజుపెంకుల డాన్స్‌ను ఉపయోగించుకున్నారు.



**ప్రేమ కథ**

హేమ మాలినిని వివాహం చేసుకోవడానికి చాలామంది హీరోలు ప్రయత్నించారు. వారిలో సంజీవ్ కుమార్ ఒకడు. ఆ తర్వాత జితేంద్ర ఆ ప్రయత్నం చేశాడు. వాళ్లిద్దరు మద్రాసులో వివాహం చేసుకోవడానికి దాదాపు తేదీ ఖరారు చేశారు. అయితే అప్పటికే ఆమెతో పీకల్లోతు ప్రేమలో ఉన్న ధర్మేంద్ర ఆ పెళ్లి ఆపించి ఆమె తన భార్య అయ్యేలా సఫలం అయ్యాడు. ధర్మేంద్రకు రెండో భార్యగా ఉన్నప్పటికీ వాళ్లిద్దరి సంసార విషయంలో ఎప్పుడూ గొడవలు బయటకు రాలేదు. ఇద్దరూ ఆ బంధంలో కొనసాగి ఆ తర్వాత దూరం దూరంగా ఉంటున్నా విమర్శలకు దిగలేదు. ధర్మేంద్ర మొదటిభార్య కుటుంబం హేమ మాలిని నుంచి ధర్మేంద్రను మెల్లగా దూరం చేయడంలో సఫలం అయ్యిందనే చెప్పాలి. వారిరువురూ కలిసి ప్రయివేట్‌గా కనిపించడం అరుదు.

**భిన్న రంగాల్లో**

హేమ మాలిని రాజకీయాల్లో ఉన్నారు. మధుర పార్లమెంట్ నియోజకవర్గం నుంచి 2014లో 2019లో విజయం సాధించారు. దూరదర్శన్‌లో 'నుపుర్' సీరియర్ నిర్మించి, దర్శకత్వం వహించారు. కుమార్తె ఇషాను హీరోయిన్ చేయడానికి సినిమాలు నిర్మించారు. సినిమాలలో ఉన్నా రాజకీయాలలో ఉన్నా నాట్యం పట్ల ఉన్న మక్కువతో ప్రదర్శనలు ఇస్తూ ఉన్నారు.

– సాక్షి ఫీచర్స్ డెస్క్

epaper.sakshi.com

సాక్షి భవిత
మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com
స్పర్ధయా వర్ధతే విద్య
బుధవారం
16-10-2019

## ఎయిమ్స్/ఎన్‌సీఆర్/ ఝుజ్జర్‌లో ఉద్యోగాలు

**భా**రత ప్రభుత్వ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన నోయిడాలోని బ్రాడ్ కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (బీఈసీఐఎల్).. ఒప్పంద ప్రాతిపదికన ఢిల్లీలోని ఎయిమ్స్/ ఎన్‌సీఆర్/ఝుజ్జర్‌లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 53
- **పోస్టుల వివరాలు:** ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్-45, ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్-08.
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో ఇంటర్మీడియెట్, బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **వయసు:** 40 ఏళ్లు మించరాదు.
- **ఎంపిక విధానం:** టెస్ట్/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక జరుగుతుంది.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 25.10.2019
- **వెబ్‌సైట్:** www.becil.com

## ఏవీఐఎన్‌యూటీవైలో టీచింగ్ పోస్టులు

**కో**యంబత్తూర్ (తమిళనాడు)లోని డీమ్డ్ టు బి యూనివర్సిటీ అవినాషిలింగం ఇన్‌స్టిట్యూట్ ఫర్ హోమ్ సైన్స్ అండ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఫర్ విమెన్ (ఏవీఐఎన్‌యూటీవై).. టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 54
- **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్-13, అసోసియేట్ ప్రొఫెసర్-10, అసిస్టెంట్ ప్రొఫెసర్-31.
- **విభాగాలు:** రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషన్, టెక్స్‌టైల్స్ అండ్ క్లాతింగ్, హ్యూమన్ రిసోర్స్ డవలప్‌మెంట్, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్ తదితరాలు.
- **అర్హత:** సంబంధిత విభాగంలో పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 08.11.2019
- **వెబ్‌సైట్:** http://avinuty.ac.in/maincampus

# బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్‌లో.. 540 ఉద్యోగాలు

**ర**క్షణ మంత్రిత్వ శాఖ పరిధిలోని బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బీఆర్‌వో).. అర్హులైన పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

**మొత్తం పోస్టుల సంఖ్య:** 540

- **పోస్టుల వివరాలు:** మల్టీ స్కిల్డ్ వర్కర్ (డ్రైవర్ ఇంజిన్ స్టాటిక్)
- **అర్హతలు:** మెట్రిక్యులేషన్, సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** 18-25ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్ల వయో సడలింపు లభిస్తుంది.
- **వేతనం:** పే బ్యాండ్- లెవెల్ 1: రూ.18,000.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేది:** ఎంప్లాయ్‌మెంట్ న్యూస్ (అక్టోబర్ 12-18)లో ఈ ప్రకటన వెలువడిన నాటి నుంచి 45 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలి.
- **వెబ్‌సైట్:** http://www.bro.gov.in



### ఎంపిక ఇలా

- ఫిజికల్ టెస్టు, ప్రాక్టికల్ టెస్టు, రిటెన్ టెస్టు, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక జరుగుతుంది. మొదట అభ్యర్థులకు ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్టు నిర్వహిస్తారు. ఇందులో ఉత్తీర్ణత సాధించిన వారిని ప్రాక్టికల్ టెస్టు/ట్రేడ్ టెస్టుకు అనుమతిస్తారు. ప్రాక్టికల్/ట్రేడ్ టెస్టులో ప్రతిభ చూపిన అభ్యర్థులకు రాత పరీక్ష ఉంటుంది.
- రాత పరీక్ష ఆబ్జెక్టివ్/సబ్జెక్టివ్ తరహాలో జరుగుతుంది. ఆబ్జెక్టివ్ తరహా ప్రశ్నలకు ఓఎంఆర్ షీట్, సబ్జెక్టివ్ తరహా ప్రశ్నలకు ఆన్సర్ షీట్‌లో సమాధానాలు రాయాల్సి ఉంటుంది.
- రాత పరీక్షలో జనరల్ నాలెడ్జ్, జనరల్ ఇంగ్లిష్/జనరల్ హిందీ, జనరల్ అర్థమెటిక్, అనలిటికల్ అండ్ క్వాంటిటేటివ్ స్కిల్స్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్న పత్రం ఇంగ్లిష్/హిందీలో ఉంటుంది. పరీక్ష వ్యవధి ఆయా ట్రేడును బట్టి గంట నుంచి మూడు గంటల వరకు ఉంటుంది.
- జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూసీ అభ్యర్థులు కనీసం 50శాతం మార్కులు పొందాలి. ఎస్సీ/ఎస్టీలకు 40 శాతం మార్కులు రావాలి.
- రాత పరీక్షలో ప్రతిభ చూపి మెరిట్ లిస్ట్‌లో నిలిచిన వారికి మెడికల్/ఫిట్‌నెస్ టెస్టు నిర్వహిస్తారు. మెడికల్‌గా ఫిట్‌గా ఉన్న అభ్యర్థులను మాత్రమే ఉద్యోగాలకు ఎంపిక చేస్తారు.

## ఆర్‌జీయూకేటీ, బాసరలో గెస్ట్ ఫ్యాకల్టీ

**బా**సర (నిజామాబాద్)లోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్‌జీయూకేటీ)..తాత్కాలిక ప్రాతిపదికన టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.




- **పోస్టుల వివరాలు:** గెస్ట్ ఫ్యాకల్టీ (ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్), గెస్ట్ టెక్నికల్ అసిస్టెంట్, స్టెనోగ్రాఫర్.
- **విభాగాలు:** సివిల్, సీఎస్ఈ, ఈఈఈ, మెకానికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, ఇంగ్లిష్, మేనేజ్‌మెంట్, తెలుగు.
- **అర్హతలు:** డిగ్రీ, ఎంసీఏ, సంబంధిత సబ్జెక్టుల్లో బీటెక్/బీఈ, ఎంటెక్/ఎంఈ ఉత్తీర్ణత, నెట్/స్లెట్/సెట్/పీహెచ్‌డీ.
- **ఎంపిక విధానం:** రాత పరీక్ష, ట్రేడ్ టెస్టు, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక జరుగుతుంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 21.10.2019
- **వెబ్‌సైట్:** http://careers.rgukt.ac.in/jobs/default/index




## ఇండియన్ కోస్ట్‌గార్డ్‌లో నావిక్ పోస్టులు


**భా**రత రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన ఇండియన్ కోస్ట్ గార్డ్... నావిక్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.



- **పోస్టుల వివరాలు:** కుక్, స్టీవార్డ్.
- **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణతతోపాటు నిర్దేశిత శారీరక ప్రమాణాలు తప్పనిసరి. పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులు.
- **వయసు:** 18-22 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక విధానం:** రాత పరీక్ష, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్టు, మెడికల్ టెస్టు ఆధారంగా ఎంపిక జరుగుతుంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం:** 30.10.2019
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 08.11.2019
- **వెబ్‌సైట్:** https://joinindiancoastguard.gov.in

## ఐఐఎస్సీ-సీబీఆర్‌లో ఉద్యోగాలు

**బెం**గళూరులోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సీ)కు చెందిన సెంటర్ ఫర్ బ్రెయిన్ రీసెర్చ్ (సీబీఆర్).. ఒప్పంద ప్రాతిపదికన ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.



- **పోస్టుల వివరాలు:** ప్రాజెక్టు మేనేజర్, పోస్ట్ డాక్టోరల్ ఫెలోస్, సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్, ప్రాజెక్టు అసిస్టెంట్, ల్యాబొరేటరీ టెక్నీషియన్, ఫీల్డ్ డేటా కలెక్టర్స్.
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ, బీఎస్సీ, ఇంజనీరింగ్, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణత.
- **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 30.10.2019
- **ఈమెయిల్:** jobs.cbr[at]iisc.ac.in
- **దరఖాస్తు ఫామ్ కోసం:** https://www.cbr.iisc.ac.in/advertisement/Application_form_recruitment.pdf
- **వెబ్‌సైట్:** http://cbr.iisc.ac.in

## మంగళూర్ రిఫైనరీ అండ్ పెట్రోకెమికల్స్ లిమిటెడ్

**ఓ**ఎన్‌జీసీ (ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్) సబ్సిడరీ సంస్థ.. ప్రభుత్వ రంగ మినీ రత్న కంపెనీ మంగళూర్ రిఫైనరీ అండ్ పెట్రోకెమికల్స్ లిమిటెడ్... వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.



- **మొత్తం ఖాళీల సంఖ్య:** 233
- **పోస్టుల వివరాలు:** సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్-13, జూనియర్ ఆఫీసర్ -అఫీషియల్ లాంగ్వేజ్ ఇంప్లిమెంటేషన్-01, జూనియర్ కెమిస్ట్ ట్రైనీ-06, టెక్నికల్ అసిస్టెంట్ ట్రైనీ (కెమికల్)-113, టెక్నికల్ అసిస్టెంట్ ట్రైనీ (మెకానికల్)-27, టెక్నికల్ అసిస్టెంట్ ట్రైనీ (ఎలక్ట్రికల్)-36, టెక్నికల్ అసిస్టెంట్‌ట్రైనీ (ఇన్‌స్ట్రుమెంటేషన్) -25, డ్రాఫ్ట్స్‌మెన్ ట్రైనీ-01, ట్రైనీ అసిస్టెంట్ (ఫైనాన్స్)-2, ట్రైనీ అసిస్టెంట్ (మెటీరియల్స్) -4, ట్రైనీ అసిస్టెంట్(హిందీ)-4,ట్రైనీ అసిస్టెంట్-1.
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో డిప్లొమా/బీఎస్సీ /బీఏ/బీకామ్ /బీబీఏ/బీబీఎం/బీసీఏ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **ఎంపిక విధానం:** రాత పరీక్ష/స్కిల్ టెస్టు, ఫిజికల్ టెస్టు ఆధారంగా ఎంపిక జరుగుతుంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేది:** 09.11.2019
- **వెబ్‌సైట్:** https://mrpl.co.in

## యూజీసీ-ఐయూఏసీలో ఉద్యోగాలు

**యూ**నివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ)కు చెందిన ఢిల్లీలోని ఇంటర్ యూనివర్సిటీ ఆక్సిలరేటర్ సెంటర్ (ఐయూఏసీ) ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 07
- **పోస్టుల వివరాలు:** మల్టీ టాస్కింగ్ స్టాఫ్-03, లోయర్ డివిజన్ క్లర్క్-02, అసిస్టెంట్-01, సీనియర్ అసిస్టెంట్-01.
- **అర్హత:** డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- **ఎంపిక విధానం:** రాత పరీక్ష/స్కిల్ టెస్టు ఆధారంగా ఎంపిక జరుగుతుంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేది:** 28.10.2019
- **వెబ్‌సైట్:** http://iuac.res.in

## ఐఓసీఎల్‌లో నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

**ప్ర**భుత్వ రంగ సంస్థ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్), గుజరాత్ రిఫైనరీ... ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

IndianOil
INDIAN OIL CORPORATION LTD

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 38
- **పోస్టుల వివరాలు:** జూనియర్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ (ప్రొడక్షన్)
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టులో డిప్లొమా (ఇంజనీరింగ్)/బీఎస్సీ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **వయసు:** 18-26 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక విధానం:** రాత పరీక్ష, స్కిల్/ప్రొఫిషియెన్సీ/ఫిజికల్ టెస్టు ఆధారంగా ఎంపిక జరుగుతుంది.
- **పరీక్ష తేది:** 10.11.2019
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేది:** 30.10.2019
- **వెబ్‌సైట్:** www.iocl.com

## ఐజీఎన్‌సీఏలో ఉద్యోగాలు

**కేం**ద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ పరిధిలోని స్వయం ప్రతిపత్తి సంస్థ ఇందిరా గాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ద ఆర్ట్స్ (ఐజీఎన్‌సీఏ).. ఒప్పంద ప్రాతిపదికన ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 05
- **పోస్టుల వివరాలు:** ప్రాజెక్టు అసిస్టెంట్-02, గ్రాఫిక్ డిజైనర్-01, ఆఫీస్ అసిస్టెంట్-02.
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ, పీజీ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **వయసు:** 30 ఏళ్లు మించరాదు.
- **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక జరుగుతుంది.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేది:** 28.10.2019
- **వెబ్‌సైట్:** http://ignca.gov.in

## కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్

**ప్ర**భుత్వ రంగ సంస్థ మినీ రత్న కంపెనీ కొచ్చిలోని కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్... ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.



- **మొత్తం పోస్టుల సంఖ్య:** 16
- **పోస్టుల వివరాలు:** జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్.
- **విభాగాలు:** మెకానికల్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, సేఫ్టీ.
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో డిప్లొమా (ఇంజనీరింగ్) ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **వయసు:** 08.11.2019 నాటికి 35 ఏళ్లకు మించరాదు.
- **ఎంపిక విధానం:** ఆబ్జెక్టివ్ టెస్ట్, డిస్క్రిప్టివ్ టెస్ట్ ఆధారంగా ఎంపిక జరుగుతుంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 08.11.2019
- **వెబ్‌సైట్:** https://cochinshipyard.com

## హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్

**కో**ల్‌కతాలోని హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 05
- **పోస్టుల వివరాలు:** హిందీ ట్రాన్స్‌లేటర్-02, స్టెనోగ్రాఫర్-03.
- **అర్హత:** డిగ్రీ, సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ ఉత్తీర్ణత, టైపింగ్ స్కిల్స్ ఉండాలి.
- **ఎంపిక విధానం:** రాత పరీక్ష, స్కిల్ టెస్టు ఆధారంగా ఎంపిక జరుగుతుంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 08.11.2019
- **వెబ్‌సైట్:** www.hindustancopper.com




## నిట్ రాయ్‌పూర్‌లో టీచింగ్ పోస్టులు

**రా**య్‌పూర్ (చత్తీస్‌గఢ్)లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్).. టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 63
- **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్-10, అసోసియేట్ ప్రొఫెసర్-16, అసిస్టెంట్ ప్రొఫెసర్-37.
- **విభాగాలు:** అప్లయిడ్ జియాలజీ, ఆర్కిటెక్చర్, బయోమెడికల్ ఇంజనీరింగ్, బయోటెక్నాలజీ, కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, సివిల్ ఇంజనీరింగ్, సీఎస్ఈ, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఈసీఈ, హుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మ్యాథమెటిక్స్, ఎంసీఏ, మెకానికల్ ఇంజనీరింగ్.
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ/బీటెక్/ఎంఈ /ఎంటెక్, పీహెచ్‌డీ ఉత్తీర్ణత, టీచింగ్ అనుభవం ఉండాలి.
- **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, ప్రజంటేషన్/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక జరుగుతుంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది:** 15.11.2019
- **వెబ్‌సైట్:** http:// www.nitrr.ac.in%5crecruitment_rules/

## నైపర్ అహ్మదాబాద్‌లో నాన్ టీచింగ్ పోస్టులు

**అ**హ్మదాబాద్ (గుజరాత్)లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (నైపర్)... నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.




- **మొత్తం పోస్టుల సంఖ్య:** 06
- **పోస్టుల వివరాలు:** లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్, ఎస్టేట్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్, మెడికల్ ఆఫీసర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, సెక్రటరీ, సూపర్ వైజర్.
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ, ఎంబీబీఎస్ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **ఎంపిక విధానం:** టెస్ట్/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక జరుగుతుంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 07.11.2019
- **వెబ్‌సైట్:** https://niperarecruitments.in

## షిప్పింగ్ కార్పొరేషన్

**ప్ర**భుత్వ రంగ సంస్థ నవరత్న కంపెనీ షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌సీఐ) లిమిటెడ్... ట్రైనీ ఎలక్ట్రోటెక్నికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.



- **పోస్టుల వివరాలు:** ట్రైనీ ఎలక్ట్రోటెక్నికల్ ఆఫీసర్
- **కోర్సు:** ఎంపికైన అభ్యర్థులకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ నిబంధనల ప్రకారం-ముంబైలోని ఎస్‌సీఐ మారిటైం ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో నాలుగు నెలల ప్రి సీ ట్రైనింగ్ కోర్సులో శిక్షణ ఇస్తారు. అనంతరం ట్రైనీ ఎలక్ట్రో టెక్నికల్ ఆఫీసర్‌గా ఎనిమిది నెలల షిప్‌బోర్డ్ శిక్షణ అందిస్తారు.
- **అర్హత:** సంబంధిత బ్రాంచ్‌లో ఇంజనీరింగ్ డిప్లొమా/బీఈ/బీటెక్ ఉత్తీర్ణత ఉండాలి.
- **వయసు:** 30 ఏళ్లకు మించరాదు.
- **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ ఎగ్జామ్, పర్సనల్ ఇంటర్వ్యూ, మెడికల్ ఫిట్‌నెస్ టెస్టు ఆధారంగా ఎంపిక జరుగుతుంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం:** 18.10.2019
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 18.11.2019
- **వెబ్‌సైట్:** http://www.mti.shipindia.com

## న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా

**కేం**ద్ర ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీకి చెందిన ప్రముఖ ప్రభుత్వ రంగ సంస్థ న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐఎల్),రావత్‌బట్టా (రాజస్థాన్)... ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 107
- **పోస్టుల వివరాలు:** నర్సు, పాథాలజీ ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్ట్, ఎక్సరే టెక్నీషియన్, అసిస్టెంట్ గ్రేడ్-1, స్టెనో గ్రేడ్-1, డ్రైవర్ కమ్ పంప్ ఆపరేటర్ కమ్ ఫైర్‌మెన్.
- **వయసు:** ఆయా పోస్టును బట్టి 18-30 ఏళ్ల మధ్య ఉండాలి.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** 17.10.2019
- **దరఖాస్తులకు చివరితేది:** 06.11.2019
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://npcilcareers.co.in/MainSite/default.aspx

## యూపీఎస్సీ జాబ్స్

ఢిల్లీలోని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ)... ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 88
- **పోస్టుల వివరాలు:** బోటనిస్ట్-13, లీగల్ ఆఫీసర్ -06, జూనియర్ అసిస్టెంట్ డైరెక్టర్-13, స్పెషలిస్ట్ గ్రేడ్ 3-56.
- **విభాగాలు:** అనస్థీషియా, బయోకెమిస్ట్రీ, కార్డియాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ మొదలైనవి.
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ/బీటెక్, పీజీ, ఎంబీబీఎస్/పీజీ డిగ్రీ/ ఎండీ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **వయసు:** 30-45 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక విధానం:** రిక్రూట్‌మెంట్ టెస్టు, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక జరుగుతుంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 31.10.2019
- **వెబ్‌సైట్:** www.upsc.gov.in

## సౌత్ సెంట్రల్ రైల్వేలో... స్పోర్ట్స్ కోటా పోస్టులు

**సౌ**త్ సెంట్రల్ రైల్వే (సికింద్రాబాద్).. 2019-20 సంవత్సరానికి స్కౌట్స్ అండ్ గైడ్స్ కోటాలో పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.



- **మొత్తం పోస్టుల సంఖ్య:** 14
- **పోస్టుల వివరాలు:** లెవెల్ 2 పోస్టులు-02, లెవెల్ 1 పోస్టులు- 12.
- **అర్హత:** పదో తరగతితోపాటు ఐటీఐ/ఎన్ఏసీ, ఇంటర్ ఉత్తీర్ణత; నిర్దేశించిన స్కౌట్స్ అండ్ గైడ్స్ అర్హతలు ఉండాలి.
- **వయసు:** 01.01.2020 నాటికి లెవెల్ 2 పోస్టులకు 18-30 ఏళ్ల మధ్య; లెవెల్ 1 పోస్టులకు 18 -33 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** రాత పరీక్ష, స్కౌట్స్ సర్టిఫికెట్ ఆధారంగా ఎంపిక జరుగుతుంది.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 11.11.2019
- **వెబ్‌సైట్:** https://scr.indianrailways.gov.in

## ఎన్‌ఐపీహెచ్‌టీఆర్‌లో కన్సల్టెంట్ ఉద్యోగాలు

**కేం**ద్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖకు చెందిన ముంబైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ (ఎన్‌ఐపీహెచ్‌టీఆర్).. ఒప్పంద ప్రాతిపదికన ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 05
- **పోస్టుల వివరాలు:** కన్సల్టెంట్- పబ్లిక్ హెల్త్: 01, కన్సల్టెంట్-ఐఈసీ: 01, కన్సల్టెంట్-ట్రెనింగ్: 01, స్టాటిస్టికల్ ఆఫీసర్-01, సోషియాలజిస్ట్: 01.
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో డిప్లొమా, పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేది:** 31.10.2019
- **వెబ్‌సైట్:** https://fwtrc.gov.in

## నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్

**ప్ర**భుత్వ రంగ సంస్థ మినీ రత్న కంపెనీ... నోయిడా (ఉత్తర ప్రదేశ్)లోని నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్.. ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 24
- **పోస్టుల వివరాలు:** సీనియర్ కెమిస్ట్-06, మేనేజర్-02, సీనియర్ మేనేజర్-03, ట్రాన్స్‌పోర్టేషన్ ఆఫీసర్-05, మెడికల్ ఆఫీసర్-08.
- **అర్హత:** ఇంజనీరింగ్ డిగ్రీ, ఎంఎస్సీ (కెమిస్ట్రీ), ఎంబీబీఎస్ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **ఎంపిక విధానం:** షార్ట్ లిస్టింగ్, ఆన్‌లైన్ టెస్టు, పర్సనల్‌ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక జరుగుతుంది.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేది:** 09.11.2019
- **వెబ్‌సైట్:** www.nationalfertilizers.com

# సాక్షి స్పోర్ట్స్

బుధవారం
16-10-2019

## నాకౌట్లోనూ మన రాత మారాలి: గంగూలీ

ఐసీసీ మెగా టోర్నీల్లో నాకౌట్ దశలో టీమిండియా వైఫల్యాల రాత మారాలని మాజీ కెప్టెన్ గంగూలీ అన్నాడు. బీసీసీఐ కాబోయే అధ్యక్షుడు 'దాదా' మాట్లాడుతూ 'భారత్ మేటి జట్టు. కానీ కొన్నాళ్లుగా పెద్ద టోర్నీల్లో గెలవలేకపోయింది. జట్టు బాగా ఆడుతున్నప్పటికీ సెమీస్, ఫైనల్స్‌లలో మాత్రం ఓడిపోతోంది. దీన్ని విరాట్ కోహ్లి మారుస్తాడని ఆశిస్తున్నా. అతనో చాంపియన్ క్రికెటర్' అని అన్నాడు. 2013 చాంపియన్స్ ట్రోఫీ విజయం తర్వాత భారత్ ఐసీసీ ఈవెంట్లలో నిరాశపరిచింది. 2017 చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో ఓడింది. అంతకుముందు ఏడాది భారత్‌లోనే జరిగిన టి20 ప్రపంచకప్ (2016)లో, ఇంగ్లండ్‌లో ఈ ఏడాది జరిగిన వన్డే ప్రపంచకప్‌లో సెమీస్‌లో ఓడింది.



# శభాష్ సాయిప్రణీత్

ఇటీవల ప్రపంచ చాంపియన్‌షిప్‌లో తాను సాధించిన కాంస్య పతకం గాలివాటంగా వచ్చినది కాదని తెలుగు తేజం, భారత బ్యాడ్మింటన్ అగ్రశ్రేణి ఆటగాడు భమిడిపాటి సాయిప్రణీత్ నిరూపించాడు. తనదైన రోజున ఎంతటి మేటి క్రీడాకారులనైనా బోల్తా కొట్టిస్తానని ఈ హైదరాబాద్ ప్లేయర్ మరోసారి రుజువు చేశాడు. మంగళవారం ఆరంభమైన డెన్మార్క్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 టోర్నమెంట్‌లో సాయిప్రణీత్ తొలి రౌండ్‌లో పెను సంచలనం సృష్టించాడు. రెండు సార్లు ఒలింపిక్ చాంపియన్‌గా, ఐదుసార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన చైనా దిగ్గజం లిన్ డాన్‌ను వరుస గేముల్లో ఓడించి సాయిప్రణీత్ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు.

- చైనా దిగ్గజం లిన్ డాన్‌పై అద్భుత విజయం
- ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశం • సింధు శుభారంభం
- తొలి రౌండ్‌లోనే ఓడిన కశ్యప్, సౌరభ్ వర్మ
- డెన్మార్క్ ఓపెన్ టోర్నీ

**ఒడెన్స్ (డెన్మార్క్):** ఈ ఏడాది లోటుగా ఉన్న వరల్డ్ టూర్ టైటిల్‌ను సాధించాలనే లక్ష్యంతో... డెన్మార్క్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 టోర్నీలో బరిలోకి దిగిన ప్రపంచ చాంపియన్ పీవీ సింధు... ప్రపంచ చాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత సాయిప్రణీత్ శుభారంభం చేశారు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 12వ ర్యాంకర్ సాయిప్రణీత్ 36 నిమిషాల్లో 21-14, 21-17తో ప్రపంచ 18వ ర్యాంకర్, మాజీ నంబర్‌వన్, 36 ఏళ్ల లిన్ డాన్ (చైనా)పై... మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ఐదో సీడ్ సింధు 38 నిమిషాల్లో 22-20, 21-18తో ప్రపంచ జూనియర్ మాజీ చాంపియన్ గ్రెగోరియా మరిస్కా టున్‌జుంగ్ (ఇండోనేసియా)పై విజయం సాధించారు. గురువారం జరిగే ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో ఆన్ సె యంగ్ (దక్షిణ కొరియా)తో సింధు ఆడనుండగా... ప్రపంచ చాంపియన్, వరల్డ్ నంబర్‌వన్ కెంటో మొమోటా (జపాన్), వోంగ్ వింగ్ కి విన్సెంట్ (హాంకాంగ్) మధ్య జరిగే తొలి రౌండ్ మ్యాచ్ విజేతతో సాయిప్రణీత్ తలపడతాడు.

గతంలో లిన్ డాన్‌తో ఆడిన రెండు మ్యాచ్‌ల్లో ఓటమి పాలైన సాయిప్రణీత్ ఈసారి మాత్రం అదరగొట్టాడు. ఆరంభం నుంచే దూకుడుగా ఆడుతూ, నిలకడగా పాయింట్లు సాధించాడు. మొదట్లో 3-0తో ఆధిక్యం సంపాదించిన సాయిప్రణీత్ ఆ తర్వాత ఈ ఆధిక్యాన్ని కొనసాగించి తొలి గేమ్‌ను సొంతం చేసుకున్నాడు. రెండో గేమ్‌లో ఇద్దరూ ప్రతీ పాయింట్ కోసం తీవ్రంగా పోరాడారు. 16-16తో స్కోరు సమంగా ఉన్నదశలో సాయిప్రణీత్ రెండు పాయింట్లు సాధించి 18-16తో ముందంజ వేశాడు. ఆ తర్వాత లిన్ డాన్ ఒక పాయింట్ నెగ్గగా... ఆ వెంటనే సాయిప్రణీత్ వరుసగా మూడు పాయింట్లు గెలిచి చైనా స్టార్ ప్లేయర్ ఓటమిని ఖాయం చేశాడు.

పురుషుల సింగిల్స్ విభాగంలో బరిలోకి దిగిన భారత ఆటగాళ్లు పారుపల్లి కశ్యప్, సౌరభ్ వర్మ పోరాటం తొలి రౌండ్‌లోనే ముగిసింది. ప్రపంచ 25వ ర్యాంకర్ కశ్యప్ 13-21, 12-21తో సితికోమ్ తమాసిన్ (థాయ్‌లాండ్) చేతిలో... సౌరభ్ వర్మ 21-19, 11-21, 17-21తో మార్క్ కాల్జు (నెదర్లాండ్స్) చేతిలో ఓడిపోయారు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) ద్వయం 24-22, 21-11తో కిమ్ జి జంగ్-లీ యోంగ్ డే (దక్షిణ కొరియా) జోడీపై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరింది. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో నేలకుర్తి సిక్కి రెడ్డి-అశ్విని పొన్నప్ప (భారత్) జంట 23-25, 18-21తో టాప్ సీడ్ మాయు మత్సుమోతో-వకానా నాగాహార (జపాన్) జోడీ చేతిలో ఓడిపోయింది.

నేడు జరిగే పురుషుల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో నాలుగో సీడ్ ఆంటోన్సెన్ (డెన్మార్క్)తో కిడాంబి శ్రీకాంత్; కాంటా సునెయామ (జపాన్)తో సమీర్ వర్మ; మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో సయాక తకహాషి (జపాన్)తో సైనా నెహ్వాల్ తలపడతారు. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో మార్విన్ సిడెల్-లిండా ఎఫ్లెర్ (జర్మనీ)లతో సిక్కి రెడ్డి-ప్రణవ్ చోప్రా; వాంగ్ యిలియు-హువాంగ్ డాంగ్ పింగ్ (చైనా)లతో సాత్విక్ సాయిరాజ్-అశ్విని పొన్నప్ప పోటీపడతారు.



లిన్ డాన్



సాయిప్రణీత్

**4** చైనా దిగ్గజం లిన్ డాన్‌ను కనీసం ఒక్కసారి ఓడించిన నాలుగో భారత ప్లేయర్ సాయిప్రణీత్. గతంలో హెచ్‌ఎస్ ప్రణయ్ మూడుసార్లు లిన్ డాన్‌పై నెగ్గగా... పుల్లెల గోపీచంద్ రెండుసార్లు (2002లో) ఓడించగా... శ్రీకాంత్ (2014లో) ఒక్కసారి గెలిచాడు.

**1** ప్రపంచ మాజీ చాంపియన్స్ లేదా ఒలింపిక్ మెడలిస్ట్‌లైన ఆరుగురు ఆటగాళ్లను (తౌఫిక్ హిదాయత్-ఇండోనేసియా; లీ చోంగ్ వీ-మలేసియా; చెన్ లాంగ్-చైనా; విక్టర్ అక్సెల్‌సన్-డెన్మార్క్; కెంటో మొమోటా-జపాన్; లిన్ డాన్-చైనా) కనీసం ఒక్కసారైనా ఓడించిన ఏకైక భారత క్రీడాకారుడు సాయిప్రణీత్.

## 'డ్రా'తో గట్టెక్కాం

- బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌ను 1-1తో 'డ్రా' చేసుకున్న భారత్
- టీమిండియాను ఆదుకున్న ఆదిల్ ఖాన్



ఆదిల్

**కోల్‌కతా:** బోణీ ఖాయం అనుకుంటే... ఓటమి ఎదురయ్యేలా కనిపించింది. బంగ్లాదేశ్‌ను బలహీనమైన ప్రత్యర్థిగా భావించిన భారత్ చివరి నిమిషాల్లో గట్టెక్కింది. ఓటమి అంచు వరకు వెళ్లినా... చివర్లో ఆదిల్ ఖాన్ గోల్‌తో భారత్ ఊపిరి పీల్చుకుంది. సొంత మైదానం... సొంత ప్రేక్షకులు... ఎదురుగా బలహీన ప్రత్యర్థి అయినా 2022 ప్రపంచకప్ ఫుట్‌బాల్ ఆసియా జోన్ క్వాలిఫయింగ్ మ్యాచ్‌లో భారత్ తడబడింది. గెలుపు ఖాయం అనుకున్న చోట 'డ్రా'తో సరిపెట్టుకుంది. మరో రెండు నిమిషాల్లో మ్యాచ్ ముగుస్తుందనగా ఆదిల్ ఖాన్ (88వ నిమిషంలో) హెడర్‌తో గోల్ చేసి భారత్‌కు పరాభవాన్ని తప్పించాడు. ఇక్కడి సాల్ట్‌లేక్ స్టేడియంలో బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌ను టీమిండియా 1-1తో 'డ్రా' చేసుకొని ఒక పాయింట్ సంపాదించింది. బంగ్లాదేశ్ తరఫున సాద్ ఉద్దీన్ (42వ నిమిషంలో) గోల్ చేశాడు. ఈ మ్యాచ్‌లో భారత ఆటగాళ్ల సమన్వయ లోపం అడుగడుగునా కొట్టొచ్చినట్టు కనిపించింది. అంతే కాకుండా అందివచ్చిన అవకాశాలను జారవిడవడం... దురదృష్టం కూడా తోడవడంతో పలుసార్లు గోల్ చేసే అవకాశాలను భారత్ కోల్పోయింది.

# రొనాల్డో @700



- కెరీర్‌లో 700 గోల్స్ సాధించిన పోర్చుగల్ ఫుట్‌బాల్ జట్టు కెప్టెన్
- ఉక్రెయిన్‌తో 'యూరో' క్వాలిఫయింగ్ మ్యాచ్‌లో ఘనత

**కీవ్ (ఉక్రెయిన్):** విఖ్యాత ఫుట్‌బాల్ ప్లేయర్ క్రిస్టియానో రొనాల్డో (పోర్చుగల్) గొప్ప ఘనత సాధించాడు. తన కెరీర్‌లో 700 గోల్స్ పూర్తి చేసుకున్నాడు. ఈ ఘనత సాధించిన ఆరో ప్లేయర్‌గా గుర్తింపు పొందాడు. యూరో-2020 క్వాలిఫయింగ్ మ్యాచ్‌లో భాగంగా మంగళవారం ఉక్రెయిన్‌తో జరిగిన మ్యాచ్‌లో 72వ నిమిషంలో లభించిన పెనాల్టీని రొనాల్డో లక్ష్యానికి చేర్చి ఈ మైలురాయిని అందుకున్నాడు. వ్యక్తిగతంగా రొనాల్డోకు ఈ మ్యాచ్ చిరస్మరణీయమైనా... కెప్టెన్‌గా తుది ఫలితం నిరాశపరిచింది. ఈ మ్యాచ్‌లో ఉక్రెయిన్ 2-1తో రొనాల్డో బృందాన్ని ఓడించింది. ఉక్రెయిన్ తరఫున యారెమ్‌చుక్ (6వ ని.లో), యార్మోలెంకో (27వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. ఈ విజయంతో ఉక్రెయిన్ 19 పాయింట్లతో గ్రూప్ 'బి'లో అగ్రస్థానం సంపాదించి వచ్చే ఏడాది జూన్-జూలైలలో జరిగే యూరో ప్రధాన టోర్నమెంట్‌కు అర్హత సాధించింది. ఇదే గ్రూప్‌లో పోర్చుగల్ 11 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. గ్రూప్‌లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు ప్రధాన టోర్నీకి అర్హత సాధిస్తాయి. పోర్చుగల్‌కు మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉన్న నేపథ్యంలో ఆ జట్టుకు అవకాశాలు సజీవంగా ఉన్నాయి. 2002లో స్పోర్టింగ్ లిస్బన్ క్లబ్ తరఫున సీనియర్ స్థాయిలో కెరీర్ మొదలుపెట్టిన 34 ఏళ్ల రొనాల్డో ప్రస్తుతం ప్రొఫెషనల్ లీగ్స్‌లో ఇటలీకి చెందిన యువెంటాస్ క్లబ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. 2003 నుంచి పోర్చుగల్ జాతీయ జట్టు సభ్యుడిగా ఉన్న రొనాల్డో తన దేశం తరఫున 95 గోల్స్ చేశాడు. మిగతా అన్ని గోల్స్ ప్రొఫెషనల్ లీగ్స్‌లో చేశాడు. అంతర్జాతీయ కెరీర్‌లో (దేశం తరఫున) అత్యధిక గోల్స్ చేసిన రికార్డు ఇరాన్ ప్లేయర్ అలీ దాయ్ (109 గోల్స్) పేరిట ఉంది. అలీ దాయ్ ఆరేళ్ల క్రితమే ఫుట్‌బాల్‌కు వీడ్కోలు పలికాడు.

**974** ఇప్పటివరకు రొనాల్డో తన 17 ఏళ్ల కెరీర్‌లో ఆడిన మ్యాచ్‌ల సంఖ్య.

**6** కెరీర్‌లో 700 గోల్స్ పూర్తి చేసుకున్న ఆరో ప్లేయర్ రొనాల్డో. ఈ జాబితాలో జోసెఫ్ బికాన్ (చెక్ రిపబ్లిక్/ఆస్ట్రియా-805 గోల్స్), రొమారియో (బ్రెజిల్-772 గోల్స్), పీలే (బ్రెజిల్-767), పుస్కాస్ (హంగేరి-746), గెర్డ్ ముల్లర్ (జర్మనీ-735 గోల్స్) ముందున్నారు.

### ఏ జట్టు తరఫున ఎన్నెన్ని...

| జట్టు | మ్యాచ్‌లు | గోల్స్ |
|---|---|---|
| స్పోర్టింగ్ లిస్బన్ (2002-03) | 31 | 5 |
| మాంచెస్టర్ యునైటెడ్ (2003-09) | 292 | 118 |
| రియల్ మాడ్రిడ్ (2009-18) | 438 | 450 |
| యువెంటాస్ (2018 నుంచి) | 51 | 32 |
| పోర్చుగల్ (2003 నుంచి) | 162 | 95 |

## 'దాదా' నేతృత్వంలో భారత క్రికెట్ ముందుకెళ్తుంది

### వీవీఎస్ లక్ష్మణ్ ఆశాభావం

**న్యూఢిల్లీ:** భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అధ్యక్షుడిగా ఖాయమైన దిగ్గజ మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీకి బ్యాటింగ్ లెజెండ్ వీవీఎస్ లక్ష్మణ్ శుభాకాంక్షలు తెలిపాడు. గంగూలీ సారథ్యంలో ఇకపై భారత క్రికెట్ ముందడుగు వేస్తుందని వీవీఎస్ ట్వీట్ చేశాడు. అధ్యక్ష స్థానానికి 'దాదా' ఒక్కడే నామినేషన్ వేయడంతో ఈ నెల 23న జరిగే బీసీసీఐ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం)లో 47 ఏళ్ల సౌరవ్ ఎన్నిక లాంఛనమే కానుంది. 'త్వరలో నూతన అధ్యక్షుడిగా ఎన్నిక కాబోతున్న సౌరవ్ గూంగులీకి అభినందనలు. నీ సమర్థ సారథ్యంలో భారత క్రికెట్ సుసంపన్నమవుతుంది. ఇందులో నాకెలాంటి సందేహం లేదు. నాడు భారత కెప్టెన్‌గా విజయవంతమైనట్లే ఇప్పుడీ పాత్రలోనూ దాదా విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నా' అని లక్ష్మణ్ ట్వీట్ చేశాడు. దీనిపై గంగూలీ స్పందిస్తూ 'థ్యాంక్యూ వీవీఎస్. నా ప్రయాణంలో నీ సేవలు, అమూల్యమైన సూచనలు నాకు అవసరం' అని ట్విట్టర్ వేదికగా అన్నాడు. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్, మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ కూడా 'దాదా'ను అభినందించారు. అయితే లోధా కమిటీ సిఫార్సు అయిన 'పదవుల మధ్య తప్పనిసరి విరామం' నిబంధన ప్రకారం గంగూలీ పట్టుమని పది నెలలైనా అధ్యక్ష పదవిలో ఉండడు. రాష్ట్ర, జాతీయ క్రికెట్ సంఘాల్లో వరుసగా ఆరేళ్లు పదవిలో ఉన్న వారు తప్పని సరిగా మూడేళ్లు క్రికెట్ కార్యకలాపాల నుంచి విరామం తీసుకోవాలి. బెంగాల్ క్రికెట్ సంఘంలో ఐదేళ్లుగా పదవులు అనుభవించిన గంగూలీ వచ్చే జూలై వరకే బోర్డు అధ్యక్షుడిగా ఉంటాడు.



## స్మృతి మంధాన... టాప్ ర్యాంక్ చేజారె



**దుబాయ్:** అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తాజాగా ప్రకటించిన మహిళల వ్యక్తిగత వన్డే ర్యాంకింగ్స్‌లో భారత్‌కు నిరాశ ఎదురైంది. 'టాప్'లో ఉన్న స్మృతి మంధాన రెండో స్థానానికి పడిపోయింది. దక్షిణాఫ్రికాతో సోమవారం ముగిసిన వన్డే సిరీస్‌కు గాయం కారణంగా దూరమవ్వడం ఆమె వ్యక్తిగత ర్యాంకింగ్‌పై ప్రభావం చూపింది. ప్రస్తుతం స్మృతి 755 రేటింగ్ పాయింట్లతో రెండో స్థానంలో ఉండగా... 759 పాయింట్లతో న్యూజిలాండ్ ప్లేయర్ అమీ సాటర్త్‌వెయిట్ మొదటి ర్యాంక్‌కు ఎగబాకింది. క్రికెట్ కెరీర్‌లో 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సారథి మిథాలీ రాజ్ ఒక స్థానాన్ని కోల్పోయి ఏడో ర్యాంక్‌కు పరిమితం కాగా... టి20 కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఒక స్థానాన్ని మెరుగుపర్చుకొని 17వ స్థానంలో నిలిచింది. బౌలింగ్‌లో జులన్ గోస్వామి, శిఖా పాండే, పూనమ్ యాదవ్‌లు ర్యాంకింగ్స్‌లో కిందికి పడిపోయి వరుసగా 6, 8, 9వ స్థానాల్లో నిలిచారు. ఆల్‌రౌండర్ విభాగంలో దీప్తి శర్మ మూడో స్థానానికి పడిపోగా... శిఖా పాండే (10వ ర్యాంకు) తొలిసారి టాప్-10లో స్థానం దక్కించుకుంది.

## భారత్‌కు తొలి పరాజయం



**జొహర్ బారు (మలేసియా):** సుల్తాన్ జొహర్ కప్ అంతర్జాతీయ జూనియర్ హాకీ టోర్నమెంట్‌లో భారత్‌కు తొలి ఓటమి ఎదురైంది. జపాన్‌తో మంగళవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో భారత్ 3-4 గోల్స్ తేడాతో ఓడిపోయింది. భారత్ తరఫున గుర్‌సాహిబ్జిత్ సింగ్ (31వ ని.లో), శ్రద్ధానంద్ తివారి (38వ ని.లో), ప్రతాప్ లాక్రా (53వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. నేడు జరిగే నాలుగో లీగ్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియాతో భారత్ తలపడుతుంది. ఆరు జట్ల మధ్య జరుగుతున్న ఈ టోర్నీలో భారత్ తమ తొలి రెండు మ్యాచ్‌ల్లో 4-2తో మలేసియాపై, 8-2తో న్యూజిలాండ్‌పై గెలిచింది.


**ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ & ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్**
ప్లాట్ నం.9, సర్వే నం.49, IT పార్క్, మంగళగిరి-522503, గుంటూరు జిల్లా.
అమరావతి రీజియన్, ఆంధ్రప్రదేశ్
ఇ-మెయిల్: ce.aphmhidc@gmail.com
టెండరు ప్రకటన నం.4/APMSIDC/2019-20, తేది: 14.10.2019
దిగువ తెలిపిన పనుల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం ద్వారా టెండర్లు కోరబడుచున్నవి. **1) సివిల్ పనులు:-** పనుల సంఖ్య: 18, పనుల సుమారు విలువ: రూ.4625.67 లక్షలు. **2) ఎలక్ట్రికల్ పనులు:-** పనుల సంఖ్య: 1, పని సుమారు విలువ: రూ.37.00 లక్షలు. ఇతర వివరాలను వెబ్‌సైట్ http://msidc.ap.nic.in లో చూడవచ్చును.
సం/- మేనేజింగ్ డైరెక్టర్
DIPR Ro No.177PP/CL/Advt/1/1/2019-20, Dt: 15.10.2019



**प्रतिभूति मुद्रणालय / SECURITY PRINTING PRESS**
(भारत प्रतिभूति मुद्रण तथा मुद्रा निर्माण निगम लिमिटेड की इकाई/
A Unit of Security Printing & Minting Corporation of India Ltd.)
भारत सरकार के पूर्ण स्वामित्वाधीन / Wholly owned by Govt.of India
टकसाल कंपाउण्ड / सैफाबाद / Mint Compound : Saifabad हैदराबाद / HYDERABAD-500063
CIN – U22213 DL 2006 GOI144763 GSTIN : 36AAJCS6111J1Z9
दूरभाष/ Ph: +91-40-23253621 फैक्स/Fax : + 91-40-23456687 ई-मेल/email : spp.hyd@spmcil.com
No. SPPH/A-II/Adv/2019/3497 Date: 16-10-2019
मुहरबंद निविदाएं निम्न लिखित माल की आपूर्ति के लिए पात्र और योग्य निविदा कर्ताओं से आमंत्रित किये जाते हैं:
Sealed tenders are invited from eligible and qualified tenderers for supply of following:
निविदा आमंत्रण सूचना / Notice Inviting Tender (NIT)

| क्र.सं. Sl. No. | माल / सेवाएँ का संक्षिप्त विवरण Brief Description of Goods / Services | निविदा सं. Tender No. | मात्रा Quantity | निविदाओं की प्राप्ति के लिए तारीख और बंद करने का समय Closing Date and Time (IST) for Receipt of Tenders |
|---|---|---|---|---|
| 1 | General Purpose Electrical Automation Spares | 6000013824 | 30 Items | 19-11-2019 at 10:45 AM |
| 2 | ID Card Printer Dual Side with Accessories | 6000013899 | 01 No | |
| 3 | Supply, Installation, Testing & Commissioning of Air Handling Unit (AHU) 40 TR and Accessories | 6000013897 | 02 Nos | |
| 4 | Hiring of an Agency for Publishing of Tenders in News Papers | 6000013724 | 01 Year | |
| 5 | Blue Wove Paper (Global Development Tender) | 6000013850 | 25 MT | 03-12-2019 at 10:45 AM |

आगे विवरण हेतु, कृपया हमारा वेबसाइट http://spphyderabad.spmcil.com देखें और कोई संशोधन/शुद्धि-पत्र वेबसाइट पर ही प्रकाशित किया जाएगा/
For further details, please visit our website at http://spphyderabad.spmcil.com & any amendment / corrigendum will be published on website only.
हस्ता /Sd/ - Manager (TO) & CPSO (कृते महाप्रबंधक/ for General Manager)



తెలంగాణ ప్రభుత్వం
**పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ శాఖ కార్యాలయం**
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
NIT No. 409 to 442/2019-20 తేది:14.10.2019
పనుల సంఖ్య (34). **పని పేరు:** నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలలో కమ్యూనిటీ హాళ్ళు, గ్రామ పంచాయతీ భవనములు, లైబ్రరీ భవనము, ఫంక్షన్ హాల్ & 2BHK అర్బన్ ఇళ్ళ నిర్మాణము చేపట్టుటకు దిగువ సంతకందారుచే టెండర్లు కోరబడుచున్నవి. **మొత్తం ECV: రూ. 3874.40 లక్షలు.** టెండరు షెడ్యూళ్ళను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ సైట్ నుండి 17.10.2019, ఉ. 10.30 గం. నుండి అప్‌లోడ్ చేయవచ్చును. ఆన్‌లైన్ టెండర్ల దాఖలుకు ఆఖరు తేది: 24.10.2019 మ. 3.00 గం. వరకు. తదుపరి వివరాలు మరియు సవరణను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ www.tender.telangana.gov.in నుండి పొందవచ్చును లేదా సంప్రదించండి 08462-239502
సం/- రీజినల్ ఆఫీసర్, P.R. రీజియన్, నిజామాబాద్
DIPR RO. No.1382-DP/CL/ADVT/1/2019-20, Dt: 15.10.2019



తెలంగాణ ప్రభుత్వం
**రహదారులు & భవనముల శాఖ**
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
NIT No. 3215/NZB/DCE(R)/EE-R/DEE-7/AEE-1/2019-20 తేది:14.10.2019
నిజామాబాద్ జిల్లాలో నాన్-ప్లాన్ నిధుల క్రింద రోడ్ పని కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరుదారులు టెండరు షెడ్యూళ్లను ఇ-మార్కెట్ ప్లేస్ అనగా tender.telangana.gov.in నుండి 18-10-2019 సా.4.00 గం. నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. టెండర్ల స్వీకరణకు ఆఖరు తేది: 26-10-2019, సా. 4.00గం. వరకు. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా tender.telangana.gov.in లో చూడవచ్చును.
సం/- ఇంజినీర్-ఇన్-చీఫ్ (R&B), స్టేట్ రోడ్స్ & CRN తరఫున
DIPR RO. No.1381-DP/CL/ADVT/1/2019-20, Dt: 15.10.2019



భారత ప్రభుత్వం
**అణుశక్తి శాఖ**
**న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్**
ఎఫ్లూయంట్ మేనేజ్‌మెంట్
ECIL పోస్ట్, హైదరాబాద్-500 062
టెండరు కోరుతూ ప్రకటన
టెండరు నోటీసు నం.: NFC/EM/Incinerator/2019/01
దిగువ తెలిపిన పని కోసం భారత రాష్ట్రపతి తరఫున సీల్డ్ టెండర్లు కోరబడుచున్నవి. అంచనా వ్యయము, టెండరు ధర మరియు బయానా వివరాలు దిగువ విధంగా ఉన్నాయి:

| క్ర సం | పని వివరణ | అంచనా వ్యయము | బయానా | టెండరు డాక్యుమెంట్ ధర | టెండరు అమ్మకం టెండరు దాఖలు | కాంట్రాక్ట్ వ్యవధి |
|---|---|---|---|---|---|---|
| 01. | యాక్టివ్ వేస్ట్ ఇన్సినరేటర్‌కు సంబంధించి 30m MS Stack రీప్లేస్‌మెంట్ | రూ.19,30,000/- | రూ.38,600/- | రూ.500/- | 18.10.2019 నుండి 31.10.2019 దాఖలు:14.11.2019 న లేదా ఆలోగా 1400 గం.వరకు | 6 నెలలు |

టెండరు డాక్యుమెంట్‌ను AGM కార్యాలయం, EM నుండి 18.10.2019 నుండి 31.10.2019 వరకు పొందవచ్చును. అందుకుగాను " Pay and Accounts Officer, NFC, Hyderabad" పేరున బ్యాంకర్స్ చెక్/ డిమాండ్ డ్రాఫ్ట్/ పే ఆర్డర్ రూపంలో తీసిన టెండరు డాక్యుమెంట్ ధర అనగా రూ.500/- (ఐదు వందల రూపాయలు మాత్రమే) చెల్లించాలి. తదుపరి వివరాల కోసం దర్శించండి మా వెబ్‌సైట్ www.nfc.gov.in

సాక్షి బిజినెస్
బుధవారం
16-10-2019
WWW.SAKSHIBUSINESS.COM

## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 292 ▲ | 87 ▲ |
| 38,506 | 11,428 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (తొలి రెండు రాత్రి 11.30గం॥లకు)

| సూచీ | | | మార్పు |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 8,152 | ▲ | 104 |
| డోజోన్స్ | 27,048 | ▲ | 261 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,212 | ▼ | 2 |
| డాక్స్ | 12,630 | ▲ | 143 |
| షాంఘై | 2,991 | ▼ | 17 |
| నికాయ్ | 22,207 | ▲ | 408 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | కరెన్సీ | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 70.52 | 72.16 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 88.40 | 91.61 |
| € | యూరో | ఎస్‌బీఐ | 77.25 | 80.17 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 64.66 | 67.09 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 47.32 | 49.47 |
| S$ | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 51.23 | 53.00 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.29 | 19.89 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 19.01 | 20.02 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.48 | 10.88 |

# హీరో లెక్ట్రో.. కొత్త ఈ-సైకిల్

- టౌన్‌మాస్టర్ @ రూ.30,999
- 3 గంటలు చార్జింగ్... 30–40 కి.మీ. ప్రయాణం



**న్యూఢిల్లీ:** హీరో సైకిల్స్‌కు చెందిన లెక్ట్రో ఈ–మొబిలిటీ సొల్యూషన్స్ కొత్త ఎలక్ట్రిక్ సైకిల్‌ను మార్కెట్లోకి తెచ్చింది. టౌన్‌మాస్టర్ పేరుతో అందిస్తున్న ఈ కొత్త ఎలక్ట్రిక్ సైకిల్ ధర రూ.30,999 అని లెక్ట్రో ఈ–మొబిలిటీ సొల్యూషన్స్ డైరెక్టర్ అదిత్య ముంజాల్ పేర్కొన్నారు. ఈ బైక్‌ను చార్జింగ్ చేయడానికి ప్రత్యేకంగా చార్జింగ్ స్టేషన్లు అవసరం లేదని, సాధారణ ప్లగ్ తోనే చార్జింగ్ చేసుకోవచ్చన్నారు. 3 గంటలు చార్జింగ్‌తో 30–40 కి.మీ. ప్రయాణిస్తుందని వివరించారు. ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యత ఇచ్చే, పర్యావరణ స్పృహ గల కొత్త తరం వినియోగదారులు భారత్‌లో పెరుగుతున్నారని, ప్రత్యామ్నాయ రవాణా సాధనాల కోసం వీరు చూస్తున్నారని పేర్కొన్నారు. ఇంగ్లాండ్‌లో డిజైన్ చేసిన ఈ సైకిల్‌లో డబుల్ డిస్క్ బ్రేక్‌లు, పంక్చర్‌ను తట్టుకునే టైర్లు వంటి ప్రత్యేకతలున్నాయని చెప్పారు.

# భారత్‌లో తొలి 5జీ లైవ్ వీడియో కాల్

**క్వాల్‌కామ్ భాగస్వామ్యంతో ప్రదర్శించిన ఎరిక్సన్**

ERICSSON QUALCOMM



**న్యూఢిల్లీ:** స్వీడన్‌కు చెందిన టెలికం కంపెనీ ఎరిక్సన్ 5జీ లైవ్ వీడియో కాల్‌ను తొలిసారిగా భారత్‌లో ప్రదర్శించింది. ఇది భారత్‌లో తొలి 5జీ వీడియో కాల్ అని, క్వాల్‌కామ్ భాగస్వామ్యంతో దీనిని ప్రదర్శిస్తున్నామని ఎరిక్సన్ హెడ్(సౌత్ ఈస్ట్ ఏషియా, ఓషియానియా, ఇండియా) నున్‌జో మిర్టిల్లో చెప్పారు. 5జీ సర్వీస్‌లు మిల్లీమీటర్‌వేవ్(ఎమ్ఎమ్‌వేవ్–28 గిగాహెట్జ్, 38 గిగాహెట్జ్ స్పెక్ట్రమ్ బాండ్స్) స్పెక్ట్రమ్ ద్వారా అందుతాయని వివరించారు. 5జీ, 4జీ మొబైల్‌నెట్‌వర్క్స్‌కు ఎమ్ఎమ్‌వేవ్ స్పెక్ట్రమ్ కీలకమైనదని పేర్కొన్నారు. ఇక్కడ జరుగుతున్న ఇండియా మొబైల్ కాంగ్రెస్ 2019లో ఆయన మాట్లాడారు.

**వచ్చే ఏడాది నుంచి 5జీ ఫోన్లు....**

ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటీ), మెషీన్ టు మెషీన్ కమ్యూనికేషన్స్ వంటి తాజా టెక్నాలజీలకు 5జీ కీలకం కానున్నదని మిర్టిల్లో పేర్కొన్నారు. 5జీ కారణంగా భారత్‌లో కొత్త అవకాశాలు అందివస్తాయని వివరించారు. వచ్చే ఏడాది నుంచి 5జీ టెక్నాలజీని సపోర్ట్ చేసే స్మార్ట్‌ఫోన్ల అమ్మకాలు పెరగనున్నాయని క్వాల్‌కామ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ రాజెన్ వగాడియా పేర్కొన్నారు. ఇంటర్నెట్ స్పీడ్ అధికంగా ఉండే 5జీ సర్వీస్‌లు భారత్‌లో ఇంకా ఆరంభం కాలేదు. ఈ సర్వీసులు ఇప్పటికే అమెరికా, దక్షిణ కొరియాల్లో లభిస్తున్నాయి. 5జీ సర్వీసులకు సంబంధించిన స్పెక్ట్రమ్‌ను ఈ ఆర్థిక సంవత్సరంలోనే వేలం వేయనున్నామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే.

# ఎక్సాన్ మొబిల్‌తో ఓఎన్‌జీసీ జట్టు

**ఉమ్మడిగా చమురు, గ్యాస్ క్షేత్రాల అభివృద్ధి**



**న్యూఢిల్లీ:** దేశీయంగా చమురు, గ్యాస్ అన్వేషణ, ఉత్పత్తి విభాగంలో అతిపెద్ద సంస్థ ఓఎన్‌జీసీ, ఇదే రంగంలో అంతర్జాతీయంగా ప్రముఖ కంపెనీ అయిన ఎక్సాన్ మొబిల్‌తో జట్టు కట్టింది. తూర్పు, పశ్చిమ తీరాల్లో సముద్రగర్భ ఆయిల్, గ్యాస్ క్షేత్రాలను ఉమ్మడిగా ఈ సంస్థలు అభివృద్ధి చేయనున్నాయి. ఈ మేరకు ఎక్సాన్‌మొబిల్‌తో ఓఎన్‌జీసీ అవగాహన ఒప్పందం (ఎంవోయూ) చేసుకుంది. భారత ఇంధన సదస్సు 'సెరావీక్' కార్యక్రమంలో భాగంగా కుదిరిన ఈ ఒప్పందంపై ఓఎన్‌జీసీ డైరెక్టర్ ఆర్‌కే శ్రీవాస్తవ, ఎక్సాన్ మొబిల్ సీఈవో(దక్షిణాసియా) విలియమ్ పీ డేవిస్ సంతకాలు చేశారు. ''ఓఎన్‌జీసీకి చెందిన తూర్పు, పశ్చిమ తీరాల్లోని సముద్రగర్భ బ్లాకులు, అన్వేషణ లైసెన్స్ కలిగిన ఇతర క్షేత్రాల్లో రెండు కంపెనీలు సంయుక్తంగా సాంకేతిక అధ్యయనం, ఇతర సహకారానికి ఈ ఎంవోయూ వీలు కల్పిస్తుంది'' అని ఓఎన్‌జీసీ ఈ సందర్భంగా తెలిపింది.

# విప్రో లాభం 35% జూమ్

- సెప్టెంబర్ క్వార్టర్‌లో రూ. 2,553 కోట్లు
- ఆదాయం రూ. 15,875 కోట్లు
- క్యూ3లో 2.8 శాతం ఆదాయ వృద్ధి అంచనా...

**న్యూఢిల్లీ:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం(క్యూ2)లో ఐటీ దిగ్గజం విప్రో నికర లాభం 35% ఎగిసింది. రూ. 2,553 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే వ్యవధిలో కంపెనీ లాభం రూ.1,889 కోట్లు. మరోవైపు, సెప్టెంబర్ క్వార్టర్‌లో మొత్తం ఆదాయం రూ.15,203 కోట్ల నుంచి రూ.15,875 కోట్లకు పెరిగింది.

**మూడో క్వార్టర్‌లో 2,106 మిలియన్ డాలర్ల అంచనా..**

సీక్వెన్షియల్ ప్రాతిపదికన డిసెంబర్ త్రైమాసికానికి ఐటీ సేవల విభాగం ఆదాయ వృద్ధి 0.8–2.8 శాతం స్థాయిలో ఉండొచ్చని అంచనా వేస్తున్నట్లు విప్రో గైడెన్స్ ప్రకటించింది. ఈ విభాగం నుంచి 2,065–2,106 మిలియన్ డాలర్ల స్థాయిలో ఉండగలదని భావిస్తున్నట్లు వివరించింది. రెండో త్రైమాసికంలో ఐటీ సేవల విభాగం ఆదాయం 2,049 మిలియన్ డాలర్లుగా నమోదైంది. వార్షిక ప్రాతిపదికన ఇది 2.5 శాతం వృద్ధి చెందినట్లు సంస్థ పేర్కొంది. ఐటీ సేవల విభాగం నిర్వహణ మార్జిన్ 18.1 శాతం పెరిగింది. సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో 32.31 కోట్ల షేర్ల బైబ్యాక్ ప్రక్రియను పూర్తి చేసినట్లు విప్రో తెలిపింది. ఇందుకోసం రూ. 10,500 కోట్లు వెచ్చించినట్లు వివరించింది. మరోవైపు, 5జీ టెలికం సేవలు అందించడానికి సంబంధించి ఆపరేటర్లు, ఇతరత్రా కంపెనీలకు అవసరమైన సొల్యూషన్స్‌ను రూపొందించేందుకు విప్రోతో చేతులు కలిపినట్లు టెలికం పరికరాల తయారీ సంస్థ నోకియా వెల్లడించింది. ఆపరేటర్లు తమ పెట్టుబడులపై గరిష్ట ప్రయోజనాలు పొందేలా తోడ్పడేందుకు 5జీ వినియోగాలపై తమ బెంగళూరు పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొంది. 'వృద్ధి సాధనకు ప్రాధాన్యమివ్వడం కొనసాగుతుంది. భవిష్యత్ అవసరాల కోసం పెట్టుబడులు కొనసాగుతాయి. షేర్ల బైబ్యాక్ సెప్టెంబర్‌లో పూర్తయ్యింది. ఇన్వెస్టర్ల నుంచి దీనికి మంచి స్పందన వచ్చింది' అని విప్రో చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ జతిన్ దలాల్ తెలిపారు.




> ఆదాయాలు, మార్జిన్లపరంగా రెండో త్రైమాసికంలో మెరుగైన ఫలితాలు సాధించగలిగాం. వార్షిక ప్రాతిపదికన మొత్తం 7 విభాగాల్లో 6 విభాగాలు వృద్ధి నమోదు చేయగలిగాయి. కొన్ని రంగాల్లో అనిశ్చితి ప్రభావాలు కొనసాగుతున్నప్పటికీ ఐటీ సేవలకు డిమాండ్‌లో పెద్దగా మార్పు లేదు. కెనడా, ఆస్ట్రేలియా, ఆసియా పసిఫిక్ ప్రాంత దేశాలతో పాటు కీలకమైన అమెరికా, బ్రిటన్ మార్కెట్లలో కూడా డీల్స్ దక్కించుకోగలుగుతున్నాం. అంతర్జాతీయంగా అందిస్తున్న సేవలు భారతీయ కస్టమర్లకు అందించే వ్యూహాల్లో భాగంగా భారత్‌లో ఒక క్లయింట్‌తో భారీ డీల్ కుదుర్చుకున్నాం. క్యూ1తో పోలిస్తే క్యూ2లో ఆర్డర్ బుక్ మరింత మెరుగుపడింది. భారత్, మధ్యప్రాచ్య దేశాల్లో కార్యకలాపాల పునర్వ్యవస్థీకరణ కొనసాగుతోంది. ఐసీఐసీఐ వంటి కొన్ని డీల్స్ ఇలాంటి వ్యూహాల్లో భాగమే.
>
> *– అబిదాలి నీముచ్‌వాలా, విప్రో సీఈఓ*


**మరిన్ని విశేషాలు..**

- సీక్వెన్షియల్‌గా చూస్తే డిజిటల్ విభాగం ఆదాయం ఏడు శాతం, వార్షికంగా 29 శాతం మేర వృద్ధి చెందింది. మొత్తం ఆదాయంలో ఈ విభాగం వాటా 39.6 శాతంగా ఉంది.
- క్యూ2లో కొత్తగా 57 సంస్థలు క్లయింట్లుగా జతయ్యాయి. దీంతో మొత్తం క్లయింట్ల సంఖ్య 1,027కి చేరింది.
- ఐటీ సేవల విభాగంలో సీక్వెన్షియల్‌గా 6,603 మంది టెకీలు చేరారు. దీంతో ఉద్యోగుల సంఖ్య 1,81,453కి చేరింది.

**విప్రో షేరు మంగళవారం బీఎస్‌ఈలో స్వల్పంగా పెరిగి రూ. 243.70 వద్ద క్లోజయ్యింది.**

# రెండవ నెలలోనూ ఎగుమతులు మైనస్

**సెప్టెంబర్‌లో –6.57 శాతం క్షీణత**




**న్యూఢిల్లీ:** భారత్ ఎగుమతులు వరుసగా రెండవ నెల– సెప్టెంబర్‌లోనూ నిరాశను మిగిల్చాయి. వృద్ధిలేకపోగా –6.57 శాతం క్షీణతను నమోదుచేసుకున్నాయి. విలువ రూపంలో 26 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఇక దేశంలో ఆర్థిక మందగమన పరిస్థితులను ప్రతిబింబిస్తూ, దిగుమతులూ క్షీణతలో కొనసాగుతున్నాయి. – 13.85 శాతం క్షీణతతో 36.89 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. వెరసి ఎగుమతులు– దిగుమతుల మధ్య నికర వ్యత్యాసం వాణిజ్యలోటు 10.89 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. గడచిన ఏడు నెలల్లో ఇంత తక్కువ వాణిజ్య లోటు ఇదే తొలిసారి. పెట్రోలియం, ఇంజనీరింగ్, రత్నాలు, ఆభరణాలు, తోలు ఉత్పత్తుల ఎగుమతులు పడిపోయాయి. పసిడి దిగుమతుల విలువ 62.49 శాతం క్షీణించి 1.36 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. భారత్ సేవల ఎగుమతులు ఆగస్టులో 10% పెరిగి 18.24 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.

# రూ. 2 వేల నోటు కనబడుటలేదు!!

**ఈ ఏడాది ఒక్క నోటు కూడా ముద్రించలేదు ● ఆర్‌టీఐ ద్వారా వెల్లడించిన రిజర్వ్ బ్యాంక్...**


చెలామణీలో ఉన్న అన్నిరకాల కరెన్సీ నోట్ల విలువ ( రూ. కోట్లలో ; మార్చి నాటికి)




**న్యూఢిల్లీ:** ఏటీఎంలలో రూ.2 వేల నోట్లు ఈ మధ్య కాలంలో అంతగా రాకపోవడాన్ని గమనించారా...? గతంలో పెద్దమొత్తంలో నగదు తీస్తే కచ్చితంగా ఎక్కువ సంఖ్యలోనే రూ.2 వేల నోట్లు వచ్చేవి. ఇప్పుడు మాత్రం ఈ సంఖ్య బాగా తగ్గింది. దీనికి కారణం లేకపోలేదు...! గతంలో పెద్ద నోట్ల రద్దు అనంతరం ప్రవేశపెట్టిన మరింత పెద్ద నోటు రూ. 2,000 ముద్రణ ప్రస్తుతం పూర్తిగా నిలిచిపోవడమే! భారతీయ రిజర్వ్ బ్యాంక్ నోట్ ముద్రణ్ సంస్థ ఈ ఆర్థిక సంవత్సరంలో ఒక్క నోటు కూడా ముద్రించలేదు. సమాచార హక్కు చట్టం కింద ఓ వార్తా ప్రసార సంస్థ అడిగిన ప్రశ్నకు రిజర్వ్ బ్యాంక్ ఈ మేరకు సమాధానమిచ్చింది. పక్కా అసలు నోట్లుగా అనిపించే నకిలీ కరెన్సీ నోట్లు మళ్లీ చెలామణీలోకి వస్తున్నాయంటూ నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ హెచ్చరించిన నేపథ్యంలో ఆర్‌బీఐ సమాధానం ప్రాధాన్యం సంతరించుకుంది. నల్లధనం, నకిలీ కరెన్సీలకు చెక్ పెట్టే ప్రయత్నాల్లో భాగంగానే 2016 నవంబర్‌లో రూ. 1,000, రూ. 500 నోట్లను రద్దు చేసిన నరేంద్ర మోదీ ప్రభుత్వం.. ఆ తర్వాత రూ. 2,000 నోట్లను ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే.

సంఖ్యాపరంగా 2016–17లో 354.2 కోట్ల రూ. 2,000 నోట్ల ముద్రణ జరగ్గా ఆ మరుసటి ఏడాది గణనీయంగా తగ్గి 111.5 కోట్లకు పరిమితమైంది. 2018–19లో ఆర్‌బీఐ 4.66 కోట్ల నోట్లు ప్రింట్ అయ్యాయి. 2018 మార్చి నాటికి 336.3 కోట్ల మేర రూ. 2,000 నోట్లు చలామణీలో ఉండగా 2019 నాటికి 329.1 కోట్లకు తగ్గాయి. నల్లధనం కూడబెట్టుకునేందుకు పెద్ద నోట్లను దాచిపెట్టుకోవడాన్ని నిరోధించే ఉద్దేశంతోనే రూ. 2,000 నోట్ల ముద్రణను ఆర్‌బీఐ తగ్గిస్తుండవచ్చని నిపుణులు తెలిపారు. 2019 జనవరిలో ఆంధ్ర– తమిళనాడు సరిహద్దుల్లో రూ.6 కోట్ల విలువ చేసే రూ. 2,000 నోట్లు పట్టుబడటం (లెక్కల్లో చూపని) ఈ అభిప్రాయాలకు ఊతమిస్తోంది. బ్యాంకింగ్ వ్యవస్థలో నకిలీ రూ. 2,000 కరెన్సీ నోట్ల సంఖ్య కూడా పెరుగుతోంది. 2016–17లో 678 నకిలీ నోట్లు దొరకగా, 2017–18లో 17,929 నోట్లు బైటపడ్డాయి.

కొత్తగా ముద్రించిన 2 వేల నోట్ల సంఖ్య (కోట్లలో)






చెలామణీలో ఉన్న 2 వేల నోట్లు ; వాటి విలువ (మార్చి నాటికి)




# మొబైల్ చార్జీలకు రెక్కలు!

- ప్రస్తుత రేట్లు గిట్టుబాటు కావంటున్న కంపెనీలు
- టారిఫ్ పెరిగితే తప్ప కష్టం
- ఎయిర్‌టెల్ ఎండీ విఠల్ వ్యాఖ్యలు






**న్యూఢిల్లీ:** ఇతర నెట్‌వర్క్‌లకు చేసే కాల్స్‌పై రిలయన్స్ జియో చార్జీలు అమలు చేస్తున్న నేపథ్యంలో మిగతా టెలికం సంస్థలు కూడా చార్జీల పెంపు రాగాన్ని అందుకుంటున్నాయి. ప్రస్తుతం వసూలు చేస్తున్న రేట్లతో నిలదొక్కుకోవడం కష్టమేనంటూ తాజాగా భారతీ ఎయిర్‌టెల్ వ్యాఖ్యానించింది. టారిఫ్‌లు పెరగాల్సిన అవసరం ఉందని ఎయిర్‌టెల్ ఎండీ, సీఈవో (భారత్, దక్షిణాసియా విభాగం) గోపాల్ విఠల్ పేర్కొన్నారు. 'ఈ టారిఫ్‌లతో నిలదొక్కుకోవడం కష్టమని మా నమ్మకం. టారిఫ్‌లు పెరగాల్సిన అవసరం ఉందని భావిస్తున్నాం. మేం ఎప్పుడూ ఇదే మాట మీద ఉన్నాం' అని ఇండియా మొబైల్ కాంగ్రెస్‌లో (ఐఎంసీ) పాల్గొన్న సందర్భంగా చెప్పారు. మరోవైపు, ఇంటర్‌కనెక్షన్ యూసేజ్ చార్జీలంటూ (ఐయూసీ) యూజర్లపై జియో నిమిషానికి 6 పైసల చార్జీలు వసూలు చేస్తుండటాన్ని ఆయన ఖండించారు. 'టారిఫ్‌కి ఐయూసీకి సంబంధం లేదు. టెలికం కంపెనీల స్థాయిలో జరిగే లావాదేవీ అది' అని విఠల్ పేర్కొన్నారు. మరోవైపు, తదుపరి 5జీ స్పెక్ట్రం వేలానికి ప్రతిపాదించిన ధర చాలా అధికమని, దీనివల్ల 5జీ సేవలు ఖరీదైన వ్యవహారంగా మారతాయని చెప్పారు. టెలికం రంగంలోకి పెట్టుబడులు వస్తేనే డిజిటల్ ఇండియా కల సాకారం కాగలదని ఆయన పేర్కొన్నారు. పెట్టుబడులకు అనువైన వాతావరణం ఉంటేనే ఇన్వెస్టర్లు ముందుకొస్తారని విఠల్ చెప్పారు.

**ట్రాయ్‌పై జియో విమర్శలు..**

ఐయూసీ చార్జీల విధింపు గడువు పెంపు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్న టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్‌పై రిలయన్స్ జియో తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తింది. ఇది తిరోగమన చర్యగా అభివర్ణించింది. ఎయిర్‌టెల్ లాంటి పాత ఆపరేటర్లకు ఇది అనూహ్య లాభాలు తెచ్చిపెడుతుందని పేర్కొంది. ఐయూసీని పూర్తిగా ఎత్తేయడానికి బదులు.. గడువును పొడిగించడం వల్ల సమర్థంగా వ్యవహరిస్తున్న టెలికం ఆపరేటర్లను శిక్షించినట్లవుతుందని, వినియోగదారుల ప్రయోజనాలనూ దెబ్బ తీసినట్లవుతుందని వ్యాఖ్యానించింది. ఇతర నెట్‌వర్క్‌ల యూజర్ల నుంచి వచ్చే కాల్స్‌ను స్వీకరించినందుకు గాను.. టెల్కోలు పరస్పరం విధించుకునే చార్జీలను ఐయూసీగా వ్యవహరిస్తారు. ఐయూసీని 2020 జనవరి 1 నుంచి పూర్తిగా ఎత్తివేయాలని గతంలో ప్రతిపాదించినప్పటికీ.. దీన్ని పొడిగించే అవకాశాలపై ట్రాయ్ చర్చాపత్రాన్ని విడుదల చేయడం వివాదాస్పదమైంది. దీంతో ఇతర నెట్‌వర్క్‌లకు చేసే కాల్స్‌పై నిమిషానికి 6 పైసల ఐయూసీ చార్జీలను జియో విధించింది.

**ఇతర టెల్కోలు దాచిపెడుతున్నాయ్..**

ఇతర టెల్కోలు కూడా ఐయూసీ చార్జీలను విధిస్తున్నప్పటికీ.. యూజర్లకు ఆ విషయం చెప్పకుండా దాచిపెడుతున్నాయని ఆరోపించింది. పోటీ సంస్థలు పారదర్శకత పాటించడం లేదని జియో ప్రెసిడెంట్ మాథ్యూ ఊమెన్ ఆరోపించారు.

# స్వదేశీ బ్రాండ్లకే మనోళ్ల మొగ్గు

**బీసీజీ సంస్థ సర్వేలో వెల్లడి**

**ముంబై:** భారత వినియోగదారుల్లో దాదాపు సగం మంది విదేశీ బ్రాండ్ల కంటే స్వదేశీ బ్రాండ్లకే ప్రాధాన్యత ఇస్తున్నారని అంతర్జాతీయ కన్సల్టెన్సీ సంస్థ, బీసీజీ వెల్లడించింది. భారత వినియోగదారులు ఆహారం, వ్యక్తిగత సంరక్షణ కేటగిరీల్లో స్వదేశీ బ్రాండ్లకే మరింత ప్రాధాన్యత ఇస్తున్నారని బీసీజీ సంస్థ సర్వేలో వెల్లడైంది. రాజకీయంగా జాతీయ వాదం బలం పుంజుకుంటూ.. దేశీ వస్తువులనే కొనుగోలు చేయాలంటూ ప్రచారాలు మోతెక్కిపోతున్న వేళలో, ఈ సర్వే వెలువడటం విశేషం. 3,000 మంది భారతీయులపై నిర్వహించిన ఈ సర్వేలో వెల్లడైన ముఖ్యాంశాలు....



- కనీసం ఒక్క కేటగిరీలోనైనా భారత బ్రాండ్ వస్తువులను కొనుగోలు చేయాలని వినియోగదారులు భావిస్తున్నారు.
- తాము కొనుగోలు చేసిన వస్తువుల ద్వారా సామాజిక గుర్తింపు పొందాలని కోరుకునే వినియోగదారులే అధికంగా ఉన్నారు.
- బ్రాండెడ్ వస్తువుల ద్వారా తాము పొందిన తృప్తిని సోషల్ వెబ్‌సైట్ల ద్వారా వెల్లడించడానికి వినియోగదారులు వెనకాడటం లేదు.

# 7 కాదు... 6.1 శాతమే!

**2019 భారత్ వృద్ధిరేటుకు ఐఎంఎఫ్ కోత**

**వాషింగ్టన్:** భారత్ ఆర్థిక వృద్ధిరేటు అంచనాలను తగ్గిస్తున్న పలు సంస్థల జాబితాలో తాజాగా అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) కూడా చేరింది. 2019లో వృద్ధి కేవలం 6.1 శాతంగానే నమోదవుతుందని తన వరల్డ్ ఎకనమిక్ అవుట్‌లుక్‌లో పేర్కొంది. ఏప్రిల్ అంచనా (7.3 శాతం)తో పోల్చితే తాజా అంచనా ఏకంగా 1.2 శాతం తక్కువ. నిజానికి ఏప్రిల్‌లో 7.3 శాతం అంచనావేసిన మూడు నెలల తర్వాత ఈ రేటును 7 శాతానికి ఐఎంఎఫ్ కుదించింది. తాజాగా ఈ అంచనాను మరింత తగ్గించింది. రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) తాజా అంచనాలకు సరిసమానంగా ఐఎంఎఫ్ అంచనా ఉండడం గమనార్హం. 2018లో భారత్ వృద్ధి రేటు 6.8 శాతం. తాజా అంచనాల కుదింపునకు పలు కారణాలను ఐఎంఎఫ్ పేర్కొంది. అవుట్‌లుక్‌లో కొన్ని ముఖ్యాంశాలను చూస్తే...

- ఆటోమొబైల్, రియల్ ఎస్టేట్ రంగాలు తీవ్ర ప్రతికూలతలను ఎదుర్కొంటున్నాయి. ఇక కీలకమైన నాన్–బ్యాంకింగ్ ఫైనాన్షియల్ రంగంలో కూడా అనిశ్చితి పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయి. దీనికితోడు దేశీయంగా బలహీన డిమాండ్ పరిస్థితుల ప్రభావం ఊహించినదానికన్నా ఎక్కువ.
- 2020లో వృద్ధి 7%కి పెరిగే అవకాశం ఉంది. అయితే ఈ అంచనా గతంలో 7.5 శాతంగా ఉంది.
- ఇక చైనాలో 2018లో జీడీపీ వృద్ధిరేటు 6.6 శాతం ఉంటే, 2019లో 6.1 శాతంగా ఉంటుంది. ఇది భారత్ సాధించే వృద్ధి రేటు అంచనాలకు సరిసమానం కావడం గమనార్హం. 2020లో చైనా వృద్ధిరేటు మరింత తగ్గి 5.8 శాతానికి దిగే అవకాశం ఉంది.
- ప్రపంచంలోని పలు దేశాల ఆర్థిక వ్యవస్థలు ఒకేసారి మందగమనంలోకి జారుతున్నాయి. ప్రపంచ ఆర్థికవృద్ధిరేటు 2019లో 3.2 శాతం, 2020లో 3.4 శాతం నమోదయ్యే అవకాశం ఉంది.



**2019 వృద్ధి రేటుపై 'కోత' మాట...**

| సంస్థ | ఇప్పుడు | గతంలో |
|---|---|---|
| ఆర్‌బీఐ | 6.1 | 6.9 |
| ప్రపంచబ్యాంక్ | 6.0 | 7.2 |
| మూడీస్ | 5.8 | 6.2 |
| ఇండియా రేటింగ్స్ | 6.1 | 6.7 |
| ఫిచ్ సొల్యూషన్స్ | 6.4 | 6.8 |
| డీబీఎస్ | 6.2 | 6.8 |

epaper.sakshi.com

## కార్పొబ్రీఫ్

**ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్...**

రూపాయి డినామినేషన్ బాండ్ల జారీ ద్వారా రూ.3,000 కోట్ల వరకూ నిధులను ఈ నెల లోనే సమీకరించనున్నది. ఆ తర్వాత ఇదే స్థాయి పెట్టుబడులను ఈ ఆర్థిక సంవత్సరం లోనే సమీకరిస్తామని పేర్కొంది.

## బులియన్ రూ.లలో

| | | |
|---|---|---|
| **హైదరాబాద్** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,180 | ▲ 40 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,400 | ▲ 40 |
| వెండి (కిలో) | 49,163 | ▼ 400 |
| **ప్రొద్దుటూరు** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,100 | ▲ 300 |
| బంగారం (22 క్యారెట్లు) | 35,240 | ▲ 290 |
| వెండి (కిలో) | 46,900 | ▲ 500 |
| **విశాఖపట్నం** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 39,480 | ▲ 130 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,720 | ▲ 120 |
| వెండి (కిలో) | 47,500 | ▼ 500 |
| **ఏపీ బులియన్ అసోసియేషన్** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 39,760 | ▲ 160 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,780 | ▲ 180 |
| వెండి (కిలో) | 47,000 | ▲ 300 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

## ముడిచమురు... (బ్యారల్)

| | | |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 53.37 (రాత్రి 11.30కు) | $ 54.70 (సోమవారం ముగింపు) |
| బ్రెంట్ | 59.22 (రాత్రి 11.30కు) | $ 60.51 (సోమవారం ముగింపు) |

## కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 16-10-2019

| | |
|---|---|
| విశాఖ | 420-00 |
| చిత్తూరు | 413-00 |
| వరంగల్ | 393-00 |
| చెన్నై | 420-00 |
| ముంబై | 445-00 |
| **15-10-2019 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 390-00 |
| రిటైల్ (ఒక గుడ్డుకు) | 4.50 |
| విజయవాడ | 422-00 |
| నమక్కల్ | 415-00 |
| గోదావరి | 422-00 |
| బెంగళూరు | 425-00 |
| కోల్‌కతా | 440-00 |
| ఢిల్లీ | 419-00 |

# 11,400 పాయింట్లపైకి నిఫ్టీ



- మూడో రోజూ కొనసాగిన లాభాలు
- రేట్ల కోత అంచనాలు
- సానుకూలంగా అంతర్జాతీయ సంకేతాలు
- 38,500 పాయింట్లపైకి సెన్సెక్స్
- 292 పాయింట్ల లాభంతో 38,506 వద్ద ముగింపు
- 87 పాయింట్లు పెరిగి 11,428 వద్దకు చేరిక

పండుగల సీజన్‌లో వినియోగదారుల డిమాండ్ పుంజుకోగలదన్న అంచనాలతో మంగళ వారం స్టాక్ మార్కెట్ లాభాల్లో ముగిసింది. డిసెంబర్‌లో జరిగే పాలసీ సమావేశంలో ఆర్‌బీఐ మరోసారి రేట్లను తగ్గించగలదన్న అంచనాలు కూడా తోడవడం వల్ల సెన్సెక్స్, నిఫ్టీలు లాభప డ్డాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ కీలకమైన 38,500 పాయింట్లు, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 11,400 పాయింట్ల ఎగువకు ఎగబాకాయి. వరుసగా మూడో రోజూ సెన్సెక్స్, నిఫ్టీలు లాభపడ్డాయి. ఇంట్రాడేలో 421 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్ చివరకు 292 పాయింట్ల లాభంతో 38,506 పాయింట్ల వద్ద ముగిసింది. ఇక ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 87 పాయింట్లు పెరిగి 11,428 పాయింట్ల వద్దకు చేరింది. వాహన, లోహ షేర్లు ర్యాలీ జరిపాయి. గత మూడు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 626 పాయింట్లు, నిఫ్టీ 194 పాయింట్లు చొప్పున పెరిగాయి

**రోజంతా లాభాలే...**

అమెరికా–చైనాల మధ్య వాణిజ్య ఒప్పందానికి సంబంధించి తొలి దశ ఒప్పందానికి చైనా అంగీక రించడం, బ్రెగ్జిట్ సంబంధిత ఒప్పందం ఈ వారంలోనే కుదరగలదన్న వార్తలు, గత రెండు రోజులుగా విదేశీ ఇన్వెస్టర్లు మన మార్కెట్లో కొను గోళ్లు జరుపుతుండటం, చమురు ధరలు 1.75 శాతం మేర తగ్గడం.... సానుకూల ప్రభావం చూపించాయి. సోమవారం వెల్లడైన ద్రవ్యోల్బణ గణాంకాలు... వడ్డీ రేట్లను మరోసారి తగ్గించేలా ఆర్‌బీఐను పురికొ ల్పుతాయనే అంచనాలు కలిసి వచ్చాయి. రూపాయి మారకం విలువ 30 పైస లకు పైగా తగ్గినా మన మార్కెట్ ముందుకే దూసు కుపోయింది. లాభాల్లో ఆరంభమైన సెన్సెక్స్, నిఫ్టీలు రోజంతా అదే జోరు చూపించాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 421 పాయింట్లు, నిఫ్టీ 121 పాయింట్ల మేర లాభపడ్డాయి. అయితే ఇంట్రాడే లాభాలు ట్రేడింగ్ చివర్లో తగ్గాయి.

## స్టాక్ మార్కెట్ డేటా

| | టర్నోవర్ (రూ. కోట్లలో) |
|---|---|
| బీఎస్‌ఈ | 3,847 |
| ఎన్‌ఎస్‌ఈ | 35,668 |
| ఎన్‌ఎస్‌ఈ (డెరివేటివ్స్) | 9,30,743 |
| ఎఫ్‌ఐఐ | 436 |
| డీఐఐ | 929 |

### కొన్ని ముఖ్యాంశాలు...

- మూడు రోజుల లాభాల కారణంగా ఇన్వెస్టర్ల సంపద రూ.2.64 లక్షల కోట్లు పెరిగింది. ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్‌ఈలో లిస్టైన మొత్తం కంపెనీల మార్కెట్ క్యాప్ రూ.2.64 లక్షల కోట్లు ఎగసి రూ.1,45,86,956 కోట్లకు పెరిగింది.
- నికర లాభం 21 శాతం పెరగడంతో హిందుస్తాన్ యూనిలివర్ షేర్ 2.4 శాతం లాభంతో రూ.2,063 వద్ద ముగిసింది.
- ఆర్‌బీఐ భారీ జరిమానాలు విధించడంతో లక్ష్మీ విలాస్ బ్యాంక్, సిండికేట్ బ్యాంక్‌లు ఏడాది కనిష్ట స్థాయిలకు పడిపోయాయి.

## తనిష్క్ నుంచి విరాసత్ కలెక్షన్




**హైదరాబాద్:** తనిష్క్ జ్యువెలర్ కంపెనీ పండగ సీజన్ కోసం వినూత్నమైన ఆఫర్లను అందుబాటు లోకి తెచ్చింది. దీపావళి పండుగ సందర్భంగా విరాసత్ పేరుతో ప్రత్యేకమైన కలెక్షన్‌ను అందు బాటులోకి తెచ్చామని టైటాన్ కంపెనీ తెలిపింది. అంతేకాకుండా బంగారం, వజ్రాభరణాల తయారీ చార్జీల్లో 25 శాతం వరకూ రాయితీని పొందవచ్చని టైటాన్ కంపెనీ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్(మార్కెటింగ్, జువెలరీ డివిజన్) దీపికా తివారీ పేర్కొన్నారు. ఎంపిక చేసిన నగరాలు, తేదీల్లో మాత్రమే ఈ ఆఫర్ వర్తిస్తుందని తెలిపారు.

**టైటాన్ వాచ్‌ల ధరలు రూ.5,495–రూ.15,995 రేంజ్‌లో...**

కాగా దీపావళి పండుగ సందర్భంగా టైటాన్ కంపెనీ మహిళల చేతి గడియారాలకు సంబం ధించి రాగా బ్రాండ్‌లో ఫేసేట్స్ కలెక్షన్‌ను అందు బాటులోకి తెచ్చింది. ఈ కలెక్షన్‌లో భాగంగా 12 ఆకర్షణీయమైన వాచ్‌లను అందిస్తున్నామని టైటాన్ కంపెనీ తెలిపింది. వీటి ధరలు రూ.5,495 నుంచి రూ.15,995 రేంజ్‌లో ఉన్నాయని పేర్కొంది.

## అమెరికాతో వాణిజ్య వివాదాల్లేవు

### వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్



**న్యూఢిల్లీ:** అమెరికాతో భారత్‌కు ఎటువంటి వాణిజ్య వివాదాల్లేవని కేంద్ర వాణిజ్య శాఖా మంత్రి పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. ఉన్నది కేవలం కొన్ని అభిప్రాయ భేదాలేన న్నారు. ఇరు దేశాలు గణనీయ స్థాయిలో ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడుల సామ ర్థ్యాన్ని కలిగి ఉన్నాయని చెప్పారు. భారత ఇంధన సదస్సులో మంత్రివర్గ ప్యానెల్ చర్చ సందర్భంగా గోయల్ మాట్లాడారు. భారత్‌కు ప్రాధాన్య హోదాను (జీఎస్‌పీ)ను అమెరికా పరస్పర సుంకాల వంటి చర్యల నేపథ్యంలో గోయల్ తాజా వ్యాఖ్యలు చేశారు.

## నోకియా 6.2 విడుదల



**న్యూఢిల్లీ:** హెచ్‌ఎండీ గ్లోబల్ భారత మార్కె ట్లోకి నోకియా 6.2 స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేసింది. ఇందులో వెనుక భాగంలో మూడు కెమెరాలు ఉంటాయి. ప్యూర్ డిస్‌ప్లే టెక్నాలజీతో దీన్ని కంపెనీ రూపొందించింది. దీని ధర రూ.15,999. బజాజ్ ఫైనాన్స్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు, హెచ్‌డీబీఎఫ్‌ఎస్ ద్వారా సున్నా వడ్డీకే రుణంపై ఈ నెల చివరి వరకు కొనుగోలు చేసుకునే ఆఫర్‌ను కంపెనీ తీసుకొచ్చింది. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ కోసం వేర్వేరు ఆఫర్లను కూడా ప్రకటించింది.

## ఏసీసీ లాభం 45 శాతం అప్



**న్యూఢిల్లీ:** సిమెంట్ కంపెనీ ఏసీసీ నికర లాభం ఈ ఏడాది సెప్టెంబర్, 30తో ముగి సిన త్రైమాసిక కాలంలో 45 శాతం పెరిగిం ది. గత ఏడాది సెప్టెంబర్ క్వార్టర్‌లో రూ.209 కోట్లుగా ఉన్న నికర లాభం(క న్సాలిడేటెడ్) ఈ సెప్టెంబర్ క్వార్టర్‌లో రూ.303 కోట్లకు పెరిగిందని ఏసీసీ తెలిపింది. నికర అమ్మ కాలు రూ.3,364 కోట్ల నుంచి రూ.3,464 కోట్లకు పెరిగాయని ఏసీసీ ఎమ్‌డీ, సీఈఓ నీరజ్ అఖౌరీ తెలిపారు. ఈ కంపెనీ జనవరి–డిసెంబర్ కాలాన్ని ఆర్థిక సంవత్సరంగా పాటిస్తోంది.

**డిమాండ్ పుంజుకుంటుంది.....**

లాభదాయక వృద్ధి వ్యూహం కొనసాగు తోందని నీరజ్ పేర్కొన్నారు. ఈ క్యూ2లో మంచి నిర్వహణ, నికర లాభాలు సాధించామని వివరించారు. కొత్తగా తామందిస్తున్న ఉత్పత్తులు, ముఖ్యంగా ప్రీమియమ్ సెగ్మెంట్ ఉత్పత్తులకు మంచి ఆదరణ లభిస్తోందని తెలిపారు. వీటితో జతగా రెడీ మిక్స్ సిమెంట్ అమ్మకాలు జోరుగా ఉండటంతో నికర అమ్మకాలు పెరిగాయన్నారు. బీఎస్‌ఈలో ఏసీసీ షేర్ 2% లాభంతో రూ.1,499 వద్ద ముగిసింది.

## ఎస్‌బీఐ లైఫ్ లాభం 48 శాతం డౌన్

**న్యూఢిల్లీ:** ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ నికర లాభం సెప్టెంబర్ క్వార్టర్లో 48 శాతం తగ్గింది. గత క్యూ2లో రూ.251 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ2లో రూ.130 కోట్లకు తగ్గిందని ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ తెలిపిం ది. ప్రీమియమ్ ఆదాయం రూ.9,638 కోట్ల నుంచి రూ.12,745 కోట్లకు పెరిగిందని పేర్కొం ది. కొత్త వ్యాపార ప్రీమియమ్ 40 శాతం వృద్ధితో రూ.7,820 కోట్లకు పెరిగిందని తెలిపింది. ఈ ఏడాది సెప్టెంబర్ 30 నాటికి నిర్వహణ ఆస్తులు 23 శాతం వృద్ధితో రూ.1,54,760 కోట్లకు పెరిగాయని పేర్కొంది. నికర లాభం 48 శాతం తగ్గినా, న్యూ బిజినెస్ ప్రీమియమ్ 40 శాతం పెరగడంతో బీఎస్‌ఈలో ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ షేర్ 1.3 శాతం లాభంతో రూ.840 వద్ద ముగిసింది.

## జీవీకే ఖాతాలపై ఎంసీఏ కన్ను!



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** మౌలిక రంగంలో ఉన్న జీవీకే గ్రూప్‌నకు చెందిన కంపెనీల్లో అవకతవ కలు జరిగాయన్న ఫిర్యాదు నేపథ్యంలో మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్ (ఎంసీఏ) రంగంలోకి దిగింది. నిధుల మళ్లింపు, కాంట్రాక్టుల్లో అవకతవ కలు, తప్పుడు బిల్లులతో వ్యయం పెంపుతోపాటు కస్టమ్, ఎక్సైజ్ డ్యూటీ ప్రయోజనాలు పొందినట్టు ఈ కంపెనీలపై ఆరోపణ. దీంతో జీవీకే గ్రూప్‌నకు చెందిన 11 కంపెనీల ఖాతాల తనిఖీకి ఎంసీఏ చర్యలు ప్రారంభించినట్టు తెలుస్తోంది. వీటిలో జీవీకే పవర్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ముంబై ఇంటర్నేష నల్ ఎయిర్‌పోర్ట్, జీవీకే జైపూర్ ఎక్స్‌ప్రెస్‌వే, నవీ ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ తదితర కంపె నీలు ఉన్నాయి. కాగా, ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కు (ఎంఐఏఎల్) మాత్రమే ఎంసీఏ పశ్చిమ ప్రాంత రీజినల్ డైరెక్టర్ నుంచి సమా చారం అందిందని జీవీకే వెల్లడించింది. పలు అంశాలపై సమాచారం మాత్రమే వారు కోరారని కంపెనీ తెలిపింది. మీడియాలో వస్తున్న ఆరోప ణల్లో నిజం లేదని, ఎంసీఏకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని జీవీకే వివరించింది.

## టెక్నాలజీ ఆసరాగా భద్రత:ఉబెర్



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** సాంకేతిక తను జోడించి ప్రయా ణికుల భద్రతకు పెద్ద పీట వేస్తున్నట్టు ఉబెర్ వెల్లడించింది. ఆపద సమయాల్లో 24 గంటలూ అందుబాటులో ఉండే సేఫ్టీ లైన్‌ను ఇటీవలే ప్రవేశ పెట్టినట్టు సేఫ్టీ కమ్యూనికేషన్స్ అసోసియేట్ స్నేహ దేవ్ మంగళవారమిక్కడ మీడియాకు తెలి పారు. 'ఉబెర్ యాప్‌లో ఎప్పటికప్పుడు సేఫ్టీ ఫీచర్స్‌ను జోడిస్తున్నాం. ఎస్‌వోఎస్ బటన్‌తో 100 నంబరుకు డయల్ చేయవచ్చు. డ్రైవరుకు ప్రయాణికుడి నంబరు కనపడకుండా ఏర్పాటు ఉంది. డ్రైవర్ల స్క్రీనింగ్, బ్యాక్‌గ్రౌండ్ చెక్ అంతా థర్డ్ పార్టీ చేస్తోంది. ట్రిప్స్, రేటింగ్, ఎంత కాలం నుంచి డ్రైవర్‌గా చేస్తున్నదీ వివరాలు డిస్‌ప్లే అవుతాయి. డ్రైవర్ పార్ట్‌నర్ ఆన్‌లైన్‌లోకి వచ్చి నప్పుడు సెల్ఫీ తీసుకోవాల్సిందే. ఈ విధానంలో ఇతరులను చెక్ పెట్టవచ్చు' అని వివరించారు. సెప్టెంబర్ నుంచి నవంబర్ వరకు సేఫ్టీ నెవర్ స్టాప్స్ పేరుతో కంపెనీ దేశవ్యాప్తంగా ప్రచార కార్యక్రమం నిర్వహిస్తోంది.




## కర్ణాటక బ్యాంక్ లాభం 5 శాతం డౌన్

**న్యూఢిల్లీ:** ప్రైవేట్ రంగ కర్ణాటక బ్యాంక్ నికర లాభం సెప్టెంబర్ త్రైమాసికంలో 5 శాతం తగ్గిం ది. గత ఆర్థిక సంవత్సరం క్యూ2లో రూ.112 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ2లో రూ.106 కోట్లకు తగ్గిందని బ్యాంక్ వెల్లడించింది. మొండి బకాయిలు స్వల్పంగా పెరగడంతో నికర లాభం తగ్గిందని కర్ణాటక బ్యాంక్ ఎమ్‌డీ, సీఈఓ ఎమ్.ఎస్. మహాబలేశ్వర చెప్పారు. మొత్తం ఆదాయం రూ.1,654 కోట్ల నుంచి రూ.1,938 కోట్లకు పెరిగిందని వివరించారు.

## బోర్డ్ సమావేశాలు

ఫెడరల్ బ్యాంక్, ఆదిత్య బిర్లా మనీ, డీబీ కార్ప్, మైండ్ ట్రీ, హాత్‌వే కేబుల్ అండ్ డేటాకామ్

## రౌండప్

# రైతు బాగుంటేనే అభివృద్ధి

- అందుకే చెప్పినదానికంటే మిన్నగా భరోసా
- వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్ పథకం ప్రారంభోత్సవంలో ఏపీ సీఎం జగన్

**సాక్షి ప్రతినిధి, నెల్లూరు:** ''చెప్పిన దాని కన్నా ముందుగా.. మాట ఇచ్చిన దాని కన్నా మిన్నగా రైతు భరోసా పథకాన్ని తీసుకువ చ్చాం.. అభివృద్ధి అంటే జీడీపీ లెక్కలు కాదు.. రైతు కుటుం బాలు బాగుంటేనే అభివృద్ధి.. అప్పుడే రాష్ట్రం బాగుంటుంది.. రైతు భరోసాగా ఉంటేనే రాష్ట్రానికి కూడా భరోసా.. అన్నదాత లను ఆదుకునే దిశగా రాబోయే రోజుల్లో ఇంకా గొప్పగా మార్పులు తీసుకొస్తాం'అని ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గం కాకుటూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యా లయం ప్రాంగణంలో మంగళవారం 'వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్'పథకాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన ప్రసంగించారు. అన్నం పెట్టే రైతులకు అండగా ఉండాలని, తోడుగా నిలవాలని ఈ పథకాన్ని తెచ్చామన్నారు. ''బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలలో భూమి లేని వాళ్లే చాలా మంది ఉన్నారు. అలాంటి భూమి లేని నిరుపేదలకు కూడా మంచి చేయాలన్న ఆరాటంతో వారికి కూడా రూ.13,500 ఇవ్వడానికి ఈ పథకం ద్వారా శ్రీకారం చుట్టాను. దాదాపు 51 లక్షల మంది రైతు కుటుంబాలకు ఈ పథకం ద్వారా లబ్ధి కలిగించాలని నిర్ణయిం చాం. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు ఈ పథకం కింద కౌలు రైతులుగా నమోదైన 3 లక్షల మందికి కూడా మొత్తంగా 54 లక్షల మంది రైతన్నలకు ఈ పథకం అమలు చేసే అవకాశాన్ని దేవుడు నాకిచ్చాడని సగర్వంగా చెబుతున్నాను. మొత్తంగా చెప్పింది రూ.12,500 అయినా, ఈ సంవత్సరం ఇస్తామని చెప్ప కపోయినా రూ.12,500 బదులు రూ.13,500 ప్రతి రైతుకు ఇచ్చే ప్రయత్నం చేస్తున్నాం. ఆర్థిక పరిస్థితులు అంతంతమాత్రంగానే ఉన్నా ఇస్తున్నాం. చెప్పిన దాని కంటే ముందుగా, మాటిచ్చిన దాని కంటే మిన్నగా మీ బిడ్డ అడుగులు ముందుకువేస్తున్నాడని సగర్వంగా చెబుతున్నాను'' అని అన్నారు.




నెల్లూరు జిల్లా కాకుటూరులో జరిగిన కార్యక్రమంలో రైతులకు చెక్ అందజేస్తున్న ఏపీ సీఎం జగన్

## టీవీవీ అధ్యక్షుడు మద్దిలేటి అరెస్టు

### టీపీఎస్ ఉపాధ్యక్షుడు నలమాస కృష్ణ కూడా..

**హైదరాబాద్:** తెలంగాణ విద్యా వేదిక అధ్యక్షుడు మద్దిలేటి, టీపీఎఫ్ ఉపాధ్యక్షుడు నలమాస కృష్ణను టీపీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో సీసీఎస్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. మద్దిలేటిని తమకు అప్పగిం చాలని కోరగా అందుకు నలమాస కృష్ణ అడ్వొకేట్ వచ్చేంత వరకూ సమ యమివ్వాలని కోరారు. అయితే పోలీసుల అందుకు అంగీకరించలేదు. మద్దిలేటిని అప్పగించకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆయనను బెదిరించడంతో నలమాస తలుపులు తీశారు. వెంటనే పోలీసులు మద్దిలే టితో పాటు నలమాస కృష్ణను కూడా బలవంతంగా వాహనం ఎక్కిం చారు. కాగా, పోలీసులు వీరిని ఎక్కించిన వాహనం మహారాష్ట్రకు చెంది నదిగా ఉండటంతో నలమాస కృష్ణ భార్య సంధ్యతోపాటు మరో మహిళ కూడా వాహనం ఎక్కినట్లు తెలుస్తోంది.

## 'మద్దిలేటి, కృష్ణలను విడుదల చేయాలి'

**హైదరాబాద్:** అక్రమంగా అరెస్టు చేసిన టీవీవీ అధ్యక్షుడు మద్దిలేటి, టీపీ ఎఫ్ ఉపాధ్యక్షుడు నలమాస కృష్ణలను బేషరతుగా విడుదల చేయాలని వామపక్ష, విప్లవ పార్టీలు, ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశాయి. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో మానవ హక్కుల వేదిక అధ్యక్షుడు ఎస్.జీవన్‌కుమార్ తదితరులు మాట్లాడారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ 23 సంఘాలను నిషేదిస్తు న్నట్లు ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు.

## ఆ ఇద్దరినీ హాజరుపర్చండి: హైకోర్టు

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ ప్రజా ఫ్రంట్ నాయకుడు ఎన్.కృష్ణ, తెలుగు విశ్వవిద్యాలయం ఎంసీజే విద్యార్థి బి.మద్దిలేటిలను బుధవారం తమ ఎదుట హాజరుపర్చాలని పోలీసుల్ని హైకోర్టు ఆదేశించింది. వారిని పోలీసులు అక్రమంగా నిర్బంధించారని, వారి ప్రాణాలకు ముప్పు ఉన్నందున హైకోర్టులో హాజరుపర్చేలా ఉత్తర్వులివ్వాలని కోరుతూ హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలైంది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డి లతో కూడిన ధర్మాసనం మంగళవారం ఆ పిటిషన్‌ను విచారించింది.

## రవిప్రకాశ్ కస్టడీ పిటిషన్ కొట్టివేత

**సాక్షి, హైదరాబాద్:** టీవీ9 మాజీ సీఈవో రవిప్రకాశ్‌ను తమ కస్టడీకి ఇవ్వాలని పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌ను నాంపల్లి కోర్టు కొట్టివేసిం ది. విచారణ జరిగినందున కస్టడీ అవసరం లేదని స్పష్టం చేసింది.

## విజయ ఉత్పత్తుల విక్రయాలకు 500 ఔట్‌లెట్లు : తలసాని

**సాక్షి, హైదరాబాద్:** విజయ డెయిరీ పాలు, పాల ఉత్పత్తుల విక్రయాలను మరింతగా పెంచేందుకు జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ పరిధిలో నూతనంగా 500 ఔట్‌లెట్లు ప్రారంభించనున్నట్లు పశుసంవర్ధక మంత్రి తలసాని శ్రీని వాస్‌యాదవ్ వెల్లడించారు. మంగళవారం విజయ డెయిరీ బోర్డు సమా వేశం జరిగింది. ఈ సమావేశంలో పశుసంవర్ధక శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, విజయ డెయిరీ చైర్మన్ లోక భూమారెడ్డి, ఎండీ శ్రీనివాసరావు, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. జాతీయ రహదారుల వెంట విజయ ఉత్పత్తుల విక్రయ కేంద్రాలు, విజయ ఉత్ప త్తులు తెలిపేలా హోర్డింగ్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల్లో విజయ డెయిరీ ఉత్పత్తులను విని యోగించేలా ఆదేశాలు ఇచ్చేందుకు సీఎం కేసీఆర్‌ను కలవనున్నట్లు పేర్కొ న్నారు. ప్రైవేటు డెయిరీల ఉత్పత్తుల ధరలకు అనుగుణంగా విజయ డెయిరీ ఉత్పత్తుల ధరలపై నిర్ణయం తీసుకునే విషయాన్ని పరిశీలించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అన్ని దేవాలయాల్లో విజయ నెయ్యి మాత్రమే వినియోగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. మేడారం జాతరలో 150 మొబైల్ ఔట్‌లెట్ల ద్వారా విజయ ఉత్పత్తులను విక్రయించాలని ఆదేశించారు. విజయ ఉత్పత్తుల విక్రయాలను పెంచేందుకు సహకారం అందిస్తామని సమావేశంలో పాల్గొన్న అధికారులు హామీ ఇచ్చారు.

# పర్యావరణ పరిరక్షణకు చేయి కలపాలి

**'ఈస్టర్న్ ఘాట్స్ ఎన్విరాన్‌మెంట్ ఔట్ లుక్' పుస్తకావిష్కరణలో ప్రణబ్ ముఖర్జీ**




**సాక్షి, న్యూఢిల్లీ:** పర్యావరణ పరిరక్షణలో అత్యంత ప్రాధాన్య అంశంగా తూర్పు కనుమలను చూడాల ని, ఈ ప్రాంతంలోని ఉన్నత విద్యా సంస్థలు పర్యా వరణ పరిరక్షణకు పాటుపడాలని, సంస్థలు, పౌరులు, రాజకీయ పార్టీలు ఈ ఉదాత్తమైన లక్ష్యం కోసం చేతులు కలపాలని భారత మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ పిలుపునిచ్చారు. పర్యావరణ సంస్థలు గ్రీన్స్ అలయన్స్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ ఈస్టర్న్ ఘాట్స్ (గ్రేస్), కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివ ల్యూషన్ (సీజీఆర్) సంయుక్త ఆధ్వర్యంలో, రచయితలు పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.సా యిభాస్కర్‌రెడ్డి, జీవ వైవిధ్య నిపుణుడు డాక్టర్ కె.తులసీరావు, పర్యావరణ శాస్త్రవేత్త సి.ఉమామ హేశ్వరరెడ్డి రచించిన 'ఈస్టర్న్ ఘాట్స్ ఎన్విరాన్ మెంట్ ఔట్ లుక్'పుస్తకాన్ని ఆయన మంగళవారం రాత్రి ఇక్కడి అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో ఆవిష్కరించారు. గ్రేస్ తెచ్చిన ఈ పుస్తకం తూర్పు కనుమల జీవ వైవిధ్య పునరుద్ధరణకు కారణం కావాలని ఆకాంక్షించారు. ఈ పుస్తకం తూర్పు కను మల పరిరక్షణలో భాగస్వాములందరికీ స్ఫూర్తిని స్తుందని వివరించారు. 'తూర్పు కనుమలు దేశంలోని అత్యంత ముఖ్యమైన పర్యావరణ ప్రాంతం. కానీ ఇటీవలి కాలంలో మైనింగ్, ప్రాజె క్టుల నిర్మాణం కారణంగా ఈ ప్రాంతం గతంలో ఎన్నడూ లేనంత సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. తూర్పు కనుమల్లో సగానికి సగం పర్యావరణం తుడిచిపెట్టుకుపోయిందని తెలుసుకుని చింతించా ను'అని పేర్కొన్నారు. రచయితలను, సీజీఆర్, గ్రేస్ సంస్థలను ప్రణబ్ ముఖర్జీ అభినందించారు. పర్యావరణవేత్త, సుప్రీంకోర్టు న్యాయవాది ఎం.సి.మెహతా మాట్లాడుతూ దేశ సహజ వనరు లను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. గ్రేస్ సంస్థ చైర్మన్, సాక్షి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ ఆర్.దిలీప్ రెడ్డి మాట్లాడుతూ, అనేక మంది భాగస్వాములతో సంప్రదింపులు జరిపి ప్రభావశీలంగా ఉండేలా ఈ పుస్తకాన్ని రూపొందించామని, తూర్పు కనుమల్లో జీవ వైవిధ్య పరిరక్షణకు వీలుగా ప్రాంతీయ, జాతీయ స్థాయి సదస్సులు నిర్వహించామని తెలిపారు. పర్యావరణవేత ప్రొఫెసర్ కె.పు రుషోత్తంరెడ్డి, సీజీఆర్ అధ్యక్షురాలు కె.లీలాలక్ష్మా రెడ్డి ప్రసంగించారు.

## ప్రజాసంఘాల నిషేధ ప్రకటనపై సర్కార్ వైఖరేంటి?: చాడ

**సాక్షి, హైదరాబాద్:** వివిధ ప్రజాసంఘాలను నిషే ధిస్తున్నట్లు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ చేసిన ప్రకటనపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి తెలియజేయాలని సీపీఐ డిమాండ్ చేసింది. ప్రతీ పౌరుడికి చట్ట పరి ధిలో ఉద్యమాలు, పోరాటాలతోపాటు తమ భావాలను వెలిబుచ్చే హక్కులున్నాయని సీపీఐ కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ వైఫ ల్యాలు, ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేం దుకు చట్టంలోనే వెసులుబాటు ఉందని ఆయన పేర్కొన్నారు.

# జీతాలు సకాలంలో చెల్లించేలా చూడండి

**హరీశ్‌రావుకు ఈటల వినతి**

**సాక్షి, హైదరాబాద్:** వైద్య ఆరోగ్య శాఖలో జీతాలు సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆర్థికశాఖ మంత్రి హరీశ్ రావును వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ కోరారు. మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్ సమావేశమ య్యారు. ఈ సందర్భంగా శాఖకు అవసరమైన బడ్జెట్ కేటా యింపులపై చర్చ జరిగింది. ప్రధానంగా కేసీఆర్ కిట్‌కు డబ్బులు, అత్యవసరమైన మందులు, మౌలిక సదుపాయాలు, పోస్టుల మంజూరు వంటి అంశాలు చర్చకు వచ్చినట్లు సమా చారం. క్షేత్రస్థాయిలో తమకు ఆర్థికంగా ఎదురవుతున్న ఇబ్బం దులను హరీశ్‌రావు దృష్టికి ఈటల తీసుకెళ్లారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ వేతనాలు మాత్రం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వైద్య ఆరోగ్యశాఖలో పొదుపు పాటించాలని, దుబారా ఖర్చులు తగ్గించుకోవాలని సమావే శంలో అధికారులను మంత్రులు ఆదేశించినట్లు తెలిసింది. ఉన్న నిధులతోనే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ప్రతీనెలా ఆరోగ్యశాఖకు కావాల్సిన బడ్జెట్‌ను సకాలంలో విడుదల చేయాలని ఈటల కోరారు. సమావేశం నిర్ణయాలను ఎట్టి పరిస్థితుల్లో బయటకు పొక్కనీయకుండా చూడాలని అధికారులకు హెచ్చరికలు జారీచేశారు. ఈ సమావే శంలో పలు ఆర్థిక సమస్యలు ముందుకు వచ్చినందున బయ టకు సమాచారం వెళితే బాగుండదని చెప్పినట్లు తెలిసింది.

## శాసన మండలి విప్‌గా దామోదర్‌రెడ్డి

**సాక్షి, హైదరాబాద్:** శాసన మండలిలో ప్రభుత్వ విప్‌గా కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. శాసన మండలి ఆవర ణలో తనకు కేటాయించిన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించిన దామోదర్ రెడ్డికి వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డితో పాటు పలువురు అభినందనలు తెలిపారు. నాగర్ కర్నూలు ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావుతో పాటు పలువురు టీఆర్‌ఎస్ నేతలు అభినందించారు. ప్రభుత్వ విప్‌గా తనకు అవ కాశం కల్పించిన సీఎం కేసీఆర్‌కు దామోదర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
సమాచార మరియు పౌర సంబంధాల శాఖ
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కార్యక్రమాల కోసం డిజిటల్ లైవ్ స్ట్రీమింగ్ మరియు సోషల్ మీడియా కవరేజ్ కొరకు ప్రతిపాదనల కోసం అభ్యర్థన (RFP)
Tender Notice No. 005031/VE/DE/2019
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కార్యక్రమాల కోసం డిజిటల్ లైవ్ స్ట్రీమింగ్ మరియు సోషల్ మీడియా కవరేజ్ ఏర్పాటు చేయుటకు ప్రముఖ ఏజెన్సీల నుండి I&PR శాఖ ప్రతిపాదనల కోసం అభ్యర్థన (RFP) కోరుతోంది. టెండరు షెడ్యూలు (RFP) ధర: రూ. 10,000/– (వాపసు రానిది) మరియు బయానా: రూ. 5,00,000/–. టెండరు షెడ్యూలు ధరను మరియు బయానాను "Accounts Officer, I&PR Department, Vijayawada" పేరున జాతీయ బ్యాంకు నుండి తీసిన DD రూపంలో చెల్లించవలెను. ఆసక్తిగల బిడ్డర్లు టెండరు షెడ్యూలు (RFP)ని కమిషనర్ కార్యాలయం, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ, 2వ అంతస్తు, డా. NTR అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్, విజయవాడ నుండి 17.10.2019 నుండి 31.10.2019 వరకు కార్యాలయ పనివేళలలో వ్రాతపూర్వక అభ్యర్థనపై పొందవచ్చును. సీల్డ్ టెండర్లు 01.11.2019న మ. 1.00 గం.కు లేదా ఆలోగా ఈ కార్యాలయానికి చేరవలెను. తదుపరి వివరాలను వెబ్‌సైట్ www.ipr.ap.nic.in లో చూడవచ్చును లేదా సంప్రదించండి: శ్రీ ఓ. మధుసూదన, చీఫ్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్, మొబైల్ నం: 9121215239
సం/– టి. విజయ్‌కుమార్ రెడ్డి, IIS, కమిషనర్, I&PR
DIPR RO.No.839/CL/Advt/1/1/2019-20, Dt. 15.10.2019

## నేడు, రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బుధ, గురు వారాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రానున్న 48 గంటల్లో భారతదేశంలో చాలా ప్రాంతాల నుంచి నైరుతి రుతుపవనాలు ఉపసంహరించడానికి అనుకూల పరిస్థితులు ఏర్పడి, ఆగ్నేయ భారతంలో ఈశాన్య రుతుపవన వర్షాలు ప్రారంభం కావడానికి అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని వెల్లడించింది. మంగళవారం ఖమ్మం జిల్లాలోని ఎంకూరులో 3 సెం.మీ., సూర్యాపేట్‌లో 2 సెం.మీ. చొప్పున వర్షపాతం నమోదైనట్లు పేర్కొంది.

## ఎఫ్‌బీవో పోస్టులకు 239 మంది ఎంపిక

సాక్షి, హైదరాబాద్: ఏజెన్సీ స్థానికత వారిగా జిల్లా కలెక్టర్‌లు క్లియరెన్స్ ఇచ్చిన 239 మంది అభ్యర్థులను ఫారెస్టు బీట్ ఆఫీసర్ పోస్టులకు ఎంపిక చేశామని టీఎస్‌పీఎస్సీ ఓ ప్రకటనలో తెలిపింది. కోర్టు ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్‌ల నుంచి అభ్యర్థుల స్థానికతపై నివేదికలు తీసుకున్నామని, ఆ జాబితాను ఫారెస్టు డిపార్ట్‌మెంట్‌కు పోస్టింగ్‌ల కోసం పంపామని పేర్కొంది. పాత మహబూబ్‌నగర్ (అచ్చంపేట్ డివిజన్), ఖమ్మం (భద్రాచలం, కొత్తగూడెం, పాల్వంచ, ఖమ్మం), వరంగల్ (వరంగల్ ఉత్తర, దక్షిణ డివిజన్‌లు) జిల్లాల్లో అభ్యర్థులను ఎంపిక చేసినట్లు వివరించింది.

## పలు మార్గాల్లో ప్రత్యేక రైళ్లు

సాక్షి, హైదరాబాద్: దీపావళి రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేష్ ఓ ప్రకటనలో తెలిపారు. కాకినాడ–సికింద్రాబాద్ (07054) రైలు ఈనెల 28వ తేదీ రాత్రి 8 గంటలకు కాకినాడలో బయలుదేరి మరుసటి ఉదయం 7.40కి సికింద్రాబాద్ చేరుకుంటుంది. విల్లుపురం–సికింద్రాబాద్ (06043/06044) రైలు నవంబర్ 6, 13, 20, 27, డిసెంబర్ 4, 11, 18, 25 తేదీల్లో విల్లుపురంలో సాయంత్రం 4 గంటలకు బయలుదేరి మరుసటి ఉదయం 8.25కు సికింద్రాబాద్ చేరుకుంటుంది. తిరిగి నవంబర్ 7, 14, 21, 28, డిసెంబర్ 5, 12, 19, 26 తేదీల్లో రాత్రి 8 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మరుసటి మధ్యాహ్నం 2 గంటలకు విల్లుపురం చేరుకుంటుంది.

## బీఎస్ఎన్ఎల్ వార్షిక ప్లాన్‌పై అదనపు కాలపరిమితి ఆఫర్

సాక్షి, హైదరాబాద్: బీఎస్ఎన్ఎల్ సంస్థ ప్రీ పెయిడ్ మొబైల్ వార్షిక ప్లాన్ –1699పై అదనపు కాలపరిమితి ఆఫర్ ప్రకటించింది. ప్రస్తుతం వార్షిక ప్లాన్ 365 రోజులు కాలపరిమితి ఉండగా ఆఫర్ కింద అదనంగా మరో 90 రోజులు వర్తింపజేయనుంది. దీంతో వార్షిక ప్లాన్ కాలపరిమితి 455 రోజులు వర్తించనుంది. తెలుగు ఉమ్మడి రాష్ట్రాల్లో ఈ ఆఫర్ ఈనెల 30 వరకు అందుబాటులో ఉంటుందని తెలంగాణ టెలికం సర్కిల్ సీజీఎం వి.సుందర్ తెలిపారు.

## ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్ పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం 2020 షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది. కొత్తగా ఓటర్ నమోదు దరఖాస్తులతో పాటు ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు, తప్పుల దిద్దుబాటు కోసం మళ్లీ అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొంది. నవంబర్ 18 నాటికి ఓటర్ల జాబితా పరిశీలన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపింది. నవంబర్ 25న ముసాయిదా జాబితాను ప్రకటిస్తామని, అప్పటి నుంచి డిసెంబర్ 24 వరకు అభ్యంతరాలు తెలుపుకోవచ్చని, కొత్త దరఖాస్తులు కూడా చేసుకోవచ్చని సూచించింది. వచ్చే జనవరి 20న ఓటర్ల తుది జాబితాను ప్రకటించనున్నట్లు పేర్కొంది. బూత్‌స్థాయి అధికారులు ఇంటింటికి తిరిగి ఓటర్ల జాబితా పరిశీలన కార్యక్రమం నిర్వహిస్తారని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి రజత్‌కుమార్ వెల్లడించారు.

# లిక్కర్ షాపులకు కిక్కు




సాక్షి, హైదరాబాద్: మద్యం దుకాణాల కోసం భారీ స్పందన నమోదవుతోంది. పెద్ద సంఖ్యలో వ్యాపారులు క్యూ లైన్లలో బారులు తీరి దరఖాస్తు చేస్తున్నారు. మహిళలు, యువత సైతం పెద్దసంఖ్యలో దరఖాస్తులు సమర్పిస్తుండటం విశేషం. మంగళవారం ఒక్కరోజే ఎక్సైజ్ శాఖకు దాదాపు పది వేల దరఖాస్తులు అందాయి. బుధవారం సాయంత్రం 4 గంటలకు వైన్ షాపుల దరఖాస్తు గడువు ముగియనుండగా, ఇప్పటివరకు 20,630 దరఖాస్తులు వచ్చాయి. బుధవారం చివరిరోజు కావడంతో మరింత ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు దాఖలయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనావేస్తున్నారు. 2017లో వచ్చిన 41 వేల దరఖాస్తులతో పోల్చితే ఈ ఏడాది దరఖాస్తుల సంఖ్య పెరుగుతుందని భావిస్తున్నారు. దరఖాస్తు ఫీజు సైతం భారీగా పెరగడంతో గడువు ముగిసే నాటికి రూ.800 కోట్లకు చేరుకునే అవకాశం ఉందంటున్నారు. దరఖాస్తు ఫీజుల వసూళ్లు బుధవారానికి రెండింతలయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. మంగళవారం రాత్రి 8.30 గంటల వరకు 2,216 షాపులకుగాను మొత్తం 20,630 దరఖాస్తులు అందగా, ఒక్కరోజే 9,788 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఫీజుల రూపంలోనే ఇప్పటిదాకా రూ.412 కోట్లు ఎక్సైజ్‌శాఖకు జమ య్యాయి.







Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.